thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 304 | కరీంనగర్ శనివారం, 10 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

# కేసీఆర్‌కు భారీ ప్రాధాన్యం... రేవంత్ రెడ్డి వ్యూహమేంటి?

హైదరాబాద్ : ఏ రాష్ట్రంలో అయినా ప్రతిపక్ష నాయకులకు ప్రభుత్వాలు పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వవు. సహజంగా రాజకీయ వైరాన్ని కొనసాగిస్తాయి. ఏపీ సహా కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఈ తరహా వాతావరణం కనిపిస్తోంది. అయితే.. దీనికి భిన్నంగా తెలంగాణలో మాత్రం ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు మాత్రం రేవంత్ రెడ్డి సర్కారు ఎనలేని ప్రాధాన్యం ఇస్తోంది. ఇటీవల అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు హాజరైన కేసీఆర్‌ను సభలోనే సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన కుర్చీవద్దకు వెళ్లి చేతిలో చేయి వేసి పలకరించారు. గతంలో ఎప్పుడూ.. ఇలాంటి మర్యాదలు.. పాటించిన దాఖలాలు లేవు. ప్రతిపక్ష నేతలే అధికార పక్ష నాయకులకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ, దీనికి విరుద్ధంగా.. రేవంత్ రెడ్డి పెద్దమనసు చేసుకుని కేసీఆర్‌ను గౌరవించారు. ఇక ఇప్పుడు కూడా ఇలాంటి పరిణామమే చోటు చేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. రెండుసార్లు తెలంగాణ పండుగగా పేర్కొనే మేడారం జాతర జరిగింది.



అయితే.. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి ఇంటికి వెళ్లి ఆయనకు ఆహ్వాన పత్రికను ఇచ్చింది లేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. కూడా ఆయన కూడా ప్రధాన ప్రతిపక్షన్ని పెద్దగా పట్టించుకోలేదు. కానీ, ఈ దఫా మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు స్వయంగా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్‌కువెళ్లి మేడారం జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందించారు.

రావాలని పిలిచారు. అంతేకాదు.. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్టు మంత్రులు పేర్కొన్నారు. ఇలా కేసీఆర్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది. ప్రజల్లో సహజంగా సింపతీ ఉంటుంది. ప్రధానంగా కేసీఆర్‌ను గౌరవించడం: పార్టీలకు అతీతంగా.. కేసీఆర్‌ను గౌరవించాలని కోరుకునే సమాజం ఉంది. ఆయనను అవమానిస్తే.. దానిని ప్రత్యేకంగా చర్చించే అవకాశం ఉంటుంది. అందుకే.. రాజకీయాలు ఎలా ఉన్నా.. వ్యక్తిగా, తెలంగాణకు పెద్దగా కేసీఆర్‌ను గౌరవించడం ద్వారా ప్రజల్లో ఉన్న సెంటిమెంటు వ్యతిరేకత కాకుండా చూసుకునే వ్యూహంతోనే రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని అంటున్నారు పరిశీలకులు.





రాయ్‌పూర్ : ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తి.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. ఈ రోజు లొంగిపోయిన మొత్తం మావోయిస్టులపై రూ.కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు (ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు.

# కాంగ్రెస్‌కు తలనొప్పిగా క్షత్రస్థాయి పదవుల పందేరం

## జిల్లా కాంగ్రెస్ పదవులు ఎవరికి ఇస్తే ఏం తంటా వస్తుందోననే ఆందోళన

## ఎవరికిస్తే ఏమవుతుందో?



## మండల పార్టీ అధ్యక్షలను మార్చాల్సిరావడంతో కొత్త సమస్యలు వచ్చే అవకాశం

## ఇన్ని రోజులు ఆగి మున్సిపోల్స్ ముందు ఎందుకంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్: క్షత్రస్థాయిలో పార్టీ పదవుల పందేరం అధికార కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారుతోంది. ఇటీవలే పంచాయతీలకు ఎన్నికలు ముగిసి ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ కమిటీల కూర్పు ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోననే ఆందోళన ఆ పార్టీ నేతల్లో ఉంది. ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలన్న పీసీసీ ఆదేశాల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లతోపాటు మండల పార్టీ అధ్యక్ష హోదాల్లో ఎవరిని నియమిస్తే ఏం జరుగుతుందోనని మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు గుబులు చెందుతున్నారు. ముఖ్యంగా మండల పార్టీ అధ్యక్షల నియామకం మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎలాంటి తంటా తెచ్చిపెడుతుందోననే ఆలోచనతో డీసీసీ అధ్యక్షలకు పేర్లు ఇచ్చేందుకూ వారు వెనుకాడుతుండటం గమనార్హం.

**పేరుకే డీసీసీలు..** డీసీసీ అధ్యక్షల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొత్తగా నియమితులైన తమకు పార్టీ పదవుల నియామకాల్లో ఎలాంటి స్వేచ్ఛను ఇవ్వడం లేదని వాపోతున్నారు. పార్టీ పదవుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు పేర్లు ఇచ్చి వాటినే చేర్చాలని ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు. పీసీసీ మార్గదర్శకాలను కూడా పాటించలేని పరిస్థితుల్లో తామున్నామని చెబుతుండటం గమనార్హం. ఈ పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కనిపిస్తోంది. కొన్నిచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలకు అనుకూలంగా లేని వారు డీసీసీ అధ్యక్షలుగా నియామకం కావడంతో అలాంటి జిల్లాల్లో ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ఎట్టి పరిస్థితుల్లో తామిచ్చిన పేర్లను డీసీసీ కమిటీల్లో ఉంచాలని మంత్రులు, ఎమ్మెల్యేలు కోరుతున్నారని, వారి సూచనల మేరకు కార్యవర్గం ఏర్పాటు చేసి భవిష్యత్తులో జిల్లాలో పార్టీని ఎలా ముందుకు నడిపించాలని డీసీసీలు ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల టికెట్ల కేటాయింపులో కూడా తమ మాటకు విలువ ఇస్తామని పీసీసీ, ఏఐసీసీ చెబుతున్నప్పటికీ క్షత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని అంటున్నారు. కనీసం పార్టీ కార్యవర్గంలో పదవులు ఇచ్చే అధికారం కూడా తమకు లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇన్నాళ్లూ పార్టీ కమిటీలను ఏర్పాటు చేయకుండా జాప్యం చేసిన పీసీసీ.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ కమిటీలను పూర్తి చేయాలని ఆదేశించడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని డీసీసీ అధ్యక్షలు చెబుతున్నారు.

మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం వేరేలా ఉందని, మున్సిపల్ ఎన్నికలు అయిపోయాక జిల్లా కమిటీలను ప్రకటించాలని కోరుతున్నారని, ఈ అంశాన్ని పీసీసీ పరిగణనలోకి తీసుకోవాలని, జిల్లా కార్యవర్గం కూర్పులో డీసీసీలకూ కోటా పెట్టాలని వారు కోరుతుండటం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయమై జిల్లా మంత్రికి ఇష్టం లేకుండా నియమితుడైన దక్షణ తెలంగాణకు చెందిన డీసీసీ అధ్యక్షడు ఒకరు మాట్లాడుతూ.. 'ఇప్పటికే పార్టీ కార్యక్రమాల్లో కూడా మా ఫొటోలు పెట్టని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన పేర్లతో జిల్లా కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేసి మేము ఏం చేయాలి? రేపు మా మాట ఎవరు వింటారు? పార్టీని నడిపేదెట్టా? ఆరునెలల పనితీరును చూసి అవసరమైతే డీసీసీ అధ్యక్ష పదవులు తీసేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మరి ఈ సిఫారసులు, ఒత్తిళ్లను ఎలా తట్టుకోవాలో.. మున్ముందు ఎలా పనిఏయాలో అర్థం కావడం లేదు' అని వ్యాఖ్యానించారు.

**కార్యవర్గం కూర్పు ఇలా..!...** జిల్లా కాంగ్రెస్ కమిటీల కూర్పునకు పీసీసీ మార్గదర్శకాలను రూపొందించింది. పీసీసీ సూచించిన ప్రకారం ప్రతి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల వారీగా డీసీసీ కార్యవర్గం సంఖ్య ఖరారు కానుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు బ్లాకులు ఏర్పాటు చేసి, ప్రతి బ్లాక్ నుంచి ఒక డీసీసీ ఉపాధ్యక్షడు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులను నియమించనున్నారు.

అదేవిధంగా ప్రతి డీసీసీకి ఒక కోశాధికారిని నియమిస్తారు. దీంతోపాటు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి డీసీసీ అధికార ప్రతినిధి, ప్రతి మండలం నుంచి డీసీసీ కార్యదర్శిని ఎంపిక చేస్తారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లోని మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంచార్జీలు, ఇతర సీనియర్ నేతల సిఫారసులను పరిగణనలోకి తీసుకుంటారు. డీసీసీ కార్యవర్గాల కూర్పులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పార్టీలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న సీనియర్లకు ఆఫీస్ బేరర్లలో అవకాశం కలి?పంచాలని పీసీసీ నిర్ణయించింది. బీఆర్ఎస్ లేదా ఇతర పార్టీల నుంచి కొత్తగా కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికీ స్థానిక పరిస్థితుల ఆధారంగా 20-30 శాతం పదవులు ఇవ్వాలని చెప్పింది.



# పురుషులకు ఫ్రీ బస్..!!

# తెలుగోళ్లకు గుడ్ న్యూస్...

## మహిళలకే కాదు పురుషులకు ఉచితం!

## దివ్యాంగ పురుషులకూ ఆర్టీసీ ఉచిత ప్రయాణం!!

హైదరాబాద్ / అమరావతి : ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోనూ మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అమలవుతోంది. రాబోయే రోజుల్లో కొందరు పురుషులకు కూడా ఈ సౌకర్యం లభించనుంది. ఈ దిశగా తెలుగు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. తెలుగు రాష్ట్రాల మహిళలు ప్రస్తుతం ఎలాంటి ఖర్చు లేకుండానే ఆర్టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు మహిళలకు ఈ సౌకర్యం కల్పించాయి. ఆర్థికంగా బారం అయినప్పటికీ మహిళా సాధికారత కోసం ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నామని అటు చంద్రబాబు సర్కారు, ఇటు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతున్నాయి. అయితే కేవలం మహిళలకేనా..? పురుషులేం చేశారు..? వారుకూడా ఓటేస్తేనేగా మీరు గెలిచింది.. ప్రభుత్వాలు ఏర్పాటుచేసింది? అంటూ ప్రశ్నిస్తున్నారు కొందరు మగవారు. ఈ క్రమంలో ఆసక్తికర నిర్ణయాలు జరుగుతున్నాయౌ అందరికి కాదుగానీ కొందరు మగాళ్లకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నాయి. ఇందుకోసం ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు... త్వరలోనే మగాళ్లు కూడా ఆర్టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే రోజులు వస్తాయని స్వయంగా మంత్రులు వెల్లడిస్తున్నారు. ఇంతకూ ఈ ఉచిత ప్రయాణ సదుపాయం పొందే మగవారు ఎవరో ఇక్కడ తెలుసుకుందాం. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం పథకంలో భాగస్వామ్యం చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం మహిళలు ప్రయాణిస్తున్నట్లే దివ్యాంగులు కూడా ఉచితంగా బస్సులో ప్రయాణించే సదుపాయం కల్పిస్తామన్నారు. ఇప్పటికే అధికారులు రాష్ట్రంలోని దివ్యాంగులు ఎంతమంది ఉన్నారు..? వీరికి ఉచిత బస్సు ప్రయాణం పథకంలో చేర్చితే అదనంగా ప్రభుత్వంపై పడే భారమెంత? అనే లెక్కలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే దివ్యాంగుల ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం దివ్యాంగుల నుండి సగం ఛార్జీలనే వసూలు చేస్తోంది ఆర్టిసి... అంటే టికెట్ ధరలో 50 శాతం మాత్రమే దివ్యాంగులు చెల్లించాలి. త్వరలో ఈ చార్జీలు కూడా లేకుండా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇది అమలయితే ఇక మహిళలతో పాటే దివ్యాంగులైన పురుషులు కూడా ఏపిఎస్ ఆర్టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నమాట. కేవలం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమే కాదు తెలంగాణ సర్కార్ కూడా దివ్యాంగులకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే ప్రయత్నాల్లో ఉంది. ఈ విషయాన్ని స్వయంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడించారు. ఇప్పటికే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో దీనిగురించి మాట్లాడానని... త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా చర్చించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తప్పకుండా దివ్యాంగులు కూడా ఆర్టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తారని... ఆ దిశగా ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని మంత్రి లక్ష్మణ్ స్పష్టం చేశారు. అంటే తెలంగాణలో కూడా దివ్యాంగులైన పురుషులు ఆర్టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. తెలుగు ప్రభుత్వాలు తమ సంక్షమం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంపై దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జాప్యం చేయకుండా వెంటనే ఆర్టిసి బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణంపై నిర్ణయం తీసుకోవాలని వారు ప్రభుత్వాలను కోరుతున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాలే కాదు దేశంలో మరికొన్ని రాష్ట్రాలు కూడా మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు అన్నిరకాల ఆర్టిసి బస్సుల్లో ఈ సౌకర్యం కల్పిస్తుంటే మరికొన్ని రాష్ట్రాలు పరిమిత బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాయి.

తెలంగాణలో మహాలక్ష్మి, ఆంధ్ర ప్రదేశ్ లో స్త్రీ శక్తి పేరిట ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. కర్ణాటకలో శక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నారు. తమిళనాడులో "మగిలిర్ విడియల్ పయనం థిట్టం" కింద సాధారణ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. ఢిల్లీ, పంజాబ్ లో పరిమిత ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంది.




హైదరాబాద్: రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. "పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుంది" అని సీఎం హామీ ఇచ్చారు.

**ప్రపంచ నగరాలతో పోటీ..** " ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే" అని సీఎం అన్నారు.

## తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట




హైదరాబాద్, జనవరి 9: తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించారంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి.మదన్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే విధించడానికి నిరాకరించింది. రెగ్యులర్ ప్రాసెస్‌ను 4 వారాల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ.. తదుపరి విచారణఅబశ్రీశ్రీను హైకోర్టు ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

## ఎందుకు ప్రతిసారి టికెట్ల ధరలు పెంచుతున్నారు: తెలంగాణ హైకోర్టు ఆగ్రహం




హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో స్టార్ హీరోల సినిమాలు రిలీజ్ సమయంలో టికెట్ల ధరలు పెంచడం సర్వసాధారణం అయ్యింది. అలాంటి సందర్భాల్లో రేట్ల పెంపకం వ్యవహారం హాట్ టాపిక్ గా మారుతుంటుంది. తాజాగా అలాంటిదే యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ నటించిన 'రాజాసాబ్బ మూవీకి ఎదురైంది. ఈ మూవీ టికెట్ల రేట్ల పెంపు వ్యవహారం ఇండస్ట్రీలో చర్చకు దారి తీసింది. అయితే రాజాసాబ్ మూవీ టికెట్ల ధరల పెంపును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో నేడు విచారణ చేపట్టింది. పెద్ద సినిమాలు రిలీజ్ అయినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారన్న న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌పై విచారణ చేసింది హైకోర్టు. టికెట్ పెంపు విషయంలో హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని కోర్టు దృష్టికి విజయ్ గోపాల్ తెచ్చారు. జిల్లా స్థాయి కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు టికెట్ల ధరల పెంపు మెమోపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పెద్ద సినిమాల సమయంలో తెలివిగా ఎందుకు మెమోలు జారీ చేస్తున్నారని జీపీని ప్రశ్నించింది. 'ఇటీవల టికెట్ల ధరలు పెంచబోమని సంబంధిత మంత్రి స్వయంగా ప్రకటించారు. అయినా పదే పదే టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారు. టికెట్ రేట్ల మెమో గురించి విచారణ జరగటం ఇది మొదటిసారి కాదు.. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన తీరు మారడం లేదు. 20 సంవత్సరాల క్రితం హైదరాబాద్ మొత్తం ఒకే టికెట్ ధర ఉండేది, కానీ ఇప్పుడు ప్రతిసారి టికెట్ ధరలు పెంచుతూ పోతున్నారు. దీనికి వల్ల సామాన్యులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మేము కూడా సినిమాలకు వెళ్లాం.. మాకూ టికెట్ ధరలు తెలుసు' అంటూ న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ అనంతరం 'రాజా సాబ్' సినిమా నిర్మాతలకు హైకోర్టు షాక్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన టికెట్ రేట్ల పెంపు మెమోను సస్పెండ్ చేసింది. పాత రేట్లకే వసూలు చేయాలని ఆదేశించింది. జీవో నంబర్ 120 ప్రకారం 350 లోపే సినిమా టికెట్ ఉండాలని స్పష్టం చేసింది. ఇకపై సినిమా టికెట్ రేట్లు పెంచుతూ మెమోలు ఇవ్వొద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని సింగిల్ బెంచ్ ధర్మాసనం ఆదేశించింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోంది: కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం సీరియల్ స్నాచర్‌గా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఉర్దూ వర్సిటీ భూములకు సంబంధించి ప్రభుత్వ నోటీసుల నేపథ్యంలో నందినగర్‌లో విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. "ప్రభుత్వం భూములు లాక్కోవడం ఇదే మొదటిసారి కాదు. జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుంచి 100 ఎకరాలు తీసుకున్నారు. విద్యార్థులు పోరాడినా ఆందోళనను అణచివేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ ఇదే విధమైన భూదందా చేశారు. అక్కడ 400 ఎకరాలు తీసుకునేందుకు యత్నించారు. సుప్రీంకోర్టు సీజే సుమోటోగా



తీసుకుని ఆదేశాలు ఇచ్చేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు"అని కేటీఆర్ అన్నారు.

## స్వామి వివేకానంద ఎక్స్‌లెన్సీ అవార్డుకు బీజేపీ రాష్ట్ర చీఫ్ ఎంపిక



హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు.. స్వామి వివేకానంద ఎక్స్‌లెన్సీ అవార్డుకు ఎంపికయ్యారని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 2026 గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 11న తార్నాకలోని రాంచందర్‌రావు నివాసంలో ఈ అవార్డు, శాలువా, పూలబోకే, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేయ నున్నట్లు తెలిపారు.




## స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు కేంద్రం నయా ప్లాన్..


న్యూఢిల్లీ, జనవరి 9: గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది.

**అందుకే ఇలాంటి నిర్ణయం: గడ్కరీ...** ఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

**రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు..** బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమర్జెన్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు సరికొత్త టెక్నాలజీ..** దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి (V2V) కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ V2V టెక్నాలజీ ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, దిశ వంటి కీలక సమాచారాన్ని సమీప వాహనాలతో పంచుకోగలవని ఆయన వివరించారు. ఈ టెక్నాలజీ వల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేసినా.. రోడ్డుపై వాహనాలు ఆగి ఉన్నా.. మిగతా వాహనాలకు అలర్ట్ వెళ్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థను అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సాంకేతికత రోడ్డు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.




## మిర్యాలగూడలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

నల్లగొండ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్ తరలిస్తున్న డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**మృతుల వివరాలు..** పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలోని మృతులంతా బీహార్ వాసులుగా గుర్తించారు. వీరిలో బీరు బాయ్ (30), సంతోష్ (30), సూరజ్ (18) ఉన్నారు. డీసీఎంలో ఉన్న టైల్స్ కూలీల మీద పడటంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

**పోలీసుల చర్యలు..** టైల్స్‌ను హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్రేన్ సహాయంతో రహదారిపై నుంచి లారీని, డీసీఎంను తొలగించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**జాగ్రత్తగా వెళ్లాలి..** మిర్యాలగూడలోని ఈ రహదారిపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.




మెట్‌పల్లి: చైనా మాంజా తగిలి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మెట్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దుబ్బవాడలో శ్రీహస్ గురువారం సాయంత్రం ఇంటిముందు ఆడుకుంటున్నాడు. ఇంతలో చైనా మాంజా వచ్చి మెడకు చుట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెడ భాగంలో తీవ్రంగా కోసుకుపోవడంతో ప్రాథమిక చికిత్స అనంతరం బాలుడిని నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ బాలుడు చికిత్స పొందుతున్నాడు. మెడ చుట్టు సుమారు 20 కుట్లు వేసినట్లు సమాచారం.



## కేటీఆర్‌పై గజ్జెల కాంతం షాకింగ్ కామెంట్స్


హైదరాబాద్, జనవరి 9: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పీసీసీ తెలంగాణ జనరల్ సెక్రెటరీ గజ్జెల కాంతం సంచలన ఆరోపణలు చేశారు. మీడియాతో మాట్లాడుతూ.. దుబాయ్‌లో తన బినామీని చంపితే ఆధారాలు పోతాయని కేటీఆర్ భ్రమపడ్డారని గజ్జెల కాంతం ఆరోపించారు. నాలుగు రాష్ట్రాల్లో కేటీఆర్ మకాం వేసేవారని తెలిపారు. 2022 జనవరి 24న ఒక హీరోయిన్‌కు కేటీఆర్ రూ.100 కోట్లు ఇచ్చారని.. ఒక కాంట్రాక్టర్, జ్యువెలరీ షాప్ యజమాని అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేయించారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

**హీరోయిన్‌ను బెదిరించి మరీ..** ముంబైలోని తాజ్ కృష్ణా హోటల్ 328వ గదికి ఒక హీరోయిన్‌ను పిలిపించి, రూ.35 కోట్ల 75 లక్షలతో విల్లా కొనిచ్చారని, ఆడి కారు కూడా బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. 2022 మార్చి 3న ఢిల్లీలోని లలిత్ హోటల్ 770వ గదికి.. మైసూర్అబశ్రీశ్రీలో షూటింగ్ చేస్తున్న హీరోయిన్‌ను బెదిరించి పిలిపించుకున్నారని, రూ.50 కోట్లు ఇస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబం అమెరికాలో రూ.40 వేల కోట్లు, దుబాయ్‌లో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందన్నారు. దాదాపు 30 వేల ఎకరాల భూములు దోచుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఇవన్నీ అబద్ధాలని తన కొడుకుపై ప్రమాణం చేయగలరా అని గజ్జెల కాంతం నిలదీశారు.

**రాహుల్ కాలి గోటికి సరిపోరు..** కేసీఆర్‌కు ఎన్టీఆర్, చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టారని.. దొంగ పాస్‌పోర్టులు సృష్టించిన చరిత్ర కేసీఆర్‌దేనని గజ్జెల కాంతం విరుచుకుపడ్డారు. ఎన్నికల కోసం జగన్‌కు రూ. 200 కోట్లు.. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీకి కోట్లాది రూపాయలను కేసీఆర్ పంపారన్నారు. అఖిలేష్ యాదవ్, కుమారస్వామికి కేటీఆర్ డబ్బులు పంపారని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్‌పై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం వల్లే కేటీఆర్ మంత్రి అయ్యారని, రాహుల్ కాలి గోటికి కూడా కేటీఆర్ సరిపోరని వ్యాఖ్యానించారు.

**కేటీఆర్‌కు జ్ఞానం లేదు..** రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిందని, కేటీఆర్ కుటుంబం ఏం త్యాగం చేసిందని గజ్జెల కాంతం ప్రశ్నించారు. చట్టాలు, రాజ్యాంగంపై కేటీఆర్‌కు గౌరవం, జ్ఞానం లేదని, చరిత్ర తెలియదని విమర్శించారు. రాహుల్ గాంధీ కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని.. కేటీఆర్ లాగా రాహుల్, రేవంత్‌లు దోచుకోలేదని గజ్జెల కాంతం పేర్కొన్నారు.

# తెలుగు కవులను తెలుగేతరులకు పరిచయం చేసిన జర్నలిస్ట్ ధూళిపూడి - జయంతి 10...ధూళిపూడి జయంతి



ధూళిపూడి ఆంజనేయులు, సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత. పుట్టింది, పెరిగింది తెలుగు రాష్ట్రంలో అయినా, ఆంజనేయులు కేవలం ఇంగ్లీషులోనే రాసి గొప్ప జర్నలిస్టుగా ఖ్యాతి చెందారు. డి.ఎ.అని పాఠకులకు పరిచితులు. 1924 జనవరి 10న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎలవర్రులో పుట్టి, ముందు నుండే జర్నలిస్టు జీవితాన్ని ఎంపిక చేసుకున్న ఆంజనేయులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, సమాచార శాఖలో జర్నలిస్టుగా, ఆకాశ వాణిలో వాణి పత్రికా సంపాదకులుగా, హిందూ పత్రిక సంపాదక బృందం బాధ్యు లుగా, పేరెన్నిక గన్నారు. కోటం రాజు రామారావు నడిపిన "ఇండి యన్ రిపబ్లికు లో తొలుత జర్నలిజానికి ఆయన శ్రీకారం చుట్టారు. మొదట ఇండియన్ ఎక్స్ ప్రెస్ సంపాదక వర్గంలో 1948లో చేరి 1953లో ది హిందూ పత్రికలో చేరి అనుభవం సంపాదించిన తర్వాత 1959 లో ఆకాశవాణి వారి వాణి పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగరీత్యా ఆంజనేయులు ఢిల్లీ, హైదరాబాద్, మద్రాసులో ఉంటూ సమాచార శాఖలో జర్నలిస్టుగా వృత్తిధర్మం నిర్వర్తించారు. ఉద్యోగంలో వున్నా వివిధ పత్రికలకు రాస్తూ ఆంజనేయులు మంచి పేరు తెచ్చు కున్నారు. అంతకుమించి, ఎన్నో రచనలు ప్రచురించారు. ఆయన రాసిన పత్రికలు క్వెస్ట్, ఇండియన్ రివ్యూ,థట్, ఇండియన్ లిటరేచర్, త్రివేణి, ఫైనాన్షియల్ ఎక్స్ ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, ఇండియన్ రైటింగ్ టుడే పేర్కొనదగినవి. తెలుగు పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, డక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురించాయి. భవాన్స్ జర్నల్ లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొద లైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ?తెలుగు సాహిత్యాన్ని, రచయితల్ని తెలుగే తరులకు అందించడం ఆయన విశిష్టత. ఇందులో భాగంగా గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు లిటరేచర్ రాయగా, కలకత్తా రైటర్స్ వర్క్ షాప్ వారు వెలువ రించారు. ఆయన ఏది రాసినా, చెప్పినా స్పష్టంగా, మృదువుగా, మర్యా దగా ఉండేది. సున్నిత హాస్యం, విమర్శ ఆయన రచనల్లో కనిపించేది. వృత్తి రీత్యానూ, వ్యక్తి దృష్ట్యా ఆంజనేయులుకు ఎందరో సన్నిహితులయ్యారు. వారిలో నార్ల వెంకటేశ్వరరావు, సంజీవదేవ్, బి.ఎస్.ఆర్.కృష్ణ, కె.శ్రీనివాస అయ్యంగార్, వామనరావు, పట్టాభిరాం, ఎ.ఆర్.బాజీ, భావరాజు నరసింహా రావు ప్రభృతులెందరో వున్నారు. నార్ల వెంకటేశ్వర రావు తన ఇంగ్లీషు రచనల్ని ముందుగా ఆంజనేయులు పరిశీలించిన తరువాత ప్రచురించేవారు. విశ్వనాథ సత్యనారాయణ, గోపీ చంద్, బైరాగి, పాలగుమ్మి పద్మ రాజు, శ్రీశ్రీ, సి. నారాయణ రెడ్డి, దాశరథి, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొద లైన వారిని తెలుగేతరులకు తన రచనల ద్వారా పరిచయం చేసిన గొప్పతనం ఆయనదే. పత్రికలకు ఇంగ్లీషులో రాసి పంపగా, అనువదించి వేసుకునే వారు. స్వతంత్ర టైమ్స్, డక్కన్ హెరాల్డ్, న్యూస్ టుడే, ఇండియన్ బుక్ క్రానికల్ పత్రికలు కూడా ఆంజనేయులు వ్యాసాలు ప్రచురిం చాయి. భవాన్స్ జర్నల్లో ఎన్నో విలువైన వ్యాసాలు ఆంజనేయులు రాశారు. వృత్తిచేస్తూనే అనేక సెమినార్లకు, చక్కని వ్యాసాలు రాయడం ఆంజనేయుల జర్నలిస్ట్ కృషిలో భాగం అయింది. దీని ఫలితంగా జీవిత చరిత్ర, కళ గురించేగాక, నెహ్రూ, రాధాకృష్ణన్, అంబేద్కర్, నిరాద్ చౌదరి మొదలైన వారిపై లోతైన పరిశీలనా వ్యాసాలు రాశారు. ద్వివేదుల విశాలాక్ష రచన "గ్రహణం విడిచింది" ఇంగ్లీషులోకి అనువదించారు. ఆంజనేయులు రచనలను... కట్టమంచి రామలింగారెడ్డి, సాహిత్య అకాడమీ, కందు కూరి వీరేశలింగం, కేంద్ర ప్రచురణ సంస్థ ప్రచురించాయి. ఆయన రష్యా, యూరప్ దేశాలు పర్యటన అనుభవాలను 'విండో టు ది వెస్ట' అని పుస్తకంగా ప్రచురించారు. ఆంజనేయులు రిటైర్ అయిన తరువాత మద్రాసులో స్థిరపడి, హిందూ లో "బిట్వీన్ యు అండ్ మి" అనే శీర్షిక 10 సంవత్సరాలు (1981-91) నిర్వహించారు. మద్రాసు ప్రెస్ క్లబ్ లో 30 సంవత్సరాలు అధ్యక్షులుగా ఉన్నారు. సాహిత్య విమర్శ, సాంఘిక సంస్కరణలపై కూడా రచనలు చేశారు. ఆంజనేయులు సెక్యులర్ జీవితం గడిపారు. కుమార్తె వివాహం రిజిస్టర్ చేయించి, కన్యాదాన పద్ధతి నిరసించారు. సంగీతం, సంస్కృతం, సాహిత్యం అంటే ప్రత్యేకాభి మానం. స్వంత గ్రంథలయం దేశంలో అతి పెద్దదైన వ్యక్తిగత గ్రంథలయాలలో ఒకటి. తెలుగువారు గర్వించదగిన ఇంగ్లీషు జర్నలిస్టు తన 75వ ఏట 1998 సంవత్సరం డిసెంబరు 27 తేదీన చెన్నైలో తుది శ్వాస వదిలారు. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




రాయవరం: కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచ నలని.. 'మీ భూమి - మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హా మీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని తెలిపారు. "గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పా. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పనిచేయాలి. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తాం. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్ ఉండాలి. భూమికి సంబంధించి 29 అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. అన్నింటినీ పరిష్కరిస్తున్నాం. 22-ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయి. ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరుతున్నా. కుటుంబసభ్యులు, బంధువులతో వివాదాలు వద్దు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితకాలం వృథ అవుతుంది"అని సీఎం చంద్రబాబు తెలిపారు. "నరకాసురిడి పాలన మళ్లీ రాకూడదని మనం కోరుకోవాలి. గోదావరి పుష్కరాలు వచ్చే మూడు సార్లూ నేనే సీఎంగా ఉండటం నా అదృష్టం. సముద్రంలోకి వెళ్లే నీటిలో 300 టీఎంసీలు వాడుకుంటే కరవే ఉండదు. పోలవరం పూర్తయితే ఈ ప్రాంతానికి నీటి సమస్యే ఉండదు. పోలవరం నుంచి విశాఖకు అక్కడి నుంచి వంశధారకు తీసుకెళ్తాం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోం. గొడవలు పెట్టుకుంటే వచ్చే ప్రయోజనాలు ఏమీ ఉండవు. మనవద్ద నీళ్లు మిగిలితే తెలంగాణ కూడా వాడుకోవచ్చు. శ్రీశైలంలో నీళ్లు పొదుపు చేసి రాయలసీమకు తరలిస్తాం" అని సీఎం తెలిపారు.

# 400 ఏళ్లుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక వేడుక జగ్గన్నతోట ప్రభల తీర్థం: సీఎం చంద్రబాబు



అమరావతి: సుమారు 400 ఏళ్లుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుక జగ్గన్న తోట ప్రభల తీర్థమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఏటా కనుమ రోజు జరిగే ఈ అ తిపెద్ద పండుగలో 11 పురాతన శివాలయాల నుంచి వచ్చే ఏకాదశ రుద్రుల ప్రభలు ఒకే వేదికపై దర్శనమిస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "తరతరాలుగా ఈ సంప్రదాయాన్ని కాపాడుతూ వస్తున్న కోనసీమ ప్రజల భక్తి, విశ్వాసాలను గౌరవిస్తూ.. జగ్గన్న తోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం.

సుమారు 5 లక్షల మంది హాజరయ్యే ఈ ఉత్సవానికి అన్ని రకాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తోంది. కోనసీమలో సాంస్కృతిక పర్యాటకం మరింత అభివృద్ధి చెందడానికి మంత్రివర్గ నిర్ణయం దోహదం చేస్తుంది" అని సీఎం పేర్కొన్నారు.

# నవ్వు దైవ దత్త దివ్యౌషధం జనవరి 10... నవ్వుల దినోత్సవం




నవరసాల సారమే జీవనం. అందులో ఏ రసం పాలు తక్కువైనా సమస్య లేదు కానీ, హాస్యరసం పాలు మాత్రం అసలు తక్కువ కాకూడదు. అది లోపిస్తే జీవితమంతా వేదనే మిగులుతుంది. అయితే, నేటి యాంత్రిక జీవనంలో, పోటీ ప్రపంచంలో మన జీవితాల్లో హాస్యరస పాలు క్రమంగా తగ్గిపోతోంది. ఆవేశం, ఆగ్రహం, అసంతృప్తి, అహం, మానసిక ఒత్తిడి వంటివి నవ్వును, నవ్వే గుణాన్ని మింగేస్తున్నాయి. ప్రపంచ నవ్వుల దినోత్సవం మొదటి సారిగా 1998, జనవరి 10న భారత దేశంలోని ముంబైలో జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించిన డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశాడు. మొదఅబశ్రీశ్రీటఅబశ్రీశ్రీ జనవరి రెండవ ఆదివారం జరుపుకునే వారు. జనవరిలో చలి ఎక్కువగా ఉంటుందన్న హాస్య ప్రియులు కోరిక మేరకు లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ దీన్ని మే మొదటి ఆదివారం జఅబశ్రీశ్రీరుపుతూ వఅబశ్రీశ్రీచ్చింది. అయితే భారత దేశంలో జనవరి 10న మొదటి సారి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది భారత దేశమే, భారతీయుడే కావడం విశేషం. ముంబైకి చెందిన ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ మదన్ కటారియా ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని సృష్టించారు. 'నవ్వు ఒక యోగం' అనే కాన్సెప్ట్ను ప్రపంచానికి చాటిన అయన భారతీయుడే కావడం విశేషం. వ్యక్తులు తమను తాము మార్చుకోవటానికీ, ప్రపంచాన్ని శాంతియుతంగా, సానుకూలంగా మార్చడానికి అవసరమైన శక్తివంతమైన భావోద్వేగం నవ్వు ఒక్కటే. నవ్వు అనేది ఒక వ్యక్తి ముఖ కవళికలపై, భావోద్వేగాలపై ప్రభావం చూపుతుందన్న ఉద్దేశ్యంతో మదన్ కటారియా నవ్వు యోగా ఉద్యమాన్ని ప్రారంభించాడు. మొదట్లో నవ్వుల క్లబ్ (లాఫర్ క్లబ్)గా ప్రారంభమైన ఈ వేడుక తరువాత కాలంలో 65 దేశాలలో ఆరు వేల క్లబ్బుల వరకు విస్తరించింది. నవ్వడం వలన శరీరంలో ఉన్న రోగాలన్నీ మటుమాయమై పోతాయని ఆరోగ్య నిపుణులు చెపుతున్నారు. నవ్వడం మూలాన జీవితంలోని ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చని వారంటున్నారు. రోజులో కనీసం నాలుగైదు సార్లయినా మనసారా నవ్వడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. ఒక మనిషి సంతోషంగా ఉంటే అతని కుటుంబం సంతోషంగా ఉ ంటుంది. అలా కుటుంబాలన్నీ సంతోషంగా ఉంటే సమాజమంతా సంతోషంగా ఉంటుంది.. అప్పుడు ప్రపంచమంతా సంతోషంగా ఉ ంటుందనేది ఈ నవ్వుల దినోత్సవ నిర్వహణ వెనుక ఉన్న భావన.

**హాస్యానికి పుట్టినిల్లు భారత్...** భారతదేశంలో హాస్యానిది తొలి నుంచీ పెద్దపీటే. రాజుల ఆస్థానాలలో విదూషకులు కేవలం మహారాజులను నవ్వించడానికే ఉండేవారు. తెనాలి రామకృష్ణుడు, బీర్బల్? పండించిన హాస్యం అజరామరం. ఈ రెండు తరహాల కథలు నవ్వుతో పాటు ఆలోచననూ కలిగిస్తాయి. నిజానికి నవ్వుతో లేదా జోక్?తో ఆలోచనను రేకెత్తించే హాస్యమే మరుపు రాకుండా మిగిలి పోతుంది. అక్బర్? - బీర్బల్? కథలు ఎన్నో ఆలో చనలను రేకెత్తిస్తాయి. తెనాలి రామకృష్ణుడి కథలు తెలివిని పెంచుతాయి. పరమానందయ్య శిష్యుల కథలు కూడా మంచి హాస్యాన్ని పుట్టిస్తాయి. మన జానపద గీతాల్లోనూ హాస్యరసం పొంగి పొర్లుతుంది. ఇంకా పల్లెసుద్దుల్లో, పల్లెల్లో పనిపాటు చేసుకుంటూ పాడుకునే పాటల్లో ఎంతో సునిశిత హాస్యం దొర్లుతుంది. పువ్వులు, పక్షులు, జంతువులు.. తమ తమ స్వభావాలతో తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, పరిసరాలను ఆనందమయంగా చేసుకుంటాయి. వాటితో పోలిస్తే విచక్షణ, వివేకం కలిగిన మానవులం ఈ జీవితాన్ని, ఎందుకు సంతోషకరం చేసుకోలేం. ఈ సృష్టిలో పైసా ఖర్చు లేనిది చిరునవ్వు మాత్రమే. కానీ, దాన్ని 'కొనితెచ్చు' కోవాల్సినంత దుస్థితిలో మానవ జీవితాలు ఉన్నాయి. రోజుల్లో వస్తున్న సగం జబ్బులకు ఒత్తిడే కారణం. 70 శాతం రోగాలు ఒత్తిడితోనే కలుగుతున్నాయనేది వైద్య అధ్యయనాల సారాంశం. అధిక రక్తపోటు, గుండె జబ్బులు, డిప్రెషన్? (కుంగుబాటు), అలర్జీ, ఇన్సోమియా, మైగ్రేయిన్?, ఆతృత, పెప్టిక్? అల్సర్?.. ఇవన్నీ ఒత్తిడి వల్ల వచ్చేవే. నవ్వుల టానిక్? మాత్రమే వీటికి ఔషధం. ఉదయం లేస్తూనే ఒక చిరునవ్వును ముఖంపైకి తెచ్చుకుంటే ఇవన్నీ మటుమాయమైనట్టే. నవ్వుతో రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన లింపొజైట్స్ ఉత్పత్తి పెరుగుతుంది. ముక్కు, శ్వాసకోశాల్లోని పొరల్లో మెరుగుదల ఉ ంటుంది. శరీరంలో సహజరోగ నిరోధక హార్మోన్ల ఉత్పత్తి పెరిగి ఆర్థరైటిస్, స్పాండలైటిస్, మైగ్రేన్ లాంటి వ్యాధులకు ఉపశమనం లభిస్తుంది. ఊపిరి తిత్తుల సామర్థ్యం, రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతాయి. దీని వల్ల ఆస్తమా రోగులకూ మేలు జరుగుతుంది. మనుషులు వేర్వేరు భాషలు, దేశాలకు చెందిన వారైనా అందరికీ అర్థమయ్యే, అందరికీ వచ్చే యూనివర్సల్ లాంగ్వేజ్ మాత్రం నవ్వే. ఇది ఎవరూ నేర్చుకొనే అవసరం లేని భాష. అందరిలోనూ సహజ, స్వభావ సిద్ధంగా ఉంటుంది. అయితే, ప్రతి మనిషీ తనలో సహజంగా ఉండే నవ్వును నవ్వడం లేదా దానిని ఉపయోగించడం నానాటికీ మరిచి పోతున్నాడు. పుట్టుకతోనే అబ్బే విద్య నవ్వు మాత్రమే. సకల జీవరాశిలో మనిషికి మాత్రమే నవ్వుకునే, నవ్వే గుణమూ, లక్షణమూ ఉన్నాయను కోవడం అజ్ఞానం. చాలా గుణాలలాగే నవ్వు కూడా మన చుట్టూ ఉన్న జీవరాశి అంతటిలో ఉన్నాయి. పువ్వులు వికసించడమే హాసం. పక్షుల కిలకిలరావాలే కిలకిలల నవ్వులు. జంతువులు చేసే కొన్ని శబ్దాలు నవ్వులకు సంకేతాలే. నవ్వు అనేది మనిషి అభ్యాసంతో నేర్చుకునే విద్య కాదు. జన్మతః లభించిన లక్షణం. సెల్ ఫోన్లు మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతున్నాయి. సెల్?ఫోన్లు వచ్చాక మనుషుల మధ్య మాటలే కరువయ్యాయి. ఇద్దరు మనసు విప్పి మాట్లాడు కుంటేనే కదా.. ఆ సంభాషణలో నుంచి హాస్యం పుట్టేది. ఇప్పుడు ఎవరికి వారు సెల్?ఫోన్ల తోనే మాట్లాడు తున్నారు. అరచేతిలోని సెల్ ఫోన్ మనసుకు నవ్వును తాకనివ్వడం లేదని ఎవరూ గుర్తించడం లేదు. వాట్సాప్?లో పోస్టుల జోకులకే నవ్వు తున్నాం. స్వతహాగా నవ్వడం ఏనాడో మరిచి పోయాం. చింతలు, చికాకులు, అర్థం లేని లక్ష్యాల వైపు పరుగులతో మనిషిలో హాస్య ప్రియత్వ సహజ లక్షణం తగ్గిపో తున్నది. నవ్వు ఇలా మహా భాగ్యమై పోయినందుకే లాఫింగ్? క్లబ్బులు వచ్చాయి. మనిషి కొత్తగా నవ్వడం నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నవ్వు యోగమే కాదు.. నవ్వు వ్యాయామం కూడా. ముఖంలో నవ్వు కనబడాలి అంటే ముఖం లోని ముప్పై రెండు కండరాలు కదలాలట. నవ్వడం కూడా ఒక వ్యాయామం. ఒక్క నవ్వుతో 32 కండరాలను కదిలించడం అంటే అది ఎంత గొప్ప వ్యాయామం కాక మరేమిటి. చక్కని నవ్వు వల్ల ముఖ కవళికలు మెరుగవుతాయి. ముఖ కండరాల్లో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. వృద్ధాప్య ఛాయలు, ముడతలను దరి చేరనివ్వదు. మనసు స్వచ్ఛంగా ఉన్న వాళ్లకే స్వచ్ఛమైన నవ్వు వస్తుంది. యోగాతో పోలిస్తే నవ్వడం చాలా సులువు. యోగా అంటే కొన్ని భంగిమలు ప్రదర్శించాలి. దీనికి అవేమీ అవసరం లేదు. పెదాలను కాస్త కదిలిస్తే చాలు.. మానసిక ఒత్తిడిని నవ్వు తగ్గిస్తుంది. హాయిగా నవ్వడం వల్ల ఒత్తిడి దిగిపోయి రిలాక్స్ కలుగుతుంది. కుంగుబాటు (డిప్రెషన్?) నుంచి నవ్వు బయట పడవేస్తుంది. ఉద్విగ్నత, భావోద్వేగాలను నవ్వు సమస్థితిలో ఉ ంచుతుంది. ఇవి అదుపులో ఉంటేనే ఇతరులతో సంబంధ బాంధవ్యాలు సవ్యంగా గలుగుతారు. అంటే మనసులో ఎటువంటి కల్మషం లేని వారు మనసారా స్వచ్ఛంగా నవ్వగలరు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఏరివేస్తా: పవన్‌కల్యాణ్



పిఠాపురం: పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కాకి ఈక పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. "పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలి. ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది.

ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరి శ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా ఉ ంటాయి.. కానీ చాలా గట్టిగా, పర్సనల్‌గా తీసుకుంటాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు" అని పవన్ అన్నారు.




అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో వేధింపులతో మృతిచెందిన డాక్టర్ సుధాకర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధాకర్ కుమారుడు లలిత్‌ప్రసాద్‌కు ఉద్యోగ హోదా పెంచి గ్రూప్-2 సేవల కింద రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దారుగా నియమించింది. ఈ నేపథ్యంలో అనిత స్పందించారు. మాస్క్ అడిగినందుకు జగన్ ప్రభుత్వం ఆనాడు సుధాకర్‌ను ఎంతలా చిత్రహింసలకు గురిచేసిందో ప్రజలంతా చూశారని అనిత అన్నారు. ఆయనతో పాటు ఆ కుటుంబం పడిన మానసిక వేదనను ప్రత్యక్షంగా చూశానని గుర్తుచేశారు. జగన్ దురహంకారానికి బలైన సుధాకర్‌ను తిరిగి తీసుకురాలేమని.. ఆయన కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించడం దళితుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు బాధ్యత తీసుకుని సుధాకర్ కుటుంబానికి న్యాయం చేశారన్నారు.

# జగన్ మాటలను ప్రజలు నమ్మరు: ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ: రాజధాని విషయంలో జగన్ మాటలను ప్రజలు నమ్మరని తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరిని కలిపి మహానగరం నిర్మించేందుకు సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో చిన్ని మాట్లాడారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అటకెక్కించింది జగన్ ప్రభుత్వమేనని విమర్శించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు.

"పులివెందుల ఎమ్మెల్యే జగన్ చెప్పేవన్నీ అబద్ధాలు. వైకాపా పని అయిపోయింది. చరిత్రలో అత్యంత హీనమైన ఓటమి ఆ పార్టీది. మరో 25 ఏళ్లపాటు కూటమి అధికారంలో ఉంటుంది. దేశంలో ఎక్కడాలేనివిధంగా సీఎం చంద్రబాబు విద్యుత్ ఛార్జీలను తగ్గించారు. అమరావతి, విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది" అని కేశినేని చిన్ని అన్నారు.

చురకలు



చురకలు

## సంపాదకీయం

# రక్షణ రంగానికి రెట్టింపు బడ్జెట్..

## ట్రంప్ నిర్ణయంతో ఉలిక్కిపడ్డ ప్రపంచం..

కొత్త సంవత్సరంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఒకవైపు వాణిజ్య యుద్ధాలు, మరోవైపు జియోపాలిటికల్ హెచ్చరికలు, ఇంకో వైపు సైనిక శక్తి ప్రదర్శన.. అన్నీ కలిపి ట్రంప్ పాలన మరింత దూకుడుగా మారిందన్న సంకేతాలు ఇస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం ప్రపంచ రాజకీయాల్లో సంచలనంగా మారింది. అమెరికా రక్షణ బడ్జెట్‌ను అనూహ్యంగా భారీగా పెంచే ప్రకటన చేయడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2027 నాటికి అమెరికా సైనిక బడ్జెట్‌ను ఇప్పటి వరకు ఊహించని స్థాయిలో ట్రిలియన్ డాలర్ల నుంచి 1.5 ట్రిలియన్ డాలర్లకు పెంచనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ సంఖ్య కేవలం గణాంకం మాత్రమే కాదు. దేశం మొత్తం ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే ఇది సుమారు 36 శాతం వరకూ ఉంటుంది. అంటే ఒక్క ఏడాదిలో అమెరికా సైన్యం మీద ఖర్చు చేయబోయే మొత్తం ఎంత భారీగా ఉందో అర్థమవుతుంది. ఈ నిర్ణయం వెనుక కారణంగా 'ప్రపంచ భద్రతా పరిస్థితులు తీవ్రంగా దిగజారుతున్నాయి' అని ట్రంప్ స్పష్టంగా చెబుతున్నారు.

**ట్రూత్ వేదికగా ప్రకటించిన ట్రంప్..** ట్రూత్ సోషల్ వేదికగా ఈ ప్రకటన చేసిన ట్రంప్.. ఈ బడ్జెట్ అమెరికా సైన్యాన్ని ఒక 'డ్రీమ్ మిలిటరీ'గా తీర్చిదిద్దుతుందని వ్యాఖ్యానించారు. సెనేట్, కాంగ్రెస్, ఇతర కీలక ప్రభుత్వ విభాగాలతో విస్తృత చర్చల తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చామని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం చాలా సున్నితమైన దశలో ఉందని, చిన్న తప్పిదం కూడా పెద్ద యుద్ధాలకు దారితీయగల పరిస్థితి ఉందని అభిప్రాయం. అందుకే జాతీయ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం అనివార్యం అని ట్రంప్ నొక్కి చెప్పారు. ఈ భారీ బడ్జెట్ పెంపు వెనుక అమెరికా ఎదుర్కొంటున్న భద్రతా సవాళ్లు మాత్రమే కాదు.. భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలపై ముందస్తు సిద్ధత కూడా అన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, ఆసియాఉపసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు, ఉత్తర కొరియా అణు బెదిరింపులు అన్నీ కలిసి ప్రపంచాన్ని ఒక అస్థిర దశలోకి నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో 'బలమే భద్రత' అన్న సూత్రాన్ని ట్రంప్ మరింత గట్టిగా అమలు చేయాలనుకుంటున్నారని తెలుస్తోంది.

**ప్రపంచానికి చెప్పకనే చెప్పిన ట్రంప్ విధానం..** ఇంకొక ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. ఈ రక్షణ బడ్జెట్ పెంపు కారణంగా ట్రంప్ తన టారీఫ్ విధానాన్ని పేర్కొనడం. అమెరికా విధించిన దిగుమతి సుంకాల వల్ల దేశానికి భారీగా ఆదాయం వచ్చిందని, ఆ డబ్బుతోనే సైనిక శక్తిని పెంచడమే కాకుండా దేశభక్తిగల మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించవచ్చని వ్యాఖ్యానించారు. అంటే, వాణిజ్య యుద్ధాల ద్వారా వచ్చిన డబ్బుతో యుద్ధాలకు సిద్ధం కావడం అన్న వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి ఇది పూర్తిగా కొత్త నిర్ణయమేమీ కాదు. గత డిసెంబర్‌లోనే అమెరికా సెనేట్ 2026 సంవత్సరానికి 901 బిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్ ఆమోదించింది. కానీ ఇప్పుడు 2027కి దాన్ని ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లడం ట్రంప్ ఆలోచనల దూకుడును చూపిస్తోంది. ఆధునిక ఆయుధాలు, హైపర్‌సోనిక్ మిసైళ్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యుద్ధ వ్యవస్థలు, స్పేస్ డిఫెన్స్ ఈ అన్నింటిపై పెట్టుబడులు పెంచే దిశగా ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

**విమర్శలు కురిపిస్తున్న ఆయా దేశాలు..** ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంపై విమర్శలూ లేకపోలేదు. ఒకవైపు అమెరికాలో ఆరోగ్య, విద్య, సామాజిక భద్రత రంగాల్లో ఖర్చులు తగ్గుతున్నాయన్న విమర్శలు వినిపిస్తుండగా.. ఇంత భారీగా సైనిక వ్యయం అవసరమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కానీ ట్రంప్ మాత్రం దీనిని 'భవిష్యత్తు భద్రత కోసం చెల్లించాల్సిన ధర'గా చూస్తున్నారు. మొత్తానికి ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికా మాత్రమే కాదు.. ప్రపంచ శక్తి సమీకరణాలపై కూడా ప్రభావం చూపేలా ఉంది. ఇది భద్రతకు గ్యారంటీనా? లేక కొత్త ఆయుధ పోటీకి నాందినా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు ట్రంప్ కాలంలో అమెరికా సైనిక శక్తి ప్రపంచ రాజకీయాల కేంద్రబిందువుగా మారనుంది.

# జాతి ఐక్యతకు దోహదకారి హిందీ జనవరి 10 ప్రపంచ హిందీ దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష ప్రాముఖ్యతను చాటి చెప్పే ఉద్దేశంతో ప్రతి ఏటా జనవరి 10న ప్రపంచ హిందీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దినోత్సవానికి ప్రేరణగా నిలిచింది 1975 జనవరి 10న మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించిన తొలి ప్రపంచ హిందీ సదస్సు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ఆ సదస్సు, హిందీ భాషకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చే దిశగా కీలకమైన మైలురాయిగా నిలిచింది. దాని స్మారకార్థంగా 2006లో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జనవరి 10ను 'ప్రపంచ హిందీ దినోత్సవం'గా అధికారికంగా ప్రకటించారు. భారత జాతీయోద్యమ కాలంలో దేశవ్యాప్తంగా ప్రజలను ఏకతాటిపై నడిపించడంలో హిందీ భాష కీలక పాత్ర పోషించింది. మహాత్మా గాంధీ హిందీని "ఐక్యత భాష"గా అభివర్ణిస్తూ, దేశమంతటా సంభాషణకు, ఆలోచనల మార్పిడికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని నమ్మారు. ఆ స్ఫూర్తితోనే భారత రాజ్యాంగ నిర్మాతలు హిందీకి అధికార భాషా హోదా కల్పించారు. 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగ సభలో జరిగిన చర్చల అనంతరం, దేవనాగరి లిపిలో వ్రాయబడే హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా స్వీకరించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 343 ద్వారా ధృవీకరించబడింది. హిందీకి అధికార భాషా హోదా సాధించడంలో రాజ్యాంగ సభలో కీలకంగా కృషి చేసినవారిలో రాజేంద్ర ప్రసాద్, బాబూ రాజేంద్ర ప్రసాద్ (బిహార్‌కు చెందిన ప్రముఖ నేత), హజారీ ప్రసాద్ ద్వివేది, కాకా కలేల్కర్, మైథిలీ శరణ్ గుప్త్, సేఠ్ గోవింద్ దాస్ వంటి మహానుభావులు ఉన్నారు. వారి దీర్ఘకాల ప్రయత్నాల ఫలితంగా హిందీ, ఇంగ్లీష్‌తో పాటు భారత యూనియన్ స్థాయిలో అధికార భాషగా స్థిరపడింది. ప్రస్తుతం భారతదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో ప్రధానంగా ఉపయోగించబడుతున్నవి హిందీ, ఇంగ్లీష్ మాత్రమే. భాషా చరిత్రను పరిశీలిస్తే, హిందీ ఇండో–యూరోపియన్ భాషా కుటుంబానికి చెందిన ఇండో–ఆర్యన్ శాఖలోని భాష. "హిందీ" అనే పదం పర్షియన్ మూలాలనుంచి వచ్చింది. పాత పర్షియన్‌లోని "హిందు అనే పదం సంస్కృతంలోని "సింధు" నదిని సూచించేదిగా భావిస్తారు. కాలక్రమంలో ఇది భారతదేశాన్ని సూచించే పదంగా మారింది. హిందీ భాషకు సంస్కృతం ప్రధాన ఆధారంగా ఉన్నప్పటికీ, ఉత్తర భారతదేశంలో ఇస్లామిక్ పాలన కాలంలో పర్షియన్, అరబిక్, టర్కిష్ భాషల ప్రభావంతో అనేక రుణపదాలు ఇందులో చేరాయి. ఆ ప్రభావాల సమ్మేళనంతో హిందూస్థానీ రూపుదిద్దుకుంది; దానిలోనుంచే ఆధునిక హిందీ, ఉర్దూ భాషలు ప్రత్యేకంగా అభివృద్ధి చెందాయి. అవధి, బ్రజ్ వంటి మాండలికాలు హిందీ సాహిత్య సంప్రదాయానికి పునాదులు వేశాయి. మొఘల్ కాలం చివరి దశలో హిందీకి భాషా ప్రతిష్ట మరింత పెరిగింది. 18వ శతాబ్దం చివరి నాటికి ఆధునిక హిందీ సాహిత్య సంప్రదాయం స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంది. బ్రిటిష్ పాలన కాలంలో హిందీని ఉత్తర భారతదేశం అంతటా సాధారణ సంభాషణ భాషగా ప్రోత్సహించడం జరిగింది. 19వ శతాబ్దం చివర్లో ఉర్దూ నుంచి వేరుగా హిందీని ప్రామాణిక రూపంలో అభివృద్ధి చేయాలనే ఉద్యమం బలపడింది. నేడు హిందీ 9 రాష్ట్రాల్లో మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో అధికార భాషగా, మరికొన్ని రాష్ట్రాల్లో అదనపు అధికార భాషగా వినియోగంలో ఉంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, అండమాన్ఉ నికోబార్ దీవులు వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లో హిందీ విస్తృతంగా ఉపయోగించబడుతోంది. 1954లో కేంద్ర ప్రభుత్వం హిందీ వ్యాకరణాన్ని ప్రామాణీకరించేందుకు కమిటీని నియమించగా, దాని నివేదిక 1958లో "ఎ బేసిక్ గ్రామర్ ఆఫ్ మోడరన్ హిందీ"గా విడుదలైంది. దీని ద్వారా లిపి, ఉచ్చారణ, వ్యాకరణంలో ఏకరీతిని తీసుకువచ్చే ప్రయత్నం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా హిందీ మాట్లాడేవారి




సంఖ్య కోట్లలో ఉంది. భారతదేశం వెలుపల నేపాల్‌లో సుమారు 20 లక్షల మందికి పైగా, అమెరికాలో ఎనిమిది లక్షలకు పైగా, మారిషస్, ఫిజీ, దక్షిణాఫ్రికా, సురినామ్, యునైటెడ్ కింగ్‌డమ్, న్యూజిలాండ్, జర్మనీ వంటి దేశాల్లో లక్షల సంఖ్యలో హిందీ మాట్లాడేవారు ఉన్నారు. ఫిజీలో "ఫిజీ హిందీ"గా పిలవబడే రూపం రాజ్యాంగ పరిరక్షణ పొందింది. నేపాల్ జనగణనల ప్రకారం అక్కడ హిందీ మొదటి లేదా రెండవ భాషగా విస్తృతంగా వినియోగంలో ఉంది. దక్షిణాఫ్రికాలో కూడా హిందీ రక్షిత భాషగా గుర్తింపు పొందింది. అంతర్జాతీయ అంచనాల ప్రకారం హిందీ నేడు ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో ఒకటి. సుమారు 25 కోట్ల మంది హిందీని మాతృభాషగా, దాదాపు 150ఉ180 కోట్ల మంది రెండవ లేదా మూడవ భాషగా ఉపయోగిస్తున్నారని భావిస్తున్నారు. ఈ సంఖ్యలు హిందీకి ఉన్న విస్తృతి, ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి. అయితే, భారతదేశం వంటి బహుభాషా సమాజంలో మాతృభాషల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 351 ప్రకారం రాష్ట్రాలకు తమకు నచ్చిన భాషలో పరిపాలన నిర్వహించే స్వేచ్ఛ ఉంది. హిందీని బలవంతంగా రుద్దడంపై గతంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, తీవ్ర ప్రతిఘటన వ్యక్తమైంది. దానికి పరిష్కారంగా 1963 అధికార భాషల చట్టం తీసుకువచ్చారు. నేటి విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే అందాలి. అంతర్జాతీయ స్థాయిలో సంభాషణ కోసం ఇంగ్లీష్‌కు ఉన్న ప్రాముఖ్యతను కూడా విస్మరించలేం. అందుకే మాతృభాష, హిందీ, ఇంగ్లీష్‌ల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉంది.

నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా ఇదే దిశగా, ప్రాథమిక దశలో మాతృభాషలో విద్యను ప్రోత్సహించడంపై దృష్టి సారించింది. భిన్న భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశంలో పరస్పర అవగాహనకు ఒక ఉమ్మడి భాష అవసరం అనేది వాస్తవం. అదే సమయంలో ప్రతి భాషకూ సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన జాతీయ ఐక్యతకు పునాది. ఈ నేపథ్యంలో హిందీ భాష జాతి ఐక్యతకు దోహదకారి అయినప్పటికీ, మాతృభాషల పరిరక్షణతో పాటు సమన్వయ దృక్పథం అవసరమనే సందేశాన్ని ప్రపంచ హిందీ దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# తెలుగు సాహిత్యానికి పింగళి ఎనలేని సేవ - జనవరి 10...పింగళి లక్ష్మకాంతం జయంతి


అగ్రశ్రేణి కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, వక్తగా, సాహిత్యాచార్యులుగా ప్రసిద్ధి గాంచిన సాహితీ వేత్త ఆచార్య పింగళి లక్ష్మకాంతం. ఆంధ్ర భోజుడు శ్రీ కృష్ణ దేవ రాయలు ఆస్థానంలోని అష్ట దిగ్గజ కవులలో ఒకరైన పింగళి సూరన వంశీయులు, తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి శిష్యులు, కుర్తాళం సిద్ధేశ్వరి పీఠాధి పతులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారికి గురువులు పింగళి. పింగళి లక్ష్మకాంతం (జనవరి 10, 1894 – జనవరి 10, 1972) ప్రసిద్ధ తెలుగు కవి. లక్ష్మకాంతం అధ్యాప కులుగా, నటులుగా, కవిగా బహు ముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. పింగళి కాటూరి జంటకవులలో పింగళి ఆయనే. పింగళి లక్ష్మకాంతం 1894, జనవరి 10 న కృష్ణా జిల్లా ఆర్తమూరులో వెంకట రత్నం, కుటుంబమ్మలకు జన్మిం చారు. రేపల్లెలో ప్రాథమిక విద్యా భ్యాసం, మచిలీ పట్నం లోని హిందూ ఉన్నత పాఠశాల, నోబుల్ కళాశాలలో చదివారు. మద్రాసు విశ్వ విద్యా లయంలో ఎం.ఏ. పట్టా పొందారు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రికి శుశ్రూష చేసి, సంస్కృతాం ధ్రాలలో బాగా పఠించి ఆ మహాను భావుల శిష్యులలో అగ్ర గణ్యుల య్యారు. కాటూరి వెంకటేశ్వర రావుతో కలసి ఆయన ఆంజనేయ స్వామిపై శతకం చెప్పారు. వీరిరు వురు జంట కవులుగా పలు చోట్ల శతావధానాలు చేశారు. పాండవో ద్యోగ విజయములు, ముద్రా రాక్షసము నాటకాలలో ధర్మరాజు, రాక్షస మంత్రిగా పాత్రలు పోషించి పేరు పొందారు. నోబుల్ కళాశాలకు చెందిన పాఠశాలలో ఆంధ్ర పండితుడిగా పని చేశారు. మద్రాసు విశ్వ విద్యాలయం లోని ప్రాచ్య పరిశోధన విభాగంలో కొంతకాలం పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వ కళా పరిషత్తులో, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఆంధ్రాచార్యులుగా, అధ్యక్షులుగా పని చేశారు. 1906లో ప్రారంభమైన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తెలుగు కోర్సు 1931లో ప్రారంభమైనప్పుడు దానికి లెక్చరర్ గా, శాఖాధ్యక్షులుగా, పింగళి లక్ష్మ కాంతంను నాటి ఉప కులపతి డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ పిలిపించి నియమించారు. 1949 వరకు అక్కడ పని చేసి, తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ స్థాపించాక తెలుగు భాషా ప్రతి నిధిగా చేరారు. విజయవాడ ఆకాశ వాణి కేంద్రంలో ప్రసంగాల విభాగా నికి ప్రయోక్తగా ఉన్నారు. 1954 – 1961 విజయవాడ ఆకాశవాణి కేంద్రం సలహాదారుగా పని చేశారు. హైదరాబాద్ కు బదిలీ చేస్తే ఉద్యో గమే వదులు కుంటామని భీష్మించు కుని కూర్చున్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి ఆహ్వానం అందుకుని అందులో చేరారు. అలా ఆంధ్రలోని ఉత్తమ విశ్వ విద్యాలయాల తెలుగు విభాగాలకు ఆయన పునాది వేశారు. తిరుపతిలో ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేస్తూనే తెలుగు మాధ్యమంలో డిగ్రీ స్థాయివరకు విద్యాబోధన అంశం, తెలుగు అకా డమీ రూపకల్పన తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. విశ్రాంత జీవితంలో మిత్రులు, శిష్యుల ప్రోద్బలంతో కొద్ది కాలమే పుస్తకరచన, ప్రచురణ చేపట్టారు. 75ఏళ్ళ వయసులో, ఆరు దశా బ్దాలు సహ జీవనం చేసిన నేపథ్యంలో, 1969లో సతీ వియోగం ఆయనను కుంగ దీసింది. సాహిత్య వ్యవహారాలు, అధికార సంఘాల, బాధ్యతలను చేపట్టినా, మనసు లోని బాధను మరచి పోలేక పొయ్యారు. ఆంధ్ర సాహిత్య అకాడమీలో విశిష్ట సభ్యత్వం, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ గౌరవ డాక్టరేట్ బిరుదు అందుకున్నారు. 1970 నాటికి అనారోగ్యాలు ఆయనను వెంటాడాయి. అయితే చికిత్స కోసం1971 ఆగస్టులో తిరుపతి నుండి హైదరాబాద్ వెళ్ళారు. 1972 జనవరిలో సంక్రాంతికి ముందు తెలుగు సాహిత్య రంగంలో అవిరళ కృషి సల్పిన పింగళి లక్ష్మ కాంతం1972



సంవత్సరం జనవరి 10 తేదీన ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. సాధారణంగా జయంతి, వర్ధం తులు ఒకేరోజు రావటం బహు అరుదు. అయితే పింగళి పుట్టిన రోజు, మరణించిన రోజు ఒక్కటే జనవరి 10 కావడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# తెలుగు సినీ రంగ ఆణిముత్యం ముక్కామల - జనవరి 10...ముక్కామల కృష్ణమూర్తి వర్ధంతి



ముక్కామల కృష్ణమూర్తి తెలుగు సినిమా రంగంలో సుస్థిరమైన ముద్ర వేశారు. ఆయన కథనాలు, పాత్రలు, దర్శకత్వం, రచనతో తెలుగు సినిమా రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. నటుడిగా మాత్రమే కాకుండా రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా ఆయన తన ప్రతిభను చాటారు. 1950, 1960 దశకాల్లో తెలుగు చిత్ర పరిశ్రమలో ఆయన పేరు వెలుగొందింది.

**ప్రారంభ జీవితం...** ముక్కామల కృష్ణమూర్తి ఆంధ్ర ప్రదేశ్‌లో1920 ఫిబ్రవరి 28న గుంటూరు జిల్లా గురజాలలో జన్మించారు.

వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ, చిన్నతనం లోనే కళలపై ఆసక్తి కలిగి రంగస్థల నటుడిగా మంచి పేరు సంపాదించారు. ఆయన నటనలో సహజత్వం, భావోద్వేగాల ప్రదర్శన ప్రేక్షకులను మెప్పించేవి. రంగస్థల అనుభవం ఆయనకు సినిమా రంగంలో ఉపయోగ పడింది.

**సినీ జీవితం:** ముక్కామల కృష్ణమూర్తి 1950లలో తెలుగు సినిమా రంగంలో ప్రవేశించారు. అప్పటి తెలుగు సినిమాలు భక్తి, చారిత్రక, జానపద కథల ఆధారంగా సాగేవి. ఈ తరహా సినిమాల్లో ఆయన పాత్రలు అత్యంత గుర్తింపు పొందాయి.

**ముఖ్య చిత్రాలు...** జగదేక వీరుని కథ, శ్రీకృష్ణ పాండవీయం, ఉమాచండి గౌరి శంకరుల కథ, లైలా మజ్ను (ఈ సినిమాలో భానుమతి తండ్రిగా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు), మాయాబజార్ వంటి చిత్రాల్లో ఆయన విలక్షణమైన పాత్రలను పోషించి ప్రేక్షకుల హృదయాలను గెలుచు కున్నారు.

**దర్శకుడు, రచయితగా ...** ముక్కామల నటనకే పరిమితం కాకుండా రచయితగాఓ దర్శకుడిగా తన ప్రతిభను చాటారు. దర్శకత్వం: ఆయన దర్శకత్వం వహించిన "మరదలు పెళ్లి" , "ఋష్యశృంగ" వంటి చిత్రాలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. రచన: కథలు రాయడం ఆయనకు ప్రత్యేకమైన అభిరుచి. ఆయన రాసిన కథలు నాటకీయతతో, భావోద్వేగాలతో నిండి ఉండేవి.

**సహజత్వానికి ప్రాముఖ్యత:** ముక్కామల నటనలో సహజత్వానికి ప్రధాన ప్రాధాన్యత వుంది. విలన్ పాత్రలు, రాజకీయ నాయకుల పాత్రలు, కుటుంబ పెద్దల పాత్రల్లో ఆయన స్ఫూర్తి దాయకంగా నిలిచారు. ఆయన నటనలో భావోద్వేగాల ప్రదర్శన ప్రేక్షకులను చలింపచేసేది.

**అన్య భాషల్లో కృషి:** తెలుగు చిత్రాలకే పరిమితం కాకుండా తమిళ, కన్నడ భాషా చిత్రాల్లో కూడా నటించారు. వివిధ భాషల్లో తన ప్రతిభను చాటుతూ దక్షిణాది సినిమా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు.

**వ్యక్తిగత ఆసక్తులు:** ముక్కామల కేవలం సినిమాలకే పరిమితం కాకుండా కళల పట్ల విస్తృతమైన ఆసక్తి కలిగి ఉండేవారు. ఫోటోగ్రఫీ, పెయింటింగ్, మరియు నాటకరంగం ఆయనకు ప్రత్యేకమైన హాబీలు. నూతన నటీ నటులకు సహకారం అందించడంలో ఆయన ముందుండేవారు.

**ముక్కామల వారసత్వం:** ముక్కామల కృష్ణమూర్తి 1987 జనవరి 10న చివరి శ్వాస విడిచారు. ఆయన చేసిన కృషి తెలుగు సినీ రంగానికి చిరస్మరణీయం. ఆయన నటన, రచన, దర్శకత్వం ఇప్పటికీ ప్రేక్షకుల గుండెల్లో జీవిస్తోంది. ముక్కామల కృష్ణమూర్తి తెలుగు సినిమా రంగానికి చేసిన సేవలు అద్భుతమైనవి. ఆయన ప్రతిభ, సినీ రంగానికి తన జీవనాన్ని అంకితం చేసిన తపన, నేటి తెలుగు సినిమా అభివృద్ధికి పునాది వేసిన గొప్ప వ్యక్తిగా గుర్తించ బడతారు. ఈయన అందించిన స్ఫూర్తి, వారసత్వం సినిమాపై మక్కువ ఉన్న ప్రతి కళాకారుడికి ఆదర్శంగా నిలుస్తాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# అక్రమం సేరే..ఎల్ఆర్'ఎస్' అనరే?

హైదరాబాద్ : మహా నగరంలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి చాలా మంది ఆసక్తి చూపించడం లేదు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో ఇప్పటికే 2.07 లక్షల దరఖాస్తుదారులకు ఫీజుల చెల్లింపుపై సమాచారం అందించినా ముందుకు రావడం లేదు. 77,536 మంది మాత్రమే ఫీజులు చెల్లించారు. ఇందులో ఇప్పటివరకు 30 వేలకుపైగా దరఖాస్తులను హెచ్ఎండీఏ ఆమోదించింది. మొత్తం రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరింది. గతంలో హెచ్ఎండీఏ పరిధిలోని పంచాయతీల్లో వేలాది లేఅవుట్లు వెలిశాయి. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి హెచ్ఎండీఏ



కార్యాచరణ చేపట్టింది. ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్ల పరిధిలో దాదాపు 3.42 లక్షల ప్లాట్ల క్రమబద్ధీకరణకు గతంలో దరఖాస్తులు అందాయి. వీరంతా రూ.వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఫీజులు, ఇతర ఛార్జీలు చెల్లించిన అనంతరం క్రమబద్ధీకరణ పూర్తయినట్లు ప్రొసీడింగ్స్ పత్రాలు అందించాలి. చాలామంది ఫీజుల చెల్లింపునకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

**తర్వాత చూద్దాం లే..**

ప్రస్తుతం ఫీజుల చెల్లింపునకు సంబంధించి నోటీసులు జారీ చేసినా చాలామందిలో తర్వాత చూద్దామనే ధోరణి కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఇళ్ల ఇతర నిర్మాణాలు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో కూడా చాలామంది వెనక్కి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎల్1 స్థాయిలో దరఖాస్తుల పరిశీలన జాప్యమూ కొంత కారణమే. దీంతో మిగతా వారు సైతం విరమించుకుంటున్నారు. విభాగాల మధ్య సమన్వయం లేక క్షేత్రస్థాయిలో ఆలస్యం జరుగుతోంది.

**హెచ్ఎండీఏ పరిధిలో ఇలా..**

మొత్తం దరఖాస్తులు 3,42,816
ఫీజు సమాచారం ఇచ్చినవి 2,07,501
ఫీజు చెల్లించినవారు 77,536
ఆమోదం తెలిపిన దరఖాస్తులు 30,209
షార్ట్‌ఫాల్స్ గుర్తించిన దరఖాస్తుల సంఖ్య 27,470

# మళ్లీ వచ్చేస్తోంది.. 'రాయితీ' ఆనవాయితీ..!

కొత్తగూడెం : యంత్రం ఖరీదులో ఎస్సీ, ఎస్టీలు 50శాతం, ఇతరులు 60శాతం వాటా భరించాలి. మిగతా మొత్తం ప్రభుత్వం రాయితీ కింద సదరు కంపెనీ ఖాతాలో జమచేస్తుంది.

మట్టిని నమ్ముకున్న రైతుకు ఆధునిక సాంకేతికత తోడుకానుంది. సాగు ఖర్చు పెరిగి కూలీల కొరత వేధిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచేందుకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు చేసింది. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో ఈ పథకాన్ని శుక్రవారం (ఈనెల 9న) లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే డీడీలు చెల్లించిన రైతులకు వ్యవసాయ పరికరాలు అందించనుంది.

**దరఖాస్తు విధానం**

స్థానిక ఏఈఓ, ఏఓలను సంప్రదిస్తే దరఖాస్తుపత్రం ఇస్తారు. యంత్రానికి సంబంధించిన వివరాలను రైతులు నమోదుచేసి సమర్పిస్తే ఆ దరఖాస్తును అధికారులు ఆన్‌లైన్‌లో నిక్షిప్తపరుస్తారు. ఆయా మండలాల పరిధిలో అందిన దరఖాస్తులను తహసీల్దారు, ఎంపీడీఓ, ఏఓతో కూడిన మండల స్థాయి కమిటీ పరిశీలించి అర్హత కలిగిన అర్జీలను జిల్లా అధికారులకు పంపిస్తారు. జిల్లా అధికారులు ఆమోదించగానే యంత్రాలను సరఫరా చేసే కంపెనీల పేరిట రైతులు డీడీలు చెల్లించాలి.

**పదేళ్ల తరువాత..**

పదేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమల్లో ఉంది. 40-50శాతం రాయితీతో పరికరాలను వ్యవసాయ శాఖ మంజూరు చేసేది. రైతు ఉత్పత్తి సహకార కేంద్రాలు, స్వయం సహాయక సంఘాలతో 'కస్టమ్ హైరింగ్ కేంద్రాలు' ఉండేవి. ఇవి వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చేవి. పదేళ్లుగా ఈ పథకం అమలుకు నోచుకోలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించటంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కలిగే ప్రయోజనాలు..

ః వ్యవసాయ రంగంలో ప్రధాన సమస్య కూలీల లభ్యత. ఈ సమస్యను



అధిగమించేలా యంత్రాల సహాయంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పనులు పూర్తిచేయవచ్చు.

ః విత్తనాలు వేయటం నుంచి కోతల వరకు యంత్రాలను వాడటం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.

ః వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పనులు ముగించుకోవటానికి ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు వంటివి వరంగా మారనున్నాయి.ః ప్రభుత్వం అందించే ఆర్థిక ఊతం వల్ల చిన్న, సన్నకారు రైతులూ ఖరీదైన యంత్రాలను ఉపయోగించవచ్చు.

వచ్చిన దరఖాస్తులు
ఖమ్మం 3,364
భద్రాద్రి 326
మంజూరైన యూనిట్లు
ఖమ్మం 172
భద్రాద్రి 326

వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద భద్రాద్రి జిల్లాలో 326 మందికి వివిధ రకాల యూనిట్లు మంజూరు చేశాం. డీడీలు చెల్లించిన రైతులకు శుక్రవారం నుంచి యంత్రాలు అందిస్తాం. ప్రభుత్వం మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పరికరాలు కేటాయిస్తాం.
బాబూరావు, డీఏఓ, భద్రాద్రి కొత్తగూడెం

# పేదలపై దా'రుణం'!



ఖమ్మం : రెక్కాడితే డొక్కాడని పేదల ఆర్థిక అవసరాలను కొందరు అక్రమార్కులు ఆసరా చేసుకున్నారు. రుణమిచ్చి ప్రతివారం కిస్తీల రూపేణా భారీగా దండుకుంటున్నారు. చెల్లించనివారి ద్విచక్రవాహనాలను ల్యాక్కుతున్నారు. ఖమ్మం నగర శివారు దానవాయిగూడెం కాలనీలో పదిరోజులుగా నలుగుతున్న ఈ ఘటన వివరాలు తాజాగా వెలుగుచూశాయి.

**అసలేం జరిగిందంటే..?**

దానవాయిగూడెం కాలనీకి చెందిన కొందరు పేదలు తమ ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు రోటరీనగర్ చిరునామాతో నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.50వేల చొప్పున రుణం తీసుకున్నారు. నిర్వాహకులు ముందే రూ.2వేలు కోత విధించి రూ.48వేలు చెల్లించారు. ప్రతివారం రూ.3వేల చొప్పున 17నెలలు కిస్తీలు కట్టాలని చెప్పారు. రుణ గ్రహీతల్లో కొందరు సక్రమంగా చెల్లించలేకపోయారు. అలాంటివారి ద్విచక్రవాహనాలను సంస్థ నిర్వాహకులు ల్యాక్కెళ్లారు. సక్రమంగా రుణం చెల్లించినవారికి భారీ రుణమిస్తామంటూ నమ్మబలికారు. రూ.2లక్షల చొప్పున రుణం ఇస్తామని చెప్పారు. ఇందుకోసం ముందస్తుగా ఒక్కొక్కరు డిపాజిట్ రూ.20వేలు, బ్యాంకు సిబ్బందికి రూ.35వేలు చెల్లించాలని తెలిపారు. ఆ తరువాత రూ.2లక్షలు తీసుకొని 36 నెలల్లో కిస్తీలు చెల్లించాలని స్పష్టం చేశారు. నిజమేనని నమ్మి కొందరు పేదలు రూ.55వేల చొప్పున నగదు చెల్లించటం గమనార్హం.

**డ్వాక్రా సంఘం ఏర్పాటుకు యత్నాలు**

పేదల ఆధార్ కార్డులను సదరు ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు సేకరించారు. పేదలకు తెలియకుండా నకలు ప్రతుల్లో వారి చిరునామాలను దానవాయిగూడెం నుంచి పెద్దతండాకు మార్చారు. అనంతరం సంతకాలను ఫోర్జరీ చేసి ఏదులాపురంలోని ఓ బ్యాంకులో శ్రీగణేశ్ స్వయం సహాయక సంఘం పేరిట ఖాతా తెరిచేందుకు యత్నించారు. అయితే ఈ సంఘంలో లీడర్లుగా ఉన్న ఇద్దరు మహిళలు మరో డ్వాక్రా గ్రూపులో సభ్యులవటంతో బ్యాంకు సిబ్బంది తిరస్కరించారు. వేరే మహిళల పేరిట సంఘం ఖాతాను అక్రమార్కులు తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు ఏదులాపురానికి చెందిన ఓ గ్రామదీపిక సహకరిస్తున్నట్లు సమాచారం. ఆరు నెలలుగా సదరు సంఘం నడుపుతున్నట్లు నకిలీ దస్త్రాలు సృష్టించినట్లు తెలుస్తోంది. ఈ తతంగంపై కొందరు మహిళలకు అనుమానం రావటంతో సదరు గ్రామదీపిక బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానవాయిగూడెంలోనే ఇలా డిపాజిట్ చెల్లించి మోసపోయినవారు సుమారు 20 మంది ఉన్నట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు రామన్నపేట, ఎన్టీఆర్‌నగర్, టేకులపల్లి రెండు పడక గదుల ఇళ్లు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వెలుగుచూస్తుండటం గమనార్హం. ఈ తతంగంపై కొందరు మహిళలకు అనుమానం రావటంతో సదరు గ్రామదీపిక బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానవాయిగూడెంలోనే ఇలా డిపాజిట్ చెల్లించి మోసపోయినవారు సుమారు 20 మంది ఉన్నట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు రామన్నపేట, ఎన్టీఆర్‌నగర్, టేకులపల్లి రెండు పడక గదుల ఇళ్లు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వెలుగుచూస్తుండటం గమనార్హం. మోసపోయినట్లు గ్రహించి కొందరు బాధితులు.. ఖమ్మం గ్రామీణం, ఖానాపురంహవేలి ఠాణాల్లో డిసెంబర్ 26న ఫిర్యాదు చేశారు. అయినా పోలీసుల నుంచి సరైన స్పందన లేదని భావించి జనవరి 2న సీపీని ఆశ్రయించారు. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

# పఠనం.. విజ్ఞాన మకుటం



సూర్యాపేట : పత్రిక పఠనం చేస్తున్న వీరు నల్గొండ జిల్లా చిట్యాలలోని పీఎంశ్రీ జడ్పీఉన్నతపాఠశాల విద్యార్థులు. 207 మంది పిల్లలున్న ఈ బడిలో ఏర్పాటు చేసిన గ్రంథలయంలో తెలుగు, ఆంగ్ల దినపత్రికలతో పాటు రెండు భాషల్లో సుమారు 600 పుస్తకాలు ఉన్నాయి. తరగతుల వారీగా కేటాయించిన పీరియడ్‌లలో పిల్లలతో పత్రికలను చదివిస్తూ వారికి నచ్చిన పుస్తకం చదవడానికి ఇంటికి తీస్కుళ్లే అవకాశం కల్పించారు.

చదువు అంటే కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదు. ప్రపంచంలో రోజూ జరుగుతున్న మార్పులను తెలుసుకోవాలి. ఇందులో వార్తా ప్రతికా పఠనం ప్రధానమైంది. విద్యార్థులు తమ దినచర్యలో కొంత సమయాన్ని పత్రికలు చదవడానికి కేటాయిస్తే జాతీయ, అంతర్జాతీయ విషయాలు, క్రీడలు, విజ్ఞానం, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెరుగుతుంది.

**అక్కడ భళా..**

ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు అక్కడి ప్రభుత్వ బడుల్లో ప్రతిరోజూ ఉదయం అసెంబ్లీలో కనీసం పది నిమిషాలపాటు విద్యార్థులతో వార్తాపత్రికలను చదివించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

మన దగ్గర ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,903 ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 3.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 70కి పైగా బడులు పీఎంశ్రీ పథకం కింద ఎంపికయ్యాయి. వీటిలో పిల్లలకు లోకజ్ఞానాన్ని పెంపొందించడానికి దినపత్రికల సదుపాయం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ చాలా బడుల్లో పత్రికలు లేవు. పిల్లల విజ్ఞానాభివృద్ధికి దాతలు ముందుకొచ్చి పాఠశాలలకు దినపత్రికల సదుపాయం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయోజనాలు చాలా..

పాఠశాల స్థాయి నుంచే వార్తా పత్రికలు చదవడం వల్ల భాషానైపుణ్యాలు మెరుగుపడతాయి. పోటీపరీక్షలు, వ్యాసరచన, ఉపన్యాసం వంటి వాటికి సహాయపడతాయి. జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలపై అవగాహన కలుగుతుంది. ప్రభుత్వాలు అమలు చేయనున్న సంక్షమ పథకాల, శాస్త్రీయ ఆవిష్కరణల వంటి అంశాలను తెలుసుకుంటారు. క్రమంగా మొబైల్ తెరకు దూరంగా ఉంటారు.

**పఠనాసక్తి పెరుగుతోంది**

– గంజి శివసాయి, తొమ్మిదో తరగతి, చిట్యాల

పాఠశాల గ్రంథలయానికి వెళ్లడం వల్ల పుస్తకపఠనంపై ఆసక్తి పెరిగింది. దినపత్రికల్లో ఎక్కువగా క్రీడావార్తలు చదువుతాను. ఇంకా ముఖ్యఘటనలు తెలుసుకోగలుగుతున్నాను. అలాగే సైన్సు, చరిత్ర, నీతి కథల పుస్తకాల పఠనం వల్ల తరగతిలో పుస్తక సమీక్ష జరిగినప్పుడు మంచి మార్కులు సాధిస్తున్నాను.

# నడిపించడంలో ఆరితేరారు..!

భువనగిరి : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్లు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. పూర్తి స్థాయిలో అర్హత లేని వారు సైతం శిక్షకులుగా కొనసాగుతున్నారు. కాలం చెల్లిన వాహనాలతోనే నేర్పిస్తున్నారు. కారు నడపడం నేర్చుకునే వారికి థియరీ క్లాసులు కనీసం ఎనిమిది గంటలు నిర్వహించాలి. వాహనం నడపడం నేర్చుకునేవారు నిబంధనలు పాటించే స్కూళ్లలోనే శిక్షణ పొందాలని నిపుణులు సూచిస్తున్నారు. రహదారి భద్రత మాసోత్సవాల నేపథ్యంలో ఈ కథనం.అక్రమ వసూళ్లు: కొన్ని కేంద్రాల నిర్వాహకులు లైసెన్సులు ఇప్పిస్తామంటూ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆర్టీవో నిర్ణయించిన ప్రకారం శిక్షణకు సొమ్ము వసూలు చేయాలి. కొందరు ఇష్టానుసారంగా తీసుకుంటున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ఆర్టీఏ కార్యాలయం ఎదుట కొంత మంది ఒక్క రోజులోనే శిక్షణ ఇచ్చి, లైసెన్సు ఇప్పిస్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు కొందరు డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైవింగ్ స్కూల్స్‌పై దృష్టి సారించి నిబంధనలు అమలయ్యేలా చూడాల్సి ఉంది. డ్రైవింగ్ స్కూల్స్ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా రవాణాధికారి జయప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వారికి నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు.**నిబంధనలు ఇలా..**



పాఠశాల నిర్వహించే వారికి విశాలమైన ప్రాంగణం ఉండాలి. నాలుగు చక్రాలైతే ఎకరా స్థలం తప్పనిసరి. ప్రభుత్వ గుర్తింపు అవసరం. శిక్షకుడికి కనీసం డిప్లొమా లేదా చోదక రంగంలో ఐదేళ్ల అనుభవం ఉంటేనే లైసెన్సు మంజూరు చేస్తారు. ట్రేడ్ మార్కు నమోదు చేసుకోవాలి. ఎంఎస్ఎంఈ, బీమా పాలసీ, పాన్, టాన్‌లతోపాటు సంబంధిత ఆర్టీవో నుంచి డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ లైసెన్సు పొందాలి. తరగతుల నిర్వహణకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలి. తొలుత వారం పాటు తరగతులు నిర్వహించాలి. థియరీ కోసం కనీసం 8 గంటలైనా కేటాయించాలి. క్లచ్, బ్రేక్, యాక్సిలేటర్.. తదితరాలను ఎలా ఉపయోగించాలో నేర్పించాలి. శిక్షణలో వాటిని చూపాలి. రోడ్డు నిబంధనలు, సంకేతాలు, సైన్ బోర్డులపై అవగాహన తప్పనిసరి.

# మురుగునీటి శుద్ధికి.. భూసేకరణే అడ్డంకి..!

ఖమ్మం : ఖమ్మం నగర రహదారులపై వృథనీరు నిలవకుండా, చెరువుల్లోకి చేరకుండా దూరం తరలించటానికి చేపట్టిన భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ(యూజీడీ) పనులకు భూసేకరణ ప్రక్రియ అడ్డంకిగా మారింది. అమృత్ పథకంలో తొలివిడతలో మంజూరైన రూ.239కోట్లతో భూగర్భంలో పైపులైన్లు వేయాలి. వీటిద్వారా వచ్చే వృథజలాలను శుద్ధిచేయటానికి పుట్టకోట, ధంసలాపురంలో రెండు మురుగునీటి శుద్ధికేంద్రాలు (ఎస్‌టీపీలు) నిర్మించాలి. ఖమ్మం నగరంలోని 60శాతం మురుగు జలాలను శుద్ధిచేయటానికి ధంసలాపురంలో 44 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే) ఎస్‌టీపీ ఏర్పాటుకు నగరపాలక సంస్థ సంకల్పించింది. ఏడున్నరెకరాల భూమి అవసరమని రెవెన్యూ అధికారులను కోరింది. ఇందులో ప్రభుత్వ భూమి రెండెకరాలు పోను మిగిలిన ఐదున్నరెకరాలు సేకరించాలి. ఏఏ సర్వేనంబర్లలో ఎంతెంత భూమి సేకరించాల్సి ఉందో తెలుసుకోవటానికి అధికారులు సర్వేకు ప్రయత్నించగా స్థానిక రైతులు సహకరించలేదు. భూములివ్వటానికి ఆసక్తి చూపలేదు. ప్రజావసరాలకు భూమి సేకరిస్తామని సర్వేనంబర్లతో రెవెన్యూ అధికారులు ప్రిలిమినరీ నోటిఫికే



షన్(పీఎన్) ఇచ్చారు. 60రోజుల తరువాత ప్రిలిమినరీ డిక్లరేషన్(పీడీ) ఇవ్వాలి. ఇందుకోసం రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సమర్పించినట్లు తెలిసింది. వీటిని కలెక్టర్ పరిశీలించి గెజిట్ జారీచేస్తారు. నెలరోజుల్లో అవార్డు ప్రతిని ప్రచురిస్తారు. గత మూడేళ్లలో.. పరిసరాల్లో జరిగిన క్రయవిక్రయాల ఆధారంగా పరిహారం నిర్ణయిస్తారు. స్థానికంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు సుమారు రూ.60లక్షల పరిహారమిచ్చారు. ఈలెక్కన ఇక్కడా పరిహారం నిర్ణయించే అవకాశముంది. 'రైతులు ముందుకు రానందున పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేస్తాం' అని ఆర్డీఓ నరసింహారావు తెలిపారు.

పుట్టకోటలో రెండున్నర ఎకరాల్లో ఎస్‌టీపీ నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించింది. ప్రస్తుతం దానిచుట్టూ ప్రహరీ నిర్మాణం జోరందుకుంది. త్వరలో 9.50 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ పనులు మొదలవుతాయి.

**9.60 కి.మీ. మేర పైపులైన్..**

నగరంలోని గృహాల నుంచి వెలువడే వ్యర్థపునీటి చేరికతో ఖానాపురం ఊరచెరువు, ధంసలాపురం, పుట్టకోట చెరువులు కలుషితమవుతున్నాయి. ఆ నీటిని ఎస్‌టీపీలకు తరలించటానికి 9.60కి.మీ. మేర పైపులైన్‌ను భూగర్భంలో వేస్తున్నారు. ఖానాపురం ఊరచెరువు నుంచి 6వ డివిజన్ వరకు, బైపాస్ సొరంగం నుంచి సీఆర్‌జీ టవర్ పరిసరాల్లో పైపులైన్ ఏర్పాటుచేశారు. లకారం ట్యాంక్‌బండ్ పరిసరాల్లో సొరంగం నిర్మిస్తున్నారు. మమత రోడ్డులో టన్నెల్ కుంగింది. ఆ రోడ్డుపై పైపులు వేస్తున్నారు.'పైపులైన్ పనులు మార్చిలోపు పూర్తిచేస్తాం. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే నిర్దేశిత ప్రాంతంలో డిజైన్ ప్రకారం ఎస్‌టీపీలు నిర్మిస్తాం' అని ప్రజారోగ్యశాఖ ఎస్ఈ రంజిత్‌కు తెలిపారు.

# పల్లె సారథులకు.. శిక్షణ

ఆలేరు : గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి నూతనంగా ఎన్నికైన సర్పంచులు గతనెల 22న పదవీ బాధ్యతలు చేపట్టారు. అందరికీ గ్రామ పంచాయతీల నిర్వహణ, పంచాయతీరాజ్ చట్టాలు, బాధ్యతలు, విధుల నిర్వహణపై విడతల వారీగా శిక్షణ కార్యక్రమానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. కాగా సర్పంచులకు, వార్డుసభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా నుంచి ఎనిమిది మంది టీవోటీ (ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్)లను ఎంపిక చేశారు. వారిలో ఒక డీఎల్పీవో, ముగ్గురు ఎంపీడీవోలు, మరో ముగ్గురు ఎంపీవోలు, ఒక ఈసీ (ఉపాధిహామీ)లు ఉన్నారు. వీరు ఈ నెల 10వ తేదీ వరకు రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా తర్ఫీదు పొందుతున్నారు. శిక్షణ పూర్తికాగానే ఆయా జిల్లాలకు వచ్చి సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల, జిల్లా స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి




తరగతులు కొనసాగిస్తారు.

**అంశాల వారీగా...**గ్రామాల్లో పాలన ఏ రకంగా అందించాలి, బాధ్యతలు, విధులు, నిధుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాల్సిన తీరు, సమావేశాలు, దస్త్రాల నిర్వహణ, ఈ పంచాయతీల తీరుతెన్నులు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ఎలా నిర్వహించాలనే విషయంపై వివరిస్తారు. కేంద్రం, రాష్ట్రం నుంచి ఏ రకమైన నిధులు వస్తాయి, ఖర్చుపై వివరాలు చెబుతారు. చట్టాన్ని అతిక్రమిస్తే సర్పంచులపై ఎలాంటి చర్యలు ఉంటాయనే విషయాలను వివరిస్తారు.

**శిక్షణ ఉపయుక్తం: చిలుకూరి శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్**

గ్రామాల్లో ఎన్నికైన కొత్త కార్యవర్గాలకు అవగాహన కల్పించి పాలన, అభివృద్ధి వైపు వెళ్లేలా చూడాలనేది శిక్షణ ముఖ్య ఉద్దేశం. ఈ క్రమంలో జిల్లా స్థాయిలో ఎంపికైన టీవోటీలకు ఐదు రోజులపాటు గురుకుల పద్ధతిలో ప్రస్తుతం హైదరాబాద్‌లో శిక్షణ జరుగుతుంది. తదనంతరం వారి ద్వారా క్షేత్రస్థాయిలో విడతల వారీగా సర్పంచులకు శిక్షణ కార్యక్రమాలు ఉండనున్నాయి.

చురకలు



## నగరంలో బాహుబలి పీటీఆర్‌లు

హైదరాబాద్ : నగరంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్... కొత్త విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి స్థలాల కొరత కారణంగా ప్రస్తుతం ఉన్న కేంద్రాల్లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) సామర్థ్యం పెంచే చర్యలను దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) చేపట్టింది. తెలంగాణ డిస్కంల పరిధిలోని 33/11కేవీ ఉపకేంద్రాల్లో ఇప్పటివరకు 5 ఎంవీఏ, 8 ఎంవీఏ, గరిష్ఠంగా 12.5 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పీటీఆర్‌లు మాత్రమే ఉన్నాయి. మొదటిసారిగా 16 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పీటీఆర్‌లను ఏర్పాటు చేశారు. దేశంలోనే తమిళనాడు విద్యుత్తు బోర్డు తర్వాత ఈ స్థాయి పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసిన రెండో డిస్కం మనదని విద్యుత్తు అధికారులు తెలిపారు.



ఎక్కడెక్కడ..: ఈఎస్‌ఐ, రవీందర్ సొసైటీ, సరోజినిదేవి ఆసుపత్రి, అల్లూరి సీతారామనగర్, ప్రకాశ్‌నగర్, మల్లేపల్లి, నాంపల్లి, మోతీమహల్, జూబ్లీహిల్స్, ఎల్‌వీ ప్రసాద్, గంధంగూడ, చాంద్రాయణగుట్ట, సీతాఫల్‌మండి తదితర ఉపకేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.1.95 కోట్ల వరకు ఉందని వెల్లడించారు.16 ఎంవీఏ అంటే 16వేల కేవీఏతో సమానం. ఒక ఇంటికి ఒక కిలోవాట్ కనెక్టెడ్ లోడ్ అనుకుంటే 16వేల కనెక్షన్లకు విద్యుత్తు సరఫరా చేయవచ్చు.

## చైనా మాంజా.. ఖాకీల పంజా

హైదరాబాద్ : నగరంలో వాహనదారులు, పక్షుల ప్రాణాలు బలితీసుకుంటున్న చైనామాంజా విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తున్నట్టు నగర కొత్వాల్ వీసీ సజ్జనార్ సోమవారం తెలిపారు. నిషేధిత మాంజా విక్రయించినా, నిల్వచేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనా మాంజా నియంత్రణకు క్షేత్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగాలు పతంగుల విక్రయ దుకాణాలు, అనుమానిత గోదాములపై అకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల కొందరు వాహనదారులు ఈ మాంజా బారినపడి తీవ్రంగా గాయపడ్డారు.




**ప్రమాదకర పూతతో..**చైనా మాంజా తయారీలో ప్లాస్టిక్, గాజులు, ఇతర సింథటిక్ పదార్థాల మిశ్రమం పూతగా ఉంటుందని, దీని కారణంగా పిల్లల వేళ్లు, ద్విచక్రవాహనదారుల మెడలకు చుట్టుకున్నపుడు ప్రమాద తీవ్రత పెరుగుతుందని సీపీ హెచ్చరించారు. దీనిలో ఉండే మెటాలిక్ పదార్థంతో విద్యుత్ తీగలకు తగిలినపుడు షాక్ కొట్టి పిల్లల ప్రాణాలకు అపాయం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. సంప్రదాయ నూలు దారాలను వినియోగించి పతంగులు ఎగురవేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. నగర వ్యాప్తంగా మాంజా కట్టడికి ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నిషేధిత మాంజా వివరాలను పోలీసులకు డయల్ 100, వాట్సాప్ నెంబర్ 94906 16555కు అందజేయాలని సూచించారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## నీలగిరి.. మహానగరి..!

నల్గొండ : నీలగిరికి మహర్దశ వచ్చింది. పురపాలిక ప్రజల చిరకాల స్వప్నం ఫలించింది. మహా నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది.రాష్ట్ర అసెంబ్లీ, శాసన మండలిలో కార్పొరేషన్ హోదా పెంచుతూ ప్రవేశపెట్టిన తీర్మానం బిల్లుపై చర్చించి ప్రభుత్వం ఆమోదించింది. అధికారికంగా గెజిట్ (ఉత్తర్వులు) వెలువడాల్సి ఉంది.ః రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కొత్తగా పురపాలికలు, నగరపాలక సంస్థలు ఏర్పాటు ప్రక్రియ చేపట్టడంతో.. నల్గొండను మహానగరం (కార్పొరేషన్)గా ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో కలిసి ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి కోమటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. సమీప గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియ లేకుండానే ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ పరిధితోనే కొత్తగా నగరపాలక సంస్థ ఏర్పాటుకు అంగీకరించింది.

ప్రయోజనాలు ఇలా..మహానగర పాలక సంస్థగా ఆవిర్భవించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.వందల కోట్ల నిధులు దండిగా రానున్నాయి. మౌలిక సౌకర్యాల అభివృద్ధి, మానవ ఆర్థిక



సూచీ ఎగువకు పాకనుంది. ఉద్యోగుల పోస్టుల సంఖ్య పెరగడంతో పాటు వారి స్థాయికి తగ్గట్టు హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు, వేతనాలు అందనున్నాయి.

48 డివిజన్లతోనే ఏర్పాటు...!

నల్గొండ పురపాలికలో 48 వార్డులు ఉండగా వాటిని పునర్విభజన చేయకుండానే మహానగర పాలక సంస్థగా ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి సూచన మేరకు కార్పొరేషన్ ఏర్పాటుకు కావాల్సిన పూర్తి సమగ్ర వివరాలు సేకరించి ప్రతిపాదనల రూపంలో గతేడాది నవంబరులో అందజేశారు. డివిజన్ల విభజన లేకుండానే పురపోరుతో పాటే యథవిధిగా ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# శ్రీవారి ఆలయం.. పనుల్లో వేగం



కొడంగల్: శ్రీమహాలక్ష్మ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. చుట్టూ ఉన్న 96 ఇళ్ల కూల్చివేతకు ప్రజలు సహకరించడంతో వారికి రూ.22 కోట్ల నష్టపరిహారం చెల్లించారు. దీంతో ఇప్పటికే కొన్ని నివాసాలు ఖాళీ చేయడంతో అధికారులు కూల్చే పనుల్లో నిమగ్నమయ్యారు.

**ఫిబ్రవరి 10 నాటికి..**

వచ్చేనెల 10వ తేదీ నాటికి ఆలయం చుట్టూ ఉన్న 96 నివాసాలను పూర్తిగా కూల్చివేసి స్థలాన్ని చదును చేయాల్సి ఉంది. తరవాత వైకానస ఆగమశాస్త్రం ప్రకారం ఆలయ ప్రాకారాలకు స్థలం కేటాయిస్తారు. మ్యాప్‌లో చూపినట్లు మండపాలు నిర్మించనున్నారు. మొత్తం ఆరెకరాల్లో నిర్మిస్తున్నారు.

**తిరుమల తరహాలో నిత్య పూజలు..**

కొడంగల్ ఆలయంలో తిరుమల తరహాలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. వైకానస ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి కైంకర్యాలు కొనసాగుతున్నాయి. ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 11 రోజులపాటు కొనసాగుతాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వైకానస ఆగమశాస్త్ర సలహాదారు దివంగత సుందర వరదాచార్యుల కుమారులు కొడంగల్ ఆలయంలో నిత్య పూజలు చేస్తున్నారు. ఉదయం సుప్రభాతం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు కొనసాగుతూనే ఉంటాయి.

**త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలు..**

ఇళ్లు కోల్పోతున్న వారికి త్వరలోనే స్థలాల పట్టాలు అందించేందుకు సిద్ధం చేశారు. స్వామివారి జాతర స్థలంలోని నాలుగెకరాల స్థలంలో ఒక్కొక్కరికి 121 గజాల స్థలం అందిస్తున్నారు. దానికి సంబంధించిన వెంచర్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

**వచ్చే నెలలో పూర్తిస్థాయిలో..**

వచ్చే నెలలో శ్రీవారి ఆలయ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయి. సీఎం ప్రత్యేకంగా పలుమార్లు ఆలయ మ్యాప్‌లను పరిశీలించారు. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తాం.

వెంకట్‌రెడ్డి, కడా, ప్రత్యేకాధికారి, కొడంగల్

# ఖాళీ కుర్చీలు.. కానరాని ఔషధాలు



హైదరాబాద్ :గ్రేటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అరకొరగా అందుతున్నాయి. రోగాల్లో 80 శాతం వరకు ప్రాథమిక ఆరోగ్య సమస్యలే. వీటిలో సరైన సేవలందిస్తే పెద్ద ఆసుపత్రులకు వెళ్లే అవసరం తప్పుతుంది. మొత్తం 200 బస్తీ దవాఖానాలు, మరో 95కుపైగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, శివార్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుంటే పర్యవేక్షణ లేదు. వాటిల్లో రోగులకందుతున్న సేవలపై పరిశీలించగా పలు లోపాలు బయటపడ్డాయి. కొన్నిచోట్ల వైద్యులు, సిబ్బంది లేరు. చాలావాటిల్లో ఉదయం 10 తర్వాతే విధులకు వస్తున్నారు. ఉదంతాలివిగో..: ఖైరతాబాద్‌లో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గతంలో గైనిక్ విభాగంలోనే ఆరుగురు శాశ్వత వైద్యులుంటే ప్రస్తుతం ఒకరు అదీ అమీర్‌పేట నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఎక్స్‌రే, స్కానింగ్ లేదు, ఈసీజీ పనిచేయడంలేదు.

ఖైరతాబాద్ వెల్‌నెస్ సెంటర్‌ను నిమ్స్‌లో విలీనం చేసిన తర్వాత వైద్యుల కొరత తీరినా మందుల కొరత పీడిస్తోంది. 3 నెలలుగా మధుమేహం, బీపీకి చెందిన ఔషధాలు అందుబాటులో లేవన్న ఆరోపణలున్నాయి.

మలక్‌పేట ఫర్హత్‌నగర్‌లో రెఫరల్ ఆసుపత్రి కొత్తగా నిర్మిస్తుండటంతో ప్రస్తుతం ఆజంపురాలోని వార్డు కార్యాలయంలోకి తరలించారు. ఏడుగురు సిబ్బందిలో ఇద్దరే సేవలందిస్తున్నారు. కాంట్రాక్టు వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు.

కార్వాన్ పానీపురా పట్టణ ఆరోగ్య కేంద్రంలో మరుగుదొడ్లు లేవు. అఫ్జల్‌సాగర్ యూపీహెచ్‌సీలో కూడా మౌలిక వసతుల కొరత వేధిస్తోంది.

అమీర్‌పేట్‌లోని ఈఎస్‌ఐ యూపీహెచ్‌సీకు సొంత భవనం లేదు. ఒకే గదిలో వైద్యాధికారి, వైద్య సిబ్బంది, ఫార్మాసిస్టు, ఔషధాల నిల్వతో ఇబ్బంది పడుతున్నారు. రోజూ 100 మంది రోగులొస్తున్నారు.

ఉప్పల్ పరిధిలోని లక్ష్మనారాయణ కాలనీ బస్తీ దవాఖానాలో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. రోగులు ఎదురు చూసి తిరిగి వెనుదిరుగుతున్నారు.

శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్రం పరిసరాలు చెత్తతో నిండిపోయాయి. బోరు పనిచేయడం లేదు. మరుగుదొడ్లు దారుణంగా ఉన్నాయి.

ఎల్బీనగర్ పరిధి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త నమూనాల సేకరణ ఇతర పరీక్షలకు ఇబ్బందులు తప్పడం లేదు.

# అర చేతిలో 'స్త్రీనిధి' సమాచారం

పెద్దపల్లి : వడ్డీ వ్యాపారుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం మహిళలకు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేస్తోంది. వ్యాపారాలు చేసుకోవడానికి ఆర్థిక చేయూత అందిస్తోంది. అయితే కొందరు కిస్తీల డబ్బులను సకాలంలో చెల్లించకుండా సొంతానికి వాడుకుంటున్నారు. సిబ్బంది సభ్యుల ఇళ్లకు వెళ్లి బకాయిలు అడిగే వరకు వాస్తవాలు వెలుగులోకి రావడం లేదు. ఇలాంటి పొరపాట్లను అధిగమించేందుకు ప్రభుత్వం 'మన స్త్రీని' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అతివలు అరచేతిలో నుంచే రుణ వాయిదాలు ఖాతాల్లో జమ చేశారా? లేదా దీని ద్వారా సులువుగా పరిశీలించుకోవచ్చు.

**సర్వం నిక్షప్తం..**

స్త్రీనిధి రుణాలు పొందిన సమస్త సమాచారం యాప్‌లో నమోదై ఉంటాయి. రుణాలు తీసుకున్నది ఎంత? చెల్లించిన వాయిదాలెన్ని? ఇంకా బకాయిలెన్ని ఉన్నాయనేది పొందుపరిచారు. పాత రుణాలు ఎంత చెల్లించారనేది స్పష్టంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. సహచర మహిళలు, బ్యాంక్ మిత్ర ఇలా ఎవరికి రుణ వాయిదా డబ్బులు ఇవ్వకుండా ఇంటి నుంచే చెల్లించే అవకాశం ఉంది. స్త్రీనిధి వాయిదా సొమ్మును కొందరు లీడర్లు సభ్యులకు తెలియకుండా వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. ఈ యాప్ ద్వారా ఇలాంటి అక్రమాలకు చెక్‌పడనుంది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

స్మార్ట్‌ఫోన్ ఉన్న సభ్యులు ప్లేస్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఫోన్ నెంబరు నమోదు చేస్తే గ్రూప్, ఇతర వివరాలు రుణాలు కనిపిస్తాయి.సభ్యులకు ఫోన్ నెంబర్ లేకుంటే వారి బంధువులు, పిల్లల నెంబర్లతో కూడా చూసుకోవచ్చు. **నమోదులో అగ్రపథం**స్త్రీనిధి యాప్ నమోదులో ఉమ్మడి జిల్లా అగ్రపథంలో కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో 19,895 సంఘాలు రుణాలు తీసుకోగా వీటిలో 33,399 మంది మహిళలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. స్త్రీనిధి అధికారులు సంఘాల సమావేశాల్లో యాప్ డౌన్‌లోడ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. **అవగాహన కల్పిస్తున్నాం**స్త్రీనిధి రుణాల పంపిణీలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా ఉండేందుకు యాప్ ఉపయోగపడనుంది. సభ్యుల రుణ కిస్తీలు, ఇతర వివరాలు ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు.

# రాజన్న భక్తులు.. తీరని కష్టాలు

వేములవాడ : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు వసతి గదులు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వసతి గదుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. సోమ, ఆది, శని, శుక్రవారాలతో పాటు ఇతర పర్వదినాల్లో వచ్చే వేలాది మందికి సరైన వసతి లభించక ఆలయ పార్కింగ్ ప్రాంతంలో సేద తీరాల్సిన పరిస్థితి భక్తులకు ఆందోళనకు గురి చేస్తోంది. ఇదే అదనుగా అద్దె గదుల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు.


ఇంకా ప్రతిపాదనల్లోనే.. వసతి గదుల కొరత తీర్చడానికి కొత్తగా నిర్మాణాలు చేయాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆలయానికి చెందిన శివపురం, శంకరపురం కాంప్లెక్స్‌లు శిథిలం కావడంతో వాటిని ఉపయోగించడం లేదు. వీటి స్థానంలో ఆధునిక హంగులతో కాంప్లెక్స్‌లు నిర్మాణం చేయాలనే ప్రతిపాదనలు ప్రతిపాదనలుగానే మిగిలిపోయాయి. శంకరపురం కాంప్లెక్స్‌ను ప్రసాదం స్కీం కింద ఆలయ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చినప్పటికి ఆ స్కీం కార్యరూపం దాల్చలేదు. సంస్కృత కళాశాల పాత భవనం వద్ద 40 వసతి గదులు నిర్మాణం చేయాలనే ప్రతిపాదన అలానే ఉండిపోయింది. గదుల కొరత తీర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాజన్న ఆలయ ఈఈ రాజేష్ తెలిపారు.ఇదీ పరిస్థితి...



ఆలయానికి సంబంధించి భీమేశ్వర సదన్, పార్వతీపురం, లక్ష్మగణపతి కాంప్లెక్స్, నందీశ్వర కాంప్లెక్స్, అమ్మవారి కాంప్లెక్స్‌లలో దాదాపు 436 వసతి గదులున్నా ఏమాత్రం సరిపోవడం లేదు. భక్తులు ఒక రోజు ముందు వేములవాడకు వచ్చి నిద్ర చేసి తరువాత రోజు స్వామివారికి మొక్కులు చెల్లించుకునే ఆనవాయితీ ఉంది. ఇలాంటి సందర్భంలో గదులు లభించక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరోవైపు రాజన్న ఆలయానికి సంబంధించిన కార్యాలయాలు భీమేశ్వరస సదన్‌లోనే ఏర్పాటు చేయడంతో దాదాపు పది గదుల వరకు తగ్గాయి.

## నీలగిరి.. మహానగరి..!

నల్గొండ : నీలగిరికి మహర్దశ వచ్చింది. పురపాలిక ప్రజల చిరకాల స్వప్నం ఫలించింది. మహా నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. రాష్ట్ర అసెంబ్లీ, శాసన మండలిలో కార్పొరేషన్ హోదా పెంచుతూ ప్రవేశపెట్టిన తీర్మానం బిల్లుపై చర్చించి ప్రభుత్వం ఆమోదించింది. అధికారికంగా గెజిట్ (ఉత్తర్వులు) వెలువడాల్సి ఉంది.ః రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత కొత్తగా పురపాలికలు, నగరపాలక సంస్థలు ఏర్పాటు ప్రక్రియ చేపట్టడంతో.. నల్గొండను మహానగరం (కార్పొరేషన్)గా ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితో కలిసి ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మంత్రి కోమటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. సమీప గ్రామ పంచాయతీల విలీన ప్రక్రియ లేకుండానే ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ పరిధితోనే కొత్తగా నగరపాలక సంస్థ ఏర్పాటుకు అంగీకరించింది.



**ప్రయోజనాలు ఇలా..**

మహానగర పాలక సంస్థగా ఆవిర్భవించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.వందల కోట్ల నిధులు దండిగా రానున్నాయి. మౌలిక సౌకర్యాల అభివృద్ధి, మానవ ఆర్థిక సూచీ ఎగువకు పాకనుంది. ఉద్యోగుల పోస్టుల సంఖ్య పెరగడంతో పాటు వారి స్థాయికి తగ్గట్టు హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు, వేతనాలు అందనున్నాయి.

**48 డివిజన్లతోనే ఏర్పాటు...!**

నల్గొండ పురపాలికలో 48 వార్డులు ఉండగా వాటిని పునర్విభజన చేయకుండానే మహానగర పాలక సంస్థగా ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి సూచన మేరకు కార్పొరేషన్ ఏర్పాటుకు కావాల్సిన పూర్తి సమగ్ర వివరాలు సేకరించి ప్రతిపాదనల రూపంలో గతేడాది నవంబరులో అందజేశారు. డివిజన్ల విభజన లేకుండానే పురపోరుతో పాటే యథవిధిగా ఎన్నికలకు వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## తూమును మూసేసి.. అలుగును మింగేసి

హైదరాబాద్: ఖాజాగూడ పెద్దచెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఇప్పటికే తూము, అలుగును మింగేశారు. తూము పక్కనున్న వెయ్యి గజాలకుపైగా స్థలంలో రెండు గదులను నిర్మించారు. బహిరంగ మార్కెట్లో ఆ భూమి విలువ రూ.40 కోట్లని అంచనా. జీహెచ్‌ఎంసీ అధికారులు.. గదులకేగాక, పక్కనున్న ఖాళీ స్థలానికీ ఇంటి నంబర్లు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

**కాలువను మలుపు తిప్పి**

గచ్చిబౌలి చౌరస్తా, డైమండ్‌హిల్స్, ఐకియా ప్రాంతాల్లో కురిసే వర్షపు



నీరంతా ఈ తటాకంలోకి చేరుతుంది. గచ్చిబౌలిలోని ఓ కుంటకు ఇది గొలుసుకట్టు చెరువు. ఇందులోని నీరు.. కట్ట మధ్యలోని తూము, ఐబీఎం ఐటీ కంపెనీ వైపు అంచున ఉండే అలుగు నుంచి దిగువకు వెళ్లేది.ఖాజాగూడ చెరువుపై 2010లోనే ఆక్రమణదారులు కన్నేశారు. సర్వే.నం.27, 28 పరిధిలో బండరాళ్లతో తూము వద్దనున్న గుంతలను పూడ్చారు.ఆ తర్వాత అలుగు నుంచి ఖాజాగూడ ప్రధాన రహదారి వరకు ఉండే వరద కాలువను 2018లో కబ్జా చేశారు. ఆ మార్గంలో వెళ్లాల్సిన నీటిని తూము దిగువన ఉండే కాలువకు 90 డిగ్రీల కోణంలో మలుపు తిప్పారు.అదనపు నీటిని దిగువకు తీస్కుళ్లే వరద కాలువ ఆక్రమణతో.. భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారీ బయోడైవర్సిటీ చౌరస్తా మునుగుతోంది. 2017లో మనిషి లోతున కూడలిలో వరద నిలిచింది. తాజాగా తూము స్థానంలో నిర్మాణాలు వచ్చాయి. వాటిని అధికారులు తొలగించకుండా ఆ గదులకు, పక్కనున్న ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయించారు.దీంతో స్థానికులు హైడ్రాను ఆశ్రయించి ఖాళీ స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.

ఇదీ తటాకం లెక్క

ఎఫ్‌టీఎల్ పరిధి.. 37ఎకరాలు

ప్రస్తుతం ఉన్నది.. 29 ఎకరాలు

## నెలకో గుంత.. నవ్వుతోంది నత్త

హైదరాబాద్ : ఈ చిత్రం పరిశీలించారా..? ఇది ఉప్పల్ కూడలి వద్ద పైవంతెన కోసం నిర్మిస్తున్న 148వ పిల్లర్. మొదటి పిల్లర్‌కు పునాది పడింది 2018మే నెలలో. దాదాపు 92 నెలల తర్వాత చివరి పిల్లర్ కోసం జనవరి 1న రాత్రి గుంత తవ్వారు. అంటే నెలకు ఒకటిన్నర పిల్లర్ల చొప్పున నిర్మిస్తున్నారు.ఇంకా పీర్జాదీగూడ నుంచి ఉప్పల్‌వైపు అయిదు పిల్లర్లు నిర్మించాల్సి ఉంది.

... ఇదీ వరంగల్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల సంస్థ చేపట్టిన పైవంతెన నిర్మాణం తీరు. ఏడున్నర సంవత్సరాలు దాటినా.. 60శాతం పురోగతి లేని ప్రాజెక్టు ఇది.

వరంగల్‌కు వేగంగా అనుసంధానం కోసం, రోడ్డు ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు పైవంతెన ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. పలు అభ్యర్థనల తర్వాత ఎట్టకేలకు ఉప్పల్ కూడలి నుంచి నారపల్లి వరకు 6.250 కిలోమీటర్ల దూరం పైవంతెన నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. 2018లో కేంద్ర మంత్రి గడ్కరీ పనులకు శంకుస్థాపన చేశారు. గాయత్రి సంస్థ టెండర్ దక్కించుకుంది. రూ.670 కోట్లతో ఆరు లేన్లతో నిర్మించాల్సి ఉంది. భూసేకరణ, నిధుల లేమి, గుత్తేదారు సంస్థ సమస్యలతో తీవ్ర జాప్యం నెలకొంది. ఎన్నోసార్లు సదరు సంస్థకు నోటీసులు ఇచ్చినా లెక్క చేయలేదు.నెలకో గుంత తీస్తూ.. రెండు నెలలకు ఒక కాంక్రీట్ వేస్తూ గుత్తేదారు సంస్థ ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది.

నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి ఉప్పల్, బోడుప్పల్, నారపల్లి ప్రాంతాల్లో అధికంగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి.

పనుల్లో జాప్యంపై ఉన్నత స్థాయిలో పలుమార్లు సమీక్షలు జరిగాయి. వేరే సంస్థలకు కాంట్రాక్టు అప్పగించే ప్రయత్నాలను గుత్తేదారు సంస్థ అడ్డుకుంది.

రామంతాపూర్ వైపు మరొకటి..

ఉప్పల్ పైవంతెనకు అనుబంధంగా రామంతాపూర్ వైపు మరో పైవంతెనను జీహెచ్‌ఎంసీ నిర్మిస్తోంది. ఉప్పల్ మెట్రో కూడలి వద్ద ఎత్తు పెంచాల్సి రావడం, భూసేకరణలో జాప్యంతో ఆగిపోయింది. ఇటీవల తిరిగి పనులు ప్రారంభించామని చెబుతున్నారు. ఉప్పల్ పైవంతెన ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెబుతున్నారు.

చురకలు




## విజ్ఞాన నిధులు.. పరిశోధనా వెలుగులు

హైదరాబాద్ : ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీల తరహాలో మన వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించింది. ఓయూ, జేఎన్‌టీయూ, మహిళా వర్సిటీలను రెండేళ్లలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు రూ.2,300 కోట్లు ఖర్చు చేయనుంది.

**పరిశోధనలకు పెద్దపీట.. కీలక ఒప్పందాలు**

ఉస్మానియా, మహిళా వర్సిటీ, జేఎన్‌టీయూల్లో కొత్తగా అందుబాటులోకి వచ్చే ప్రయోగశాలల్లో వినూత్న పరిశోధనలు చేపట్టేందుకు వీలుంటుంది. కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలతో ఈ వర్సిటీలు పరిశోధనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వ్యవసాయ, పరిశ్రమల రంగాలు, కాలుష్య నియంత్రణపై పరిశోధనలు నిర్వహిస్తున్న విదేశీ సంస్థలతోనూ



ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు. ఓయూ ఆచార్యులు.. భూసార పరీక్షలు, పొలాల్లో విష పదార్థాలను నిర్మూలించే సూక్ష్మజీవులపై పరిశోధనలు చేసి ఫలితాలు సాధించారు.

**అత్యాధునిక ల్యాబ్‌లు.. డిజిటల్ లైబ్రరీలు**

రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 3 వర్సిటీల్లో అత్యాధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా మైక్రో బయాలజీ, రసాయన, భౌతికశాస్త్రాల విభాగాల్లో పరిశోధనలు వేగం పుంజుకోనున్నాయి. క్యాన్సర్ నియంత్రణ మందుల తయారీ, అంతరిక్ష పరిశోధనలు, వ్యర్థ జలాల్లో హైడ్రోజన్ ఇంధనం, రుతుపవనాల్లో మార్పులు, ఆహారంలో పోషక విలువలు, ఆరోగ్యకర ఆహారంపై పరిశోధనల్లో కచ్చితత్వం రావడంతోపాటు పేటెంట్లు సాధించే అవకాశాలున్నాయి. డిజిటల్ లైబ్రరీలతో పరిశోధనలకు ఎలాంటి సమాచారమైనా లభిస్తుంది. విదేశీ వర్సిటీల శాస్త్రవేత్తలు, ఆచార్యులతో ఇక్కడి విద్యార్థులు సంభాషించవచ్చు.

## అంతా దుమ్మే..!



మిర్యాలగూడ : ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా ఆర్టీసీని బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంట్లో భాగంగానే మహాలక్ష్మి పథకం ద్వారా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల్లో ప్రయాణికులు పెరగడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం సైతం పెరిగింది. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను పెంచకపోవడంతో ఉన్న బస్సుల్లోనే కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. బస్సుల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

**అపరిశుభ్రతతో అవస్థలు..**

ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల్లో మొత్తం 716 బస్సులు ఉండగా.. అనేక బస్సులు అపరిశుభ్రంగా ఉన్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బస్సు బయలుదేరేప్పుడు తప్పనిసరిగా కడిగి లోపల ఊడ్చి పంపిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ అనేక బస్సుల్లో సీట్లపై, అద్దాలపై, లోపల దుమ్ము, ధూళి పేరుకుపోతుందని ప్రయాణికులు చెబుతున్నారు. బీ డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో సీటు కవర్లను ఏళ్ల తరబడి మార్చకపోవడంతో ఒక రకమైన దుర్వాసన వస్తూ కూర్చోలేక పోతున్నామని ప్రయాణికులు అంటున్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే విద్యుత్తు సూపర్ లగ్జరీ బస్సులు మరింత అధ్వానంగా ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. బస్సుల్లో అద్దాలపై ఉమ్మి వేసిన మరకలు సైతం ఉండి ఇబ్బందులు పడుతున్నారు.

**బస్సుల శుభ్రతకు చర్యలు...** – జాన్‌రెడ్డి, ఆర్ఎం, నల్గొండ

ఆర్టీసీ బస్సుల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. బస్సుల్లో దుర్వాసన రాకుండా కెమికల్ వాషింగ్ కూడా చేయిస్తున్నాం. మరోసారి దీనిపై దృష్టి సారిస్తాం.

## ప్రతినిధుల దన్ను.. రాబందుల కన్ను

నల్గొండ : నీలగిరిలో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో దర్జాగా దందా సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నియంత్రించాల్సిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి.

జిల్లా కేంద్రంలో నిత్యం అక్రమంగా మొరం తవ్వడంతో అన్వేశ్వరమ్మ, కాపురాల కొండలు కరిగిపోతున్నాయి. ప్రధానంగా పట్టణ సమీపంలోని అన్వేశ్వరమ్మ గుట్టపై రాబందుల కన్ను పడింది. రాత్రి పగలూ.. ప్రకృతి సంపదను కొల్లగొడుతూ జేబులు నింపుకొంటున్నారు. కొండలకు రంధ్రం చేసి అక్రమంగా వెంచర్లకు, రోడ్లకు, పునాదులకు తరలిస్తున్నారు. ఇలా ఒక్కో ట్రిప్పు మొరం మార్కెట్‌లో రూ.4500 చొప్పున విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. దేవరకొండ రోడ్డు మార్గంలోని వైకుంఠధామం పక్కన గుట్టలను సైతం పొక్లెయిన్ సాయంతో కొల్లగొడుతూ కాసులు దండుకుంటున్నారు. అక్రమంగా తవ్వడంతో భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. అనుమతి లేకుండా ప్రకృతి సంపదను తరలించడం చట్టవిరుద్ధమైన చర్యని జిల్లామైనింగ్ అధికారి జాకబ్ శ్యామూల్ అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమంగా మొరం తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. **మౌనంగా మైనింగ్‌శాఖ** జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. వీటికి తోడు రహదారుల నిర్మాణాలకు, ఇళ్ల నిర్మాణాలకు మొరం అవసరం ఉంటుంది. దీనిని ఆసరా చేసుకున్న కొంతమంది సంపాదనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతూ గుట్టలను మాయం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. నాయకులు, అధికారులకు ముడుపులు చెల్లిస్తూ అక్రమాలకు కొనసాగిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గనులశాఖకు చెల్లించాల్సిన రాయల్టీ పన్ను చెల్లించకుండా పెద్ద యంత్రాలతో సాగిస్తున్న దందాను నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# క్లిక్ చేయొద్దు.. చేతులు కాల్చుకోవద్దు



హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ సంస్థల(ఎన్‌బీఎఫ్‌సీ) పేర్లతో బోల్తా కొట్టించి డబ్బు కాజేయడం ఇప్పటివరకూ చూశాం.. ఇప్పుడు మరో ముందడుగు వేసి కొత్త మోసానికి తెరలేపారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) పేరుతో డబ్బు కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఆర్బీఐ తీసుకొచ్చిన ఉద్గం పథకాన్ని అవకాశంగా మార్చుకుని డబ్బు కొట్టేస్తున్నారు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసమంటూ వివరాలు సేకరిస్తూ మోసగిస్తున్నారు. కొందరు కేటుగాళ్లు ఆర్బీఐ తరఫున మాట్లాడుతున్నా మని.. అనుమానాస్పద లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతాలన్నీ స్తంభింపచేస్తున్నామని బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఈ తరహా మోసాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఆర్బీఐ అధికారులు కాల్స్ చేసి ఎలాంటి వివరాలు సేకరించరనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని సైబర్‌క్రైమ్ పోలీసులు ఫిర్యాదు చేస్తున్నారు.

**ఉద్గం స్కీమ్ అంటే..?**

రెండు నుంచి పదేళ్ల వరకూ ఉపయోగంలో లేని బ్యాంకు ఖాతాల్లోని డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి ఆర్బీఐ ఈ పథకాన్ని ప్రారంభించింది. సంబధిత శాఖకు వెళ్లి కేవైసీ పత్రాలు అందజేసి తీసుకోవచ్చు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లపై అవగాహన కోసం ఆర్బీఐ సందేశాలు పంపిస్తోంది. పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తోంది.మోసాలు చేస్తున్నారిలా..

ఆర్బీఐ లాగే సైబర్ నేరగాళ్లు ఎస్ఎంఎస్, వాట్సప్‌లో మోసపూరిత లింకులతో సందేశాలు పంపిస్తున్నారు.

పొరపాటున క్లిక్ చేస్తే నకిలీ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగత వివరాలతోపాటు యాక్టివ్‌లో ఉన్న ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు.

ఈ వివరాల ఆధారంగా ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ.. ఖాతాల యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు అడిగి డబ్బంతా కాజేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డు లావాదేవీలు అనుమానాస్పదంగా ఉన్నాయని, మోసాలకు ఉపయోగిస్తున్నట్లు ఆధారాలున్నాయని, మరో రెండు గంటల్లో మీ పేరుతో ఉండే అన్ని బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు.


మరిన్ని వివరాల కోసం 9 ప్రెస్ చేయాలని వాయిస్ కాల్ వస్తోంది. పొరపాటున ఈ నంబరు ప్రెస్ చేస్తే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చి వేర్వేరు కారణాలతో డబ్బు కొట్టేస్తున్నారు.

**ఫిర్యాదు చేయండిలా..**

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల కోసం వెబ్‌సైట్లను నమ్మకుండా నేరుగా సంబంధిత బ్రాంచిలకువెళ్లి ఆరా తీయాలి.

ఒకవేళ సైబర్ నేరగాళ్లకు చిక్కి మోసపోతే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ, %www.cybercrime.gov.in% ద్వారా ఫిర్యాదు చేయాలి.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. ఇక పరార్!



హైదరాబాద్: మహిళల్లో ఎక్కువగా వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. 14 ఏళ్లు నిండి 15 ఏళ్లలోపు బాలికలందరికీ హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సిన్ ఉచితంగా అందించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా గ్రేటర్ వ్యాప్తంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో త్వరలో పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది.

మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌తో పాటు గర్భాశయ ముఖద్వార(సర్విక్స్) క్యాన్సర్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముందే గుర్తించడం ద్వారా వీటిని పూర్తిగా నియంత్రించవచ్చు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భాశయ క్యాన్సర్‌తో పాటు ఇతర క్యాన్సర్ల నుంచి మహిళలకు పూర్తి రక్షణ ఉంటుంది. అవగాహన లేక చాలామంది ఈ టీకాకు దూరంగా ఉంటున్నారు. అవగాహన లేమి, బిడియం, ఇతర పరిస్థితుల వల్ల రొమ్ము, సర్విక్స్ క్యాన్సర్లున్నా బయటకు చెప్పడం లేదు. ప్రస్తుతం ఆసుపత్రికి వస్తున్న వారిలో 70–80 శాతం కేసులు బాగా ముదిరిపోయే దశలో ఉంటున్నాయి. చికిత్స కూడా కష్టతరం కావడంతో ఎక్కువ శాతం మరణాలు సంభవిస్తున్నాయి. మహిళలకు ఈ క్యాన్సర్లు సోకితే ఆ ప్రభావం కుటుంబం మొత్తంపై పడుతోంది. ఈ నేపథ్యంలోనే సర్విక్స్ క్యాన్సర్ నుంచి పూర్తి రక్షణ కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేసేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం ప్రైవేటులో రెండు డోసులిస్తుండగా ప్రభుత్వం మాత్రం తొలుత సింగిల్ డోసే పంపిణీ చేయనుంది. అర్హత ఉన్న ప్రతి బాలికకు ఈ టీకా వేసేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**90 రోజుల పాటు పంపిణీ**

–డాక్టర్ పి.శ్రీధర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, హైదరాబాద్

గ్రేటర్‌లోని బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించనున్నాం. 90 రోజులపాటు ఈ కార్యక్రమం నడుస్తుంది. ఎప్పటి నుంచి అమలు చేస్తారనేది త్వరలో ప్రభుత్వం ప్రకటిస్తుంది. సింగిల్ డోసు తీసుకున్నాక సర్విక్స్ క్యాన్సర్ నుంచి 12ఏళ్ల వరకు రక్షణ ఉంటుంది. అర్హులైన బాలికలంతా నిర్భయంగా వ్యాక్సిన్ తీసుకోవాలి.

# నిధుల లేమి.. ఖాళీల భర్తీకేదీ హామీ!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జనరల్ పుస్తకాలు, కొత్త కొత్త నవలలు కొనుగోళు నిలిచిపోయాయి. కొన్నేళ్లుగా పోస్టులు భర్తీ కాకపోవడంతో మండల స్థాయిలో గ్రంథాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇన్‌ఛార్జిలతో కాలం వెళ్లదీస్తుండటంతోపాటు సకాలంలో గ్రంథాలయ సెస్ రాకపోవడంతో ఉన్న నిధులతో నెట్టుకొస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో నాలుగు కేంద్ర గ్రంథాలయాలతోపాటు శాఖ గ్రంథాలయాలు పని చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ప్రతి రోజు 600–750 మంది, జగిత్యాలలో 100–150 మంది, రాజన్న సిరిసిల్లలో 100–200 మంది, పెద్దపల్లిలో 60–80 మంది వస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో డైరెక్టరేట్ గ్రంథాలయంలో కమిటీ తీర్మానం మేరకు పుస్తకాలు కొనుగోలు చేస్తారు. సామాజిక చైతన్యం, సాహిత్య పుస్తకాలు, నవలలను కమిటీ తీర్మానం మేరకు కొనుగోలు చేస్తారు. దాదాపు పదేళ్ల నుంచి ఇలాంటి పుస్తకాలు కొనుగోళ్లు నిలిచిపోయాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయాల్లో నిరుద్యోగులు కోరిన ఆన్ డిమాండ్ పుస్తకాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. గ్రంథపాలకుల పోస్టుల భర్తీ పదేళ్లుగా చేపట్టడం లేదు. ఈ పదేళ్లలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఫలితంగా శాఖ గ్రంథాలయాలు ఇన్‌ఛార్జిల పాలనలో నడుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గ్రేడ్–3 శాఖ గ్రంథాలయాల పాలకుల పోస్టులు 36 ఉండగా 8 మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా పోస్టులన్నీ ఖాళీలు ఉండగా ఔట్ సోర్సింగ్ కింద ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయాల్లో 66 పోస్టులకు 27 మంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేడ్–1, గ్రేడ్, అటెండర్, తదితర పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయంకు ఒక్క కార్యదర్శి పోస్టు ఉంది.

ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు

ఎ.సరిత, కార్యదర్శి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ

సాధారణ, జనరల్ పుస్తకాలు కొనుగోలు ఇటీవల కాలంలో చేయడం లేదు. రాష్ట్ర కమిటీ ఈ పుస్తకాలు కొనుగోలు చేయాలని ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం నిరుద్యోగ అభ్యర్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆన్ డిమాండ్‌లోనే పుస్తకాలు కొనుగోలు చేస్తున్నాం. పోస్టుల భర్తీ ప్రభుత్వ పరిధిలో ఉంది. ఉన్నవారితోనే విధులు నిర్వహించుకునేలా ప్రణాళిక చేసుకుంటున్నాం.

## కళ్లెదుటే సంపద..తీరేలా ఆపద..!

నల్గొండ : పల్లెలను పరిశుభ్రంగా మార్చాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ప్రజారోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూర్చేలా ప్రణాళిక రూపొందించింది.

లక్ష్యం ఇలా: గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్టు ఎరువులు తయారు చేసి రైతులకు కిలో రూ.10 చొప్పున విక్రయించి ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. దీనికోసం ప్రతి గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలను నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది.పురోగతి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 95 శాతానికి పైగా పూర్తయ్యాయి.

అప్పటి కార్యాచరణ: పల్లె ప్రగతిలో గ్రామాల్లో చెత్త, వ్యర్థ పదార్థాల



నిర్వహణ కీలకమైంది. దీని ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రభుత్వం చెత్తను సేకరించేందుకు ట్రాక్టర్లు కొనుగోలు చేసింది. రూ.లక్షలు వెచ్చించి ఇంటింటికీ రెండు చెత్త బుట్టలు పంపిణీ చేసింది. చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేయాలని సూచించింది.కానీ ఎక్కడా ఇది సక్రమంగా అమలు కావడంలేదు.

ఇలా చేయాలి: ప్రతి సెగ్రిగేషన్ షెడ్డులో కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలు, కుళ్లిన పండ్లు తదితర వాటిని తడిచెత్తగా వేరు చేయాలి. ఇనుము, ప్లాస్టిక్, అట్టముక్కలు ఇతరత్ర వాటిని పొడి చెత్తగా మార్చాలి. ఇలా వేరు చేసిన వ్యర్థాల నుంచి కంపోస్టు ఎరువులను తయారు చేయాలి.కొత్త పాలకులు ఇలా చేయాలి: గత పాలకవర్గాల, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో మెజారిటీ గ్రామ పంచాయతీల్లో ముందుకు సాగడం లేదు. వచ్చే కొత్త పాలకులు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియ వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడటంతో పాటు కంపోస్టు ఎరువుల తయారీ వల్ల పంచాయతీలకు సంపద సమకూరే అవకాశం ఉంటుంది.

## పెద్దాసుపత్రిలో.. పెరగనున్న సేవలు

సూర్యాపేట : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజేహెచ్)లో మొత్తం 400 పడకలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 350 జీజేహెచ్, మరో యాభై పడకలు మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో భాగంగా ఉన్నాయి. ఇలా ప్రతి వంద పడకలకు 45 చొప్పున 180 మంది మాత్రమే కార్మికులు అందుబాటులో ఉన్నారు. ఇందులో 76 మంది పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం కరవైంది. 400 పడకలకు 52 మంది మాత్రమే పేషెంట్ కేర్‌లు ఉండటంతో రోగులకూ సకాలంలో సరైన సేవలు అందడం లేదు. సెక్యూరిటీ సిబ్బంది 52 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. సర్కారు ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్యసేవలు, పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. పడకల ఆధారంగా పారిశుద్ధ్య సిబ్బంది, పేషెంట్ కేర్, భద్రతా సిబ్బంది సంఖ్యను పెంచేందుకు మార్గదర్శకాలను రూపొందించేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ఈ కమిటీ పలు



సూచనలు చేస్తూ మార్గదర్శకాలను రూపొందించిన విషయం విదితమే. ఇక వంద పడకలకు 65 మంది కార్మికులు: సర్కారు ఆసుపత్రుల్లో ప్రతి వంద పడకలకు 65 మంది సిబ్బందిని నియమించేందుకు కొత్తగా టెండర్లను పిలవడానికి కమిటీ సూచనలు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం టెండర్లను పిలిచేందుకు కరసత్తు ప్రారంభించింది. దీంతో ప్రతి 20 మంది చొప్పున పెరిగే అవకాశం ఉంటుంది. అంటే సూర్యాపేట జీజేహెచ్‌కు మరో 80 మంది కార్మికులు పెరగనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతి పడకకు రూ.7,500 చొప్పున గుత్తేదారులకు చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని రూ.పది వేలకు పెంచేందుకు కమిటీ నిర్ణయించింది. ఇలా చేయడం ద్వారా కార్మికులు సంఖ్య పెరగడంతోపాటు వారికి వేతనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

## జోరుగా.. రుణాల పంపిణీ..!

ఖమ్మం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారుల చొరవతో వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ ప్రక్రియ జోరందుకుంది. మూడు విడతలుగా ఇచ్చే రుణాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇప్పటివరకు 52,934 మందికి రూ.91.56కోట్లు అందజేశారు. మొదటి విడతలో రూ.10వేలు లేదా రూ.15వేలు, రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేల చొప్పున పంపిణీ చేశారు. అనంతరం అవసరమైన వారికి క్రెడిట్ కార్డ్ అందించేందుకు చర్యలు చేపట్టారు. కొవిడ్ సమయంలో ప్రారంభించిన



పీఎం స్వనిధి కింద ఈ పథకాన్ని నగరపాలికలు/పురపాలికల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది.

కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట, కల్లూరు, ఏదులాపురం పురపాలికలను మినహాయిస్తే మిగిలిన వాటన్నింటిలోనూ నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు మెప్మా అధికారులు, ఆర్పీలు చేస్తున్న కృషి సత్ఫలితాలు ఇస్తోంది. రుణాలను వినియోగించుకొని వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను బలోపేతం చేసుకున్నారు.

## ఏడేళ్లు.. కలగానే సొంతిల్లు..!

కవిటి : హుద్‌హుద్ ఇళ్లు నిర్మించి ఏడేళ్లు దాటినా ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు కేటాయింపు జరగని దుస్థితి. నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకున్న వారే లేరు. 2014లో హుద్‌హుద్ తుపాను బాధితుల కోసం ఎన్టీఆర్ ప్రత్యేక గృహ నిర్మాణ పథకం ద్వారా 448 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి పనులను అప్పటి ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శ్యాంసుందర శివాజీ, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. కింద భాగం, మొదటి అంతస్తు భవనాలతో ఒక్కో ఇల్లు రూ.4 లక్షల వ్యయంతో రెండేళ్ల లో పూర్తి చేశారు. 2019లో ఎన్నికలు రావడం, అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని



వదిలేశారు. ఫలితంగా ఇళ్లు వృథగా మిగిలిపోయాయి.

**కూటమి ప్రభుత్వంపైనే ఆశలు**

గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ఆ కట్టడాలు దయనీయంగా తయారయ్యాయి. భవనాల తలుపులు, కిటికీలు, విద్యుత్తు పరికరాలు చోరీకి గురయ్యాయి. పరిసరాలు పనికిరాని మొక్కలు, పొదలతో దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రహదారులు, కాలువలు మరమ్మతులకు గురయ్యాయి. ఇతర గృహ నిర్మాణ పథకాలు మంజూరు కాక ఇబ్బంది పడుతున్నారు.పాలకులు చొరవ తీసుకుంటేనే న్యాయం జరుగుతుందని వారంతా పేర్కొంటున్నారు. 'నిర్మాణాలు పలుచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం' అని గృహ నిర్మాణ సంస్థ డీఈ వీవీ సత్యజీ తెలిపారు.

## పల్లె 'గొంతు'తడపాలని..!

కవిటి : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని పలు గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా నిమిత్తం గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రణాళిక చేశారు. మార్కాపురం జిల్లాలోని పలు మండలాల్లో జనవరి నెలాఖరు నుంచే తాగునీటి సమస్య తలెత్తనుంది. ఇప్పటికే బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి. నీటి వనరుల లభ్యత లేక కొన్ని ఆవాస ప్రాంతాల్లోని రక్షత తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారాయి. ఏటా దొనకొండ మండలంతో పాటు మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ మండలాల్లోని గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది యర్రగొండపాలెం ప్రాంతంలో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతోపాటు ఎన్ఎస్పీ కాలువ ద్వారా సాగర్ జలాలు సమృద్ధిగా విడుదల చేయడంతో సీపీడబ్ల్యూ పథకాలకు చెందిన చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంత వాసులకు మే నెలాఖరులోగా ట్యాంకర్లతో సరఫరా అవసరం ఉండకపోవచ్చునని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది. ఈ ఏడాది మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతోపాటు దొనకొండ మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు




తాగునీటిని సరఫరా చేయనున్నారు. మొత్తం 35 గ్రామాల్లో సరఫరా నిమిత్తం రూ.1.12 కోట్ల నిధులతో అంచనా తయారు చేసి కలెక్టర్ ఆమోదం నిమిత్తం ప్రతిపాదించారు. ఆయా మండలాల్లో వేసవిలో వడగాలుల తీవ్రత పెరిగే కొద్దీ మార్చి నెలాఖరుకల్లా తాగునీటి సమస్య మరింత తీవ్రతరం కానుంది

**నిరుపయోగంగా 5,222 బోర్లు**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 729 గ్రామ పంచాయతీల్లో మొత్తం 13,345 తాగునీటి బోర్లు ఉండగా నీటి వనరుల లభ్యత లేని కారణంగా అందులో ఇప్పటికే 5,222 బోర్లు ఎండిపోయాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని బోర్ల మరమ్మతులు చేపట్టేందుకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 15వతేదీలోగా క్రాష్ కార్యక్రమానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళిక చేశారు. జిల్లాలో రక్షత తాగునీటి పథకాలు, మినీ రక్షత తాగునీటి పథకాలు, డైరెక్ట్ పంపింగ్ పథకాల కింద మొత్తం 4,655 ఉండగా, అందులో ప్రస్తుతం 697 తాగునీటి పథకాల నీటి వనరులు పూర్తిగా ఎండిపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రత్యేకించి పశ్చిమ ప్రకాశం మండలాల్లో చేతి పంపులకు పూడికతీత కార్యక్రమం చేపడుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండడంలేదు.

## అరటి రైతు.. 'ధర' హాసం

త్రిపురాంతకం : జిల్లాలోని అరటి రైతుల్లో 'ధర'హాసం నెలకొంటోంది. నెల క్రితం ధరతో పోల్చితే టన్నుకు మూడింతలు పెరగడం, ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోకంటే ఈసారి పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.

**పశ్చిమ ప్రకాశంలోనే ఎక్కువ**

ఉమ్మడి ప్రకాశం కింద అరటి సాగు ఎక్కువగా పశ్చిమ ప్రకాశంలోనే ఉంది. మార్కాపురం జిల్లా ఏర్పడిన తరువాత అరటి సాగు లెక్కల్లోకి తీసుకుంటే 2,000 ఎకరాలుగా ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ఇక ఉమ్మడి ప్రకాశం కింద చూస్తే ఇంకో 300 ఎకరాలు ఉంటుందన్నారు.

ఉమ్మడి ప్రకాశం కింద ఉన్నప్పుడు రైతులు అరటి రైతులు కొనుగోళ్లు, విక్రయాలకు తప్పనిసరిగా జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్తగా జిల్లా ఏర్పడటంతో స్థానికంగా కొనుగోళ్లకు అవకాశం కలుగుతుందని కొందరు రైతులు పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలంలోని గాంధీనగర్, సోమేపల్లి, మేడపి తదితర గ్రామాలతో పాటు యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్ద దోర్నాల, గిద్దలూరు, కంభం, రాచర్ల, కొమరోలు మండలాల్లో అరటి సాగు ఎక్కువగా ఉంటోంది. ఒక్కో కోతకు 15 నుంచి 30 టన్నుల దిగుబడి అరటి సాగుకు ఎకరానికి రూ.1.5లక్షలు ఖర్చవుతోంది. మొక్కలు నాటిన 11 నెలలకు మొదటి కోత లభిస్తుంది. ఒక్కో కోతకు 15 నుంచి 30 టన్నుల మేర దిగుబడి వస్తుంది. నాలుగు నెలల నుంచి టన్ను రూ.5వేలకు మించి పలక లేదు. డిసెంబరు ఆఖరు నుంచి ధర నెమ్మదిగా పెరుగుతోంది. ప్రస్తుతం టన్ను రూ.18వేల వరకు ఉండగా వ్యాపారులు మార్కెట్ మాయాజాలాన్ని ప్రదర్శిస్తూ రూ.14వేలకు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రెండో కోతలు జరుగుతున్నాయి. కొత్తగా నాటిన తోటలు ఫిబ్రవరి నుంచి మొదటి కోతలు ప్రారంభం కానున్నందున పంటకు అధిక ధర లభించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ సమయంలో దళారుల జోక్యం పెరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## చూస్తుంటాం.. తవ్వేసుకోండి.. తోలేసుకోండి



ఏలూరు : ద్వారకాతిరుమల మండలంలో పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని కంకర మాఫియా యథేచ్ఛగా కొల్లగొడుతోంది. భవిష్యత్తులో ఎక్కడైనా గట్టు బలహీనపడితే పునరుద్ధరించటానికి జల వనరుల శాఖ కాలువ పొడవునా ముందస్తుగా సిద్ధం చేసిన మన్నును తినేసి రూ.కోట్లు గడిచింది. ఇంత జరుగుతున్నా యంత్రాంగం చోద్యం చూస్తోంది. వైకాపా హయాంలోనే చాలా వరకు ఆ పార్టీ నేతలు మట్టి గుట్టలను కరిగించి భారీగా సొమ్ము చేసుకున్న సంగతి విదితమే. మిగిలిన కొద్దిపాటిని ప్రస్తుతం తరలిస్తున్నారు. కొందరు కాలువ భూములు చదును చేసుకుని సేద్యం చేసుకుంటున్నా యంత్రాంగం చేష్టలుడిగి కూర్చోవటంపై విమర్శలొస్తున్నాయి.

**కన్నెత్తి చూడని యంత్రాంగం..**

గుణ్ణంపల్లి, నారాయణపురం, ఎం.నాగులపల్లి పంచాయతీల పరిధిలో గట్టు వెంబడి ఉన్న గుట్టల వద్ద జరిపిన లోతైన తవ్వకాలను పరిశీలిస్తే కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల మేర తరలిపోయిందనేది స్పష్టమవుతోంది. దీనికి రాయల్టీ, సీనరేజీ, అపరాధ రుసుములు విధిస్తే ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. ఆ విషయం తెలిసినా గనుల శాఖ స్పందించడం లేదు. జల వనరుల శాఖ మొక్కుబడి ఫిర్యాదులతో సరిపుచ్చుతోంది. ఒకవేళ ఫిర్యాదు చేసినా పోలీసులు యంత్రాలు, లారీలను స్వాధీనం చేసుకునే పరిస్థితి లేదంటున్నారు. కారణం మట్టి మాఫియాకు ఓ ప్రజాప్రతినిధి అండగా నిలవడమేనని వినికిడి.

**కళ్ల ముందే లారీలు పోతున్నా..**

నిత్యం రాత్రి పూట ప్లొయిన్లు పెట్టి పదుల సంఖ్యలో లారీల్లో మట్టి నింపి నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు, రాజమహేంద్రవరం తరలిస్తుంటే ఏ ఒక్క లారీని ఆపి అపరాధ రుసుంలు విధించిన పాపాన పోలేదు. స్థానికులు ఎవరైనా సొంత అవసరాల కోసం ఓ ట్రాక్టర్ మట్టి తెచ్చుకుంటే అనుమతులు లేకుండా ఎలా తీస్తుళతారని ప్రశ్నించి ఇబ్బంది పెడుతున్నారు. మట్టి తరలించే లారీలతో కాలువ గట్టు మీదుగా ఆయా గ్రామాలకు రాకపోకలు కష్టంగా ఉంటున్నాయని స్థానికులు అంటున్నారు.

మట్టి తరలింపుపై ఆ ప్రాంత జల వనరుల శాఖ ఏఈ బాబూజీని వివరణ కోరగా 'మట్టి తరలిస్తున్న మాట వాస్తవం. ఇంతకు ముందే గుర్తించి గనుల శాఖకు తెలియజేశాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. తవ్వకాలు చేస్తున్న ప్లొయిన్లను ఒకసారి స్వాధీనం చేసుకుంటే వాటి నిర్వాహకులు జీవనోపాధి దెబ్బతీశారని నాపైనే ఫిర్యాదు చేశారు' అని చెప్పారు. బాధ్యులైన అన్ని శాఖలతో కలిసి మట్టి తరలింపును నిలువరిస్తామన్నారు.

## ముక్క తగ్గనంటోంది.. ముద్ద దిగనంటోంది




తణుకు : మాంసాహార ప్రియులకు కోడి మాంసం ధర చుక్కలు చూపిస్తోంది. కొన్ని నెలలుగా పెరుగుతూ కొత్త సంవత్సరంలో కిలో రూ.300 దాటింది. కార్తిక మాసంలో బ్రాయిలర్ స్కిన్‌లెస్ రూ.240 ఉండగా క్రిస్మస్ నాటికి రూ.280కు చేరుకుంది. ప్రస్తుతం రూ.320 పలుకుతోంది. లైవ్ అయితే రూ.180 వరకు అమ్ముతున్నారు. మాంసాహారుల్లో జిల్లాలో అధికం శాతం మంది బ్రాయిలర్ మాంసాన్ని తింటారు. ఇప్పటికే ఓ వైపు గుడ్డు వెల రికార్డులు సృష్టిస్తుంటే మరో పక్క మాంసం ధరకు రెక్కలు రావడంతో మాంసాహార ప్రియులకు ముద్ద దిగడం లేదు.మేత ధరలు పెరుగుదల, వ్యాధులతో రైతులకు గిట్టుబాటు కాక ప్రస్తుతం ఒకటి నుంచి 2 శాతానికి కోళ్ల పెంపకం పడిపోయింది. ప్రస్తుతం లక్ష కోళ్లు పెంచుతున్నారు. దీంతో ఉత్పత్తి తగ్గిపోయి గిరాకీ పెరగడంతో ఇంటిగ్రేషన్ కంపెనీలు అమాంతంగా ధరలు పెంచేశాయని వ్యాపారులు చెబుతున్నారు.

**పెరిగిన గిరాకీ..**

వరుస పండగలతో కోడి మాంసానికి గిరాకీ పెరిగింది. కార్తిక మాసంలో విక్రయాలు కొంత డీలా పడినప్పటికీ నెల వ్యవధిలో రూ.100 పెరిగి కొండెక్కి కూర్చుంది. ముఖ్యంగా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు నెలలో భారీ స్థాయిలో విక్రయాలు సాగాయి. అనంతరం నూతన సంవత్సరంలో సైతం అదే ఒరవడి కొనసాగింది. ఇంటిగ్రేషన్ కంపెనీల వద్ద కోళ్లు తగ్గిపోవడంతో సరఫరా లేక ధరలు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి ఉండడంతో మరింత పెరిగే ఆస్కారం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో గతంలో 20 నుంచి 30 శాతం మంది రైతులు సుమారు 10 లక్షల వరకు బ్రాయిలర్ కోళ్లను పెంచేవారు.

## 'ధర'ణికి దక్కని పరిహారం



కర్నూలు : రెవెన్యూ, రైల్వే అధికారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచారు. ఇచ్చే పరిహారమే తక్కువ.. అదీ చెల్లించకుండా అంతులేని కాలయాపన చేస్తున్నారు. రైల్వే అవసరాల కోసం చిప్పగిరి మండలంలో నీటి నిల్వ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సర్వే నంబర్లు 709/3, 711/3, 712/3, 713/ఎ2, 713/బి1, 726/1, 727/1, 729/ఎ1, 730/1లోని 36.42 ఎకరాల భూమిని 2019లో సేకరించారు. ఆయా భూములు గుంతకల్లు పట్టణానికి కిలోమీటరు దూరంలోనే ఉన్నాయి. అప్పట్లోనే అక్కడ ఎకరా రూ.15 లక్షలు పలికింది. ఎకరాకు రూ.3.59 లక్షలే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో రైతులు హతాశులయ్యారు. విధిలేక కొందరు రైతులు పరిహారం తీసుకొన్నారు. మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. **న్యాయస్థానం చెప్పినా** పరిహారం నిర్ణయించడంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు.. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయించడంతో భారీగా నష్టపోవాల్సిన దుస్థితి తలెత్తిందని ముగ్గురు రైతులు న్యాయస్థానం మెట్లెక్కారు. రైతులకు న్యాయం చేయాలని కోర్టు తీర్పులు ఇచ్చాయి. దీంతో అధికారులు దిగొచ్చి ఎకరాకు రూ.12 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. పరిహారం చెల్లించడంలో అధికారులు అంతులేని జాప్యం చేస్తుండడంతో బాధితులు 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో స్పందించిన సుప్రీంకోర్టు నిర్ణీత కాల వ్యవధిలో రైతులకు న్యాయం చేయాలని 2024 ఏప్రిల్‌లో తీర్పునిస్తూ.. కేసును హైకోర్టుకు రెఫర్ చేసింది. దీంతో హైకోర్టు న్యాయమూర్తి తీర్పునిస్తూ ఆ భూసేకరణకు తాజాగా ప్రకటన ఇచ్చి మెరుగైన పరిహారం చెల్లించాలని అదే ఏడాది నవంబరులో తీర్పునిచ్చారు. ఆ తీర్పు వచ్చి సంవత్సరం గడిచినా నేటికీ అదిగో ఇదిగో అంటూ తాత్సారం చేస్తున్నారు.

**అధికారుల కుమ్మక్కు** చిప్పగిరి గ్రామంలో రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం భూములు సేకరించి రైల్వే అధికారులు ఎకరానికి రూ.22లక్షలు ఇవ్వడం గమనార్హం. ఒకే గ్రామంలో కొందరికి భారీగా పరిహారం ఇచ్చి... మరికొందరికి అతితక్కువగా చెల్లించడమేంటని రైల్వే అధికారులను నిలదీసినా.. అది మీకు వర్తించదంటూ అడ్డగోలుగా వాదిస్తుండటంతో భూములిచ్చిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రెవెన్యూ అధికారులు ఎంత సిఫార్సు చేస్తే అంత మొత్తాన్ని చెల్లిస్తామని రైల్వే అధికారులు చెబుతుండగా.... ఎకరానికి రూ.12 లక్షలకు మించి ఇవ్వొద్దని రైల్వే అధికారులే తమతో పేర్కొంటున్నారని రెవెన్యూ అధికారులు ఆరోపిస్తున్నారు. పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ ఆధ్వర్యంలో నష్టపరిహారం నిర్ణయానికి అధికారిక సంప్రదింపులు జరిపినప్పటికీ బాధితులకు చట్టప్రకారం ఆమోదయోగ్యమైన ధరను ఖరారు చేయలేదు. సమీప సర్వే నంబరులో తాజాగా విక్రయమైన ధరను ప్రామాణికంగా తీసుకుని పరిహారం చెల్లించాలని చట్టం స్పష్టంగా చెబుతున్నా.. దానిని అధికారులు పట్టించుకోవడం లేదు.రైతులకు తీవ్ర అన్యాయం పి.ప్రసాద్, చల్లా గీతాదేవి, చల్లా సుబ్బమ్మ, గుంతకల్లు కొట్టాలరైల్వే అధికారులు చిప్పగిరిలోని అత్యంత విలువైన 36.42 ఎకరాల భూమిని సేకరించి మూడేళ్ల కిందటే అదనపు ఎస్.ఎస్.ట్యాంకు నిర్మాణం పూర్తిచేశారు.

## చెక్ పోస్టులు రద్దు.. అక్రమాలదే పొద్దు

మదనపల్లె : ఒక వైపు నిఘా, పర్యవేక్షణ ఉన్నా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను నియంత్రించడం కష్టమవుతుంది. అలాంటిది ఈ రెండు లేకపోతే ఇక అక్రమార్కులకు అడ్డూ అదుపు ఉండదు. చట్ట విరుద్ధంగా అక్రమ రవాణాకు పాల్పడే వారిని కట్టడి చేయడానికి రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నేడు అవి మూతపడటంతో అక్రమ రవాణాకు అడ్డులేకుండా పోయింది. రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా ప్రకృతి సంపద, నిషేధిత వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు సరిహద్దులు దాటిపోతున్నాయి. జీరో వ్యాపారం చేసుకునే వారి ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయల్లా వర్ధిల్లుతోంది.

**ఇసుక తరలింపునకు రాచమార్గం**

చెక్‌పోస్టులు మూతపడటంతో అక్రమ రవాణాతో ప్రభుత్వానికి పన్ను ఎగ్గొట్టే వారు పెరిగారు. మరోవైపు జిల్లా నుంచి ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఎర్రచందనం, బియ్యం, గంజాయితో పాటు అనేక నిషేధిత వస్తువులు ఇక్కడి నుంచి రవాణా అవుతున్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి పెట్రోలు, డీజిల్‌తో పాటు గుట్కాలు, తంబాకు, ఖైనీ, మద్యం తయారీకి వినియోగించే స్పిరిట్ ఇతర నిషేధిత పదార్థాలను సరిహద్దులు దాటిస్తున్నారు.

మదనపల్లె మండలం చీకలబైలు చెక్‌పోస్టు వద్ద ఆటోల్లో తరలిస్తున్న చౌక బియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. చౌడేపల్లె మండలంలోని సింగిరిగుంట చెక్‌పోస్టు మీదుగా పలమనేరు గుడియాత్తంకు అక్రమ రవాణా జరుగుతోంది.

ఏపీ ప్రభుత్వం సరఫరా చేసే రాయితీ ఎరువులను కొందరు కర్ణాటకకు తరలించి ఎక్కువకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

ఎలక్ట్రికల్ సామాన్లు, పెయింట్లు, గృహోపకరణాలు, ఇతర వస్తు సామగ్రి తెచ్చి జీవో వ్యాపారం చేసి ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా రూ.లక్షలు ఆదాయం గడిస్తున్నారు. ఏడాది క్రితం మదనపల్లెలో జేసీబీలు, ట్రాక్టర్ల యజమాని డీజిల్ బ్యారళ్లలో తెచ్చి నిల్వ ఉంచగా రెవెన్యూ అధికారులు సీజ్ చేసి, అతనిపై శాఖాపరమైన చర్యలు చేపట్టారు.

**ఎక్కడెక్కడంటే...**

జిల్లా కేంద్రం మదనపల్లెకు 10 నుంచి 15 కి.మీల దూరంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. మదనపల్లె, పుంగనూరు, రామసముద్రం, పీటీఎం మండలాల సమీపంలోనూ కర్ణాటక సరిహద్దులో అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రామసముద్రం మండలంలో అనప్పపల్లె, ఆల్చేపల్లె, చుక్కాండ్లపల్లె, బేడపల్లె, గజ్జిగంగనపల్లె సమీపంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది.



పీటీఎం మండలంలో మారుగానిపల్లె, చెన్నరాయునిపల్లె, అంకాలమడుగు, మల్లెల గ్రామాల సమీపంలో నాలుగు చెక్‌పోస్టులు ఉన్నాయి. పుంగనూరు మండలం బెంగళూరు రోడ్డులోని సింగిరిగుంట, మాగాండ్లపల్లె, చౌడేపల్లె మండలం సింగిరిగుంట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మదనపల్లె మండలం బెంగళూరు రోడ్డు చీకలబైలు సమీపంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు.

**పనిచేస్తున్నదొక్కటే**

పుంగనూరు మండలంలో ఒకటి, మదనపల్లె మండలంలోని చీకలబైలు వద్ద ఉన్న చెక్‌పోస్టులు మాత్రమే పనిచేస్తుండగా మిగిలినవన్నీ మూతపడ్డాయి.

**వైకాపాదే ఈ పాపం**

వైకాపా ప్రభుత్వంలో చెక్‌పోస్టుల్లో పనిచేయడానికి సిబ్బందిని ఏజెన్సీల ద్వారా నియమించుకుని ఆ పార్టీ నాయకులు అక్రమ వ్యాపారాలు, రవాణా యథేచ్ఛగా సాగించారు. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు చెక్‌పోస్టులన్నింటినీ మూసేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని తెరిపించినా, కొన్ని నెలల వ్యవధిలోనే మళ్లీ మూతపడ్డాయి.

## లేఅవుట్‌నే లేపేశారు!

ఒంగోలు: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 18 ఎకరాల భూమిని అక్రమార్కులు ఆక్రమించుకుని పంటల సాగు చేపట్టారు. ఎక్కడో మారుమూల పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ఎవరూ చూడనిచోట అనుకుంటే పొరపడినట్లే. జిల్లా కేంద్రమైన ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో పెద్దఎత్తున ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. ఆక్రమణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో రెవెన్యూశాఖ అధికార యంత్రాంగం రంగంలోకి దిగి భూముల స్వాధీనానికి అడుగులు వేసింది. ఒంగోలు నగర పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల మధ్య 170 ఎకరాల మేర భూమిని సేకరించి లేఅవుట్ (జగనన్న కాలనీ) ఏర్పాటు చేశారు. అప్పట్లోనే ఎకరాకు ధర నిర్ణయించి రైతులకు పరిహారం సైతం అందజేశారు. కోర్టు కేసులు, అనర్హులకు ఇళ్ల స్థలాలు కట్టబెట్టడం తదితర కారణాలతో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో జాప్యం చోటుచేసుకుంది. ఖాళీగా ఉన్న ఆ భూములపై కొంతమంది అక్రమార్కులు కన్ను పడింది.

వెంగముక్కపాలెం పరిధిలోని సర్వే నంబరు 170, 171, 172లలో భూములను అక్రమార్కులు కబ్జా చేసి పంటల సాగు చేయడం మొదలుపెట్టారు. లేఅవుట్‌లోని సరిహద్దు రాళ్లు సైతం తొలగించి పూర్తిగా దున్నేశారు. దీనిపై పట్టించుకునేవారు లేకపోవడంతో ఆక్రమణదారులు పొగాకు పంటలను వేశారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వారి ఆదేశాల మేరకు రెవెన్యూశాఖాధికారులు పంటలను ట్రాక్టరుతో దున్నించారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారు.

**రాజకీయ ఒత్తిళ్లు...**

భూ ఆక్రమణదారులు కొంతమంది స్థానిక పెద్దల ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను కలిశారు. ఆక్రమణలు తొలగించకుండా చూడాలని కోరారు. ప్రభుత్వ భూమి అయినందున, పేదలకు పట్టాల పంపిణీకి సిద్ధం చేస్తున్నందున సాధ్యం కాదని ఎమ్మెల్యే వారికి తేల్చి చెప్పారు. ఆక్రమణలు తొలగించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. చివరకు రెవెన్యూశాఖ అధికారులు ట్రాక్టరు తీసుళ్లి వేసిన పంటలను ధ్వంసం చేశారు. పేదల కాలనీలో పంటలు సాగు చేయొద్దని, ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామని, వాళ్లు వినిపించుకోకపోవడంతో పంటలను ధ్వంసం చేసి భూములను స్వాధీనం చేసుకున్నామని రెవెన్యూశాఖాధికారులు చెబుతున్నారు.

చురకలు



# నాయకుల ధనదాహం.. వ్యర్థాలతో ప్రాణసంకటం

పుట్టపర్తి : ఎవరేమైతే మాకేంటి.. తాము బాగుంటే చాలన్నట్లుంది పెనుకొండ మండలంలోని కొందరు నాయకుల పరిస్థితి. కియా అనుబంధ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకుండా.. చెక్‌డ్యామ్‌లలో పడేస్తున్నారు. అంతేకాదు.. కాల్చివేస్తుండటంతో జల, వాయు కాలుష్యం కారణంగా ఆ ప్రాంత ప్రజలతోపాటు జీవాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యర్థాలను విభజించి ఎవరికీ హాని లేకుండా నిర్వహించాలి. ఇందుకోసం పెనుకొండ శివారులోని రొద్దం రోడ్డులో కొంత భూమిని కేటాయించారు. ఈ వ్యర్థాలు సదరు ప్రాంతానికి చేరడం లేదు.
పారిశుద్ధ్య సామగ్రి, వ్యర్థాల తరలింపు పనిని స్థానిక నాయకులు దక్కించుకుంటున్నారు. తొలి నుంచి ఎవరు అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులే చేజిక్కించుకుంటున్నారు. ప్రస్తుతం ఆయా పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను బయటకు తరలించేందుకు నెలకు రూ.6 లక్షల వరకు అందుతోంది. ఇనుము, ప్లాస్టిక్ తదితర పనికివచ్చే



వస్తువులను వేరుచేసి విక్రయించగా మరో రూ.4 లక్షల వరకు వస్తోంది.
**పర్యావరణానికి హాని** వృథ రబ్బరు, రెగ్జిన్ ముక్కలు, అట్టలు, రంగుల ఖాళీ డబ్బాలు తదితర వాటిని పెనుకొండ మండలం గొందిపల్లి సమీపాన నాగిరెడ్డికొండ, చాకలగుట్ట మధ్య ఉన్న రెండు చెక్‌డ్యామ్‌లలోకి వేస్తున్నారు. వాటికి నిప్పంటిస్తుండటంతో ఆ ప్రాంతమంతా నిత్యం పొగచూరి దుర్వాసన వెదజల్లుతుంటుంది. వర్షాలు భారీగా కురిసినప్పుడు కొండవాలుల నుంచి వరద చెక్‌డ్యామ్‌లలోకి చేరి అక్కడి నుంచి కిందనున్న చెరువులోకి కలుస్తాయి. ఈ విషయంగా ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ నగకుమార్ మాట్లాడుతూ క్షత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎంచక్కా.. ఎత్తేస్తున్నారు..!

రోలుగుంట : రోలుగుంట మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోయింది. ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వి తరలించుకుపోతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. తాజాగా ఎం.పట్నం రెవెన్యూ పరిధిలో మట్టి మాఫియా అక్రమ తవ్వకాలకు తెరలేపారు. స్థానిక రెవెన్యూ సర్వే నం. 121-3లో వరహా నదిని ఆనుకొని ఉన్న గెడ్డ పోరంబోకు భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. గైరంపేట, బి.బి.పట్నం తదితర ప్రాంతాలకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థిరాస్తి వెంచర్లు, ఇళ్ల స్థలాలను చదును చేయడం, ఇంటి నిర్మాణాలకు వంటి పనుల కోసం యజమానులతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకొని పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. రెవెన్యూ



రికార్డుల్లో సర్వే నం. 121-3లోని భూమి గెడ్డ పోరంబోకుగా నమోదైంది. దీంతో ఎవరూ అడిగేవారు లేకపోవడంతో కొందరు యంత్రాలతో పెద్ద ఎత్తున తవ్వకాలు జరిపి మట్టిని ట్రాక్టర్లకు ఎత్తుతున్నారు. ప్రభుత్వ భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలంటే గనులశాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరిపే ప్రాంతాన్ని పరిశీలించి ఆపై అనుమతులు జారీ చేస్తారు. ఇలాంటివేమీ ఇక్కడ కనిపించట్లేదు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 700 నుంచి రూ.800 వరకు మట్టి మాఫియా జేబుల్లో వెళుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలు ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు.
అక్రమ తవ్వకాలపై వీఆర్వో రాజులమ్మను వివరణ కోరగా ఎం..పట్నం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పారు. మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతం గెడ్డ పోరంబోకు పరిధిలోకి వస్తుందన్నారు. మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

# నీటి నాణ్యత ఎంత..?

విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థకు విస్కో (విశాఖపట్నం పరిశ్రమల నీటి సరఫరా సంస్థ) ఆధ్వర్యంలో కొత్తగా 'మొబైల్ వాటర్ టెస్టింగ్ ల్యాబొరేటరీ'ని సమకూర్చారు. ఈ సంచార ప్రయోగశాల ద్వారా క్షత్రస్థాయిలో ఎక్కడికక్కడ నీటి పరీక్షలు జరిపి, నాణ్యత వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిత్యం నగర ప్రజలకు నీటిని సరఫరా చేసేందుకు వివిధ జిల్లాల పరిధిలోని నీటి వనరుల నుంచి కిలోమీటర్ల మేర పైపులైన్లు, కాలువలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నగరానికి చేరుకునే నీటిని ముందుగా నీటి శుద్ధి కేంద్రాల్లో శుభ్రం చేస్తారు. తర్వాత అగనంపూడి, నరవ, టీఎస్సార్‌లో ఉన్న ప్రయోగశాలల్లో పరీక్షలు చేసి, రిజర్వాయర్లకు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు.
ప్రజారోగ్యం దృష్ట్యా: నీటిలో బురదశాతం ఎక్కువగా ఉన్నా, ఈ-కోలి బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు ఉన్నా.. నగర ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నీటి శుద్ధి కేంద్రాల్లో బ్యాక్టీరియాను పూర్తిగా సంహరించి, తర్వాత రిజర్వాయర్లకు వెళ్లేటప్పుడు, అక్కడ నుంచి కుళాయిలకు విడుదల చేసే సమయంలో మరోసారి నీటి నాణ్యత పరీక్షలు చేస్తారు. అలా రోజూ 700 వరకు నీటి నమూనాలను పరిశీలించిన తర్వాతే పంపిణీ చేస్తారు. టర్బిడిటీ శాతం, పీహెచ్ స్థాయితో పాటు ఈ-కోలి తదితర బ్యాక్టీరియాలు ఏమైనా ఉన్నాయోనని పరిశీలిస్తారు.

**సునిశిత పరిశీలన..!**

మొబైల్ టెస్టింగ్ ల్యాబ్ వాహనంలో టర్బిడిటీ (నీటిలో మట్టి), బయోలాజికల్ (సూక్ష్మజీవులు), డీఎల్ఎస్ (నీటిలో కరిగి ఉన్న రసాయనాలు) పరీక్షలు చేస్తారు. పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్- నీటిలో ఉన్న సూక్ష్మజీవులు) శాతం 0.5 నుంచి 2 మధ్యలో ఉంటే సురక్షతమని, లేని పక్షంలో నీరు కలుషితం అయిందని నిర్ధారిస్తారు. ఆ మేరకు అవసరమైన చర్యలు చేపడతారు. ఇలా నగరంలో వివిధ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి, ఆ నివేదికలను పర్యవేక్షక ఇంజినీర్ పల్లంరాజుకు అందిస్తామని నిర్వహణ సిబ్బంది తెలిపారు. శుద్ధజలం ప్రజలకు అందేలా చూడడమే తమ ప్రధాన కర్తవ్యమన్నారు.

# మెగా సామూహిక బిందుసేద్యానికి అడుగులు



ఉరవకొండ : దేశంలో ఎక్కడా లేని విధంగా శాస్త్ర సాంకేతికతతో ప్రయోగాత్మకంగా చేపట్టిన మెగా సామూహిక బిందు సేద్య పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వేలాది ఎకరాలకు నీరు అందించాలనే ఉద్దేశంతో 2018లో తెదేపా ప్రభుత్వం రూ.890 కోట్లతో పథకాన్ని చేపట్టింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పథకాన్ని ఆపేసింది. పథకం పూర్తయితే ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని 50వేల ఎకరాలకు బిందుసేద్య విధానంలో సాగునీరు అందనుంది. దీని కోసం హంద్రీనీవా, హెచ్ఎల్‌సీ నుంచి 1.67 టీఎంసీలు వినియోగించుకోనున్నారు. పీఏబీఆర్ కుడివైపు కూడేరు మండలంలో 12,982 ఎకరాలు, ఎడమవైపు ఉరవకొండ, కూడేరు మండలాల్లో 12,732 ఎకరాలు, జీడిపల్లి జలాశయం నుంచి బెళుగుప్ప మండలంలో 12,605 ఎకరాలు, ఎంపీఆర్ జలాశయం నుంచి ఉరవకొండ మండలానికి 12,185 ఎకరాలకు సాగునీటిని అందించాలన్నది లక్ష్యం.
ఒక జోన్‌లో 400 ఎకరాలు ఉండే విధంగా 30 జోన్లను ఏర్పాటు చేశారు. కాలువ ద్వారా నీళ్లు సంపులోకి, అక్కడి నుంచి ఫిల్టర్లు ఉన్న కంట్రోల్ గదికి చేరిన తరువాత నెట్‌వర్క్ ద్వారా నీటిని పంపు చేసే విధంగా డిజైన్ చేశారు. పథకం ద్వారా 13వేల మంది రైతులు లబ్ధి పొందనున్నారు.
**40శాతం మేర పూర్తి** పథకం పనులను 2019లో ప్రారంభించారు. తొలి దశ కింద దాదాపు రూ.90 కోట్లతో 25వేల ఎకరాలకు సరిపడేలా బిందుసేద్య సామగ్రిని కొనుగోలు చేశారు. దీన్ని ఉరవకొండ మండలం ఆమిద్యాల వద్ద భద్రపరిచారు. కూడేరు మండలం కొర్రకోడు, ముద్దలాపురం, జల్లిపల్లి, చోళసముద్రం గ్రామాల్లో పైపులైన్లు, పంపింగ్ గదుల నిర్మాణాలను చేపట్టారు. దాదాపు 40శాతం మేర పనులు పూర్తయ్యాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లు పనులను చేపట్టకపోవడంతో పొలాల్లోని సామగ్రి చోరీకి గురైన సందర్భాలు ఉన్నాయి. ఆమిద్యాల వద్ద నిల్వ ఉన్న 80వేల కిలోమీటర్ల పైపులు, ఇతర సామగ్రి నిల్వ ఉన్నాయి. ప్రస్తుతం ఉపయోగించవచ్చా.. లేదా? నాణ్యత ఉందా? అన్నది తేలాల్సి ఉంది. నిర్ధారణ కోసం నమూనాలను పరీక్షలకు పంపారు. ఫలితాలు వస్తే పథకాన్ని ప్రభుత్వ అనుమతితో తిరిగి ప్రారంభించేందుకు హంద్రీనీవా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ మాట్లాడుతూ... సామగ్రి నాణ్యత నిర్ధారణ కాగానే మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో వీలైనంత త్వరగా పథకం పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు.

# తనిఖీలు తూచ్..!



కుప్పం : కుప్పం-కేజీఎఫ్ అంతర్రాష్ట్ర మార్గంలో.. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోన్ని పాపురం వద్ద మూతపడిన చెక్‌పోస్టు ఇది. శాంతిపురం మండలంలో రాళ్లబూదుగూరు.. కుప్పం నుంచి గెసికపల్లె మీదుగా కర్ణాటకకు ఉన్న డబుల్‌రోడ్డు కూడలిలోని తనిఖీ కేంద్రం అలంకారప్రాయంగా మిగిలింది. సదరు రహదారి అక్రమ రవాణాకు రాచమార్గంగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో వైకాపా ప్రభుత్వం ప్రచార్భాటంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. త్రిరాష్ట్ర కూడలి కావడంతో.. అంతరాష్ట్ర మార్గాలతోపాటు గ్రామీణ రహదారుల్లోనూ తనిఖీ కేంద్రాలను నెలకొల్పారు. దాదాపు 50 చోట్ల చెక్‌పోస్టులు. సీసీ కెమెరాలకు రూ.లక్షల్లో ప్రభుత్వ నిధులను ఖర్చు చేశారు. సిబ్బందికి నెలనెలా రూ.లక్షల్లో వేతనాలు చెల్లించారు. దాదాపు రెండేళ్ల పాటు కొనసాగిన చెక్‌పోస్టులు నిర్వహణ లేమితో మూతపడ్డాయి. సీసీ కెమెరాలు చోరుల పాలయ్యాయి. ఇనుప షెడ్లు తుప్పు పడుతున్నాయి.
రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గ్రానైట్‌తో పాటు కలప, ఇసుక తదితర సహజ వనరులతో పాటు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడని స్థితి ఏర్పడింది. అటవీశాఖ, మార్కెట్ కమిటీల తరఫున తనిఖీ కేంద్రాలు కూడా లేకపోవడం అక్రమార్కులకు వరంలా మారింది. పొగాకుకు సంబంధించి రూ.లక్షల విలువైన గుట్కా ఉత్పత్తులను దర్జాగా తీసుకొస్తున్నా.. పట్టించుకునే నాథుడు కరవయ్యాడని స్థానికులు అంటున్నారు.

**అక్కడ నిరంతర నిఘా**

తమిళనాడు, కర్ణాటక పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో అక్కడి ప్రభుత్వం ఎక్సైజ్, అటవీ, వాణిజ్య, ఆర్టీఏ శాఖల తరఫున తనిఖీ కేంద్రాల నిర్వహణను పటిష్ఠంగా కొనసాగిస్తోంది. నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పలమనేరు-కృష్ణగిరి జాతీయ రహదారిలో కుప్పం సమీపంలోని.. తమిళనాడు పరిధి గౌరివినాయనిపల్లె వద్ద తనిఖీ కేంద్రం ఉంది. పలమనేరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర మార్గంలో సామచేను మిట్ట, వి.కోట-పేర్నంబట్టు రహదారిలో బత్తలపల్లె వద్ద తమిళనాడు చెక్‌పోస్టులున్నాయి.

# కలల సౌధం.. ఎట్టకేలకు సాకారం!



విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపీఈ) విద్యార్థుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. కొత్త సంవత్సరంలో కొంగొత్త ఆశలతో శాశ్వత ప్రాంగణంలో అడుగుపెట్టారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి సమీపంలోని శాశ్వత ప్రాంగణంలో సోమవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. పచ్చటి ప్రకృతి నడుమ, ప్రశాంత వాతావరణంలో యూనివర్సిటీ భవనాలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యాధునిక విద్య, పరిశోధన సౌకర్యాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల నిర్వహణకు వసతులు అందుబాటులోకి వచ్చాయి. ఇకపై పూర్తిగా శాశ్వత ప్రాంగణంలోనే తరగతులు జరుగుతాయి. విద్యా కార్యక్రమాలకు అవసరమైన భవన నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ భవనం, ఉద్యోగుల కోసం కేటాయించిన నివాస సముదాయం నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది.
2016 నుంచి తాత్కాలిక ప్రాంగణంలో: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం 2016లో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఐఐపీఈని స్థాపించారు. ఇప్పటి వరకు విశాఖ నగరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక క్యాంపస్‌లో తరగతులు నిర్వహించారు. పెట్రోలియం, ఎనర్జీ రంగాల్లో నాణ్యతతో కూడిన విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, నైపుణ్యంతో కూడిన మానవ వనరులను తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. వంగలి గ్రామంలో ఈ వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా 201.80 ఎకరాలను కేటాయించింది. భూమికి సంబంధించి న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో నిర్మాణం ఆలస్యమైంది. వీటిపై ఏపీ హైకోర్టు నిర్ణయం వెలువరించిన తర్వాత 2023 మార్చిలో ఈ భూమి ఐఐపీఈ చేతుల్లోకి వచ్చింది. అప్పటి నుంచి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

2016: స్థాపించిన సంవత్సరం
విస్తీర్ణం: 201 ఎకరాలు
విద్యార్థులు: 600కు పైగాఅంచనా వ్యయం: రూ.855 కోట్లు
ఖర్చు చేసింది: దాదాపు రూ.400 కోట్లు
అదనంగా మరో రూ.150 కోట్లు ప్రయోగశాలలు, ఫర్నీచర్, మౌలిక సదుపాయాలకు ఖర్చు చేశారు.

# అప్పుడు ప్రాజెక్టులా.. ఇప్పుడు అడవిలా..

హిందూపురం :ఉమ్మడి మైసూరు రాష్ట్రం ఉన్నప్పుడు హిందూపురం సమీపంలో 1952లో పెన్నార్ కుముద్వతీ ప్రాజెక్టు నిర్మించారు. కర్ణాటక ప్రాంతం నుంచి పెన్నానది, కుముద్వతీ నదులు వర్షాకాలంలో ప్రవహిస్తున్నందున ఈ రెండు నదుల పేర్లు కలిసేలా ప్రాజెక్టు నిర్మించారు. వీటి నుంచి చెరువులకు నీరు చేరేలా కుడి, ఎడమ కాలువలు తవ్వించారు. వేలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉండేది. 25 సంవత్సరాలుగా పాలక ప్రభుత్వాలు చాలీచాలని నిధులు మంజూరుచేస్తూ అడపదడపా మరమ్మతులు చేసినా శాశ్వత పరిష్కారం లేనందున ప్రాజెక్టు లోపల, బయట ఉన్న కాలువల్లో కంపచెట్లు పెరిగి ప్రాజెక్టు నిజస్వరూపాన్నే కోల్పోయి అటవీ ప్రాంతం ఛాయలు అలుముకున్నాయి. పునరుద్ధరణకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. చిన్ననీటిపారుదలశాఖ డీఈ శైలేశ్వర్ మాట్లాడుతూ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం, ఏప్రిల్‌లో మంజూరయ్యే ఆస్కారముందన్నారు.

# 'అ'క్షరం.. 'ఆ'మెకు తోడు..!

విశాఖపట్నం : ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అవుతుంది. కాని ఇప్పటికీ చాలా మంది మహిళలకు చదవడం, రాయడం రాదు. అలాంటి వారికి అక్షర జ్ఞానం అందించేందుకు జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పర్యవేక్షణలో వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ఎస్.సుబ్రహ్మణ్యవర్మ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాలు నేర్పించే కసరత్తు జరుగుతుంది.

**ప్రాథమిక అవగాహన**

మహిళలు కనీసం చదవడం, రాయడంతో పాటు, నగదు లెక్కలు, డిజిటల్ లావాదేవీలు నిర్వహించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం



ఆధ్వర్యంలో గత సెప్టెంబరు 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా 'ఉల్లాస్' పేరిట ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించారు. ఆ కార్యక్రమాన్ని రాష్ట్రంలో 'అక్షరాంధ్ర' పేరిట అమలు చేస్తున్నారు.

**వాలంటీర్లతో శిక్షణ**

ముందుగా డీఆర్‌డీఏ, మెప్మా శాఖల ద్వారా పథకాలు పొందుతున్న మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించారు. రోజూ ఓ గంటసేపు చొప్పున, మొత్తం వంద గంటలు బోధన కొనసాగిస్తారు. కొందరు వాలంటీర్లకు బోధన విధానాలపై అవగాహన కల్పించి, ఇప్పుడు వారి ఆధ్వర్యంలోనే శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు ఎన్‌సీఈఆర్‌టీ ముద్రించిన మెటీరియల్ అందించారు. కోర్సులు పూర్తి చేసిన వారికి పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

# వారధి పూర్తి.. అవస్థలకు స్వస్తి

పాలకొండ : ఎట్టకేలకు చీపురుపల్లి వద్ద రైల్వే వంతెన నిర్మాణం పూర్తయింది. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో నాలుగేళ్ల క్రితం రాకపోకలు నిలిపేశారు. పాలకొండ డిపో నుంచి విశాఖ, విజయనగరం వెళ్లే బస్సులు చాలా వరకు రద్దు చేశారు. రాజాం, చిలకపాలెం మీదుగా విశాఖకు ప్రత్యామ్నాయంగా నడుపుతున్నారు. దీంతో విజయనగరం వెళ్లాలంటే మూడు బస్సులు మారాలి. కూటమి రాకతో పనులు జోరందుకున్నాయి. ప్రస్తుతానికి తాత్కాలికంగా రాకపోకలకు అనుమతిలిచ్చారు. త్వరలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**నిలిపివేతతో ఆర్టీసీకి నష్టం..**

గతంలో పాలకొండ ఆర్టీసీ డిపో పరిధిలో నైట్ హాల్ట్‌లతో కలిపి విశాఖకు 49 బస్సులు నడిచేవి. రోజూ రూ.14 లక్షల మేర ఆదాయం వచ్చేది. గతంలో వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 10 వరకు విశాఖకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉండేది. ఇప్పుడు గంటకు ఒకటి వస్తోంది. దీనివల్ల సమయానికి గమ్యస్థానం చేరలేక పోతున్నారు.



ప్రస్తుతం కొన్ని రద్దు చేసి, 18 మాత్రమే ప్రత్యామ్నాయ మార్గంలో నడుపుతుండడంతో ఆదరణ తగ్గింది. ఫలితంగా రూ.12 లక్షల వరకు ఆదాయమే సమకూరుతోంది. రోజూ రూ.2 లక్షల మేర కోల్పోయింది. ఇలా ఈ నాలుగేళ్లలో రూ.కోట్లమేర నష్టపోయింది.

**సంక్రాంతికి ఊరట**

పాలకొండ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం నివాసం ఉంటున్నవారు అధికంగా ఉన్నారు. వీరంతా సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుంటారు. వంతెన పూర్తై తాత్కాలికంగా రాకపోకలు చేస్తుండడంతో ఈ ఏడాది ఇక్కట్లు తప్పనున్నాయి.

**పూర్తిస్థాయిలో నడుపుతాం..**

చీపురుపల్లి వంతెన ప్రారంభమైన తక్షణమే విశాఖకు యధావిధిగా సర్వీసులు పునరుద్ధరిస్తాం. ఈ మార్గంలో ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తుంది. అందువల్ల ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనపు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటాం. పి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి

# చెయ్యేరులో పాపాల భైరవులు

కడప: చిత్రంలో కనిపిస్తున్నవి పొలాలనుకుంటే పొరపాటు. చెయ్యేరు నదిలోని బాలరాజుపల్లె రేవు ప్రాంతం. రాజంపేట మండల పరిధిలోని ఈ రేవు ఇసుకాసురుల పాలిట స్వర్గధామంగా మారింది. ఓ వైపు వరద నీటి ప్రవాహం సాగుతున్నప్పటికీ సమీపంలోని కొండలో మట్టి తవ్వి తెచ్చి నదిలో ఏకంగా రహదారే నిర్మించారు. భారీ వంతెనకు సమీపంలోనే యంత్రాలతో ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. రాయచోటి-రాజంపేట ప్రధాన రహదారిపై ఉన్న వంతెన కింద యథేచ్ఛగా ఇసుక తవ్వేస్తున్నారు. సమీపంలోనే రాయచోటికి తాగునీటి పంపింగ్ కేంద్రంతో పాటు రోళ్లమడుగు ప్రాజెక్ట్ ఉంది. అయినా సాగిస్తున్న ఇసుక తవ్వకాలతో పథకాలకు ముప్పు పొంచి ఉంది.
రాజంపేట నియోజకవర్గంలోని బాలరాజుపల్లె రేవులో గుంటూరుకు చెందిన వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేపట్టారు. అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తులు తమ చేతికి మట్టి అంటుకోకుండా ఈ దందాను పొరుగువారితో సాగిస్తున్నారు. ఈ రేవు నుంచి నిత్యం చెన్నై, బెంగళూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. మార్గమధ్యంలో పలుమార్లు పట్టుబడినా రవాణా ఆగడం లేదు. ఇది వరకు అన్నమయ్య జిల్లా పర్యవేక్షణలో ఉన్న ఈ రేవుకు ఆ జిల్లాకు చెందిన కొందరు అధికారులు అన్ని రకాలుగా సహకరించి అక్రమాల్లో భాగస్వాములయ్యారనే ఆరోపణలున్నాయి. జిల్లా పునర్విభజన నేపథ్యంలో వైఎస్సార్ కడపలోకి ఇటీవల బాలరాజుపల్లె రేవు చేరింది. జిల్లా మారిపోయినా అక్రమార్కులు తమ పంథలోనే ఇసుక దోపిడీ సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా తవ్వి తరలించి జేబులు నింపుకొంటున్నారు. రేవుకు సమీపంలోని భారీ వంతెనకు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు. సమీపంలోని రైతుల పొలాలకు నష్టం వాటిల్లుతున్నా., రాయచోటి తాగునీటి ప్రాజెక్ట్‌కు ముప్పు వాటిల్లేలా తవ్వేస్తూనే ఉన్నారు.

**మాకు సమాచారం లేదు**

అక్రమ తవ్వకాలపై బాలరాజుపల్లె రేవులో ఇసుక తవ్వకాలపై మాకు ఎలాంటి సమాచారం లేదు. గతంలో తవ్వకాలు చేస్తున్న వ్యక్తులతో డిసెంబరులో మాట్లాడగా చేయడం లేదని చెప్పారు. ఇప్పుడు మరలా తవ్వకాలు సాగిస్తున్న విషయ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. జయచంద్రారెడ్డి, ఈఈ, జల వనరుల శాఖ

# విద్యార్థుల భవితకు ఆధార్!

రాయదుర్గం : ప్రతి భారత పౌరుడికి 'ఆధార్' ఎంతో కీలకం. విద్యాభ్యాసంతో మొదలుకుని సామాజిక పింఛను తీసుకునే వయోవృద్ధుడి వరకు ఈ కార్డు ప్రధాన భూమికి పోషిస్తోంది. ఎక్కడికెళ్లినా ఈ కార్డు ద్వారా చిరునామా తెలుసుకోవచ్చు. అందుకే నిర్దేశిత వయసులో విధిగా ఆధార్ కార్డును నవీకరించుకోవాలి. దీని ప్రాధాన్యం గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక శిబిరాల నిర్వహణతో నవీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 5-17ఏళ్ల మధ్య వయసు కల్గిన విద్యార్థుల కోసం శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇందుకు ప్రత్యేక తేదీలతో షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించిందని 'ఆధార్' విభాగం జిల్లా సమన్వయకర్త నారపరెడ్డి పేర్కొన్నారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. ప్రతి విద్యార్థి విధిగా ఆధార్‌ను నవీకరణ చేసుకోవాలని సూచించారు.

**అంతా ఉచితంగానే..**

ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ఆధార్ నవీకరణ చేసుకోని 5-17 ఏళ్ల మధ్య వయసు కల్గిన విద్యార్థులు 1,15,746 మంది ఉన్నారు. గత నవంబరులో 24 వేల మందికిపైగా నవీకరణ చేసుకోగా.. ఇంకా



91,257 మంది మిగిలిపోయారు. వీరందరూ విధిగా సమీప ఆధార్ కేంద్రాలకు వెళ్లి వేలిముద్రలు (బయోమెట్రిక్), ఐరిస్ చేయించుకోవాల్సి ఉంది. ఐదేళ్లు పైబడిన ప్రతి పిల్లాడి ఆధార్ నవీకరణ తప్పనిసరి. ఎందుకంటే.. వేలిముద్రల్లో మార్పు ఉంటుంది.

ప్రైవేటు మీ-సేవ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగానే చేస్తారు. ఆధార్ కార్డు తప్పనిసరి. వెంట తల్లిదండ్రులను తీసుకెళ్లాలి. వారు ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.

కేంద్రాలు ఎక్కడ: గ్రామ, వార్డు సచివాలయాలు, మీ-సేవ, ఎంపిక చేసిన బ్యాంకులు, పోస్టాఫీసులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు, ప్రభుత్వ గిరిజన గురుకులాలు. శిబిరాల నిర్వహణ: ఈనెల 16 నుంచి 20, 22 నుంచి 24వ తేదీ వరకు..

# అలిపిరిలో ఆధ్యాత్మిక టౌన్‌షిప్

తిరుపతి: శ్రీవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తుడి కష్టాలకు ఇక కాలం చెల్లనుంది. తిరుపతిలో వసతి గదుల కోసం పడే పాట్లు ప్రైవేటు దోపిడీకి అడ్డుకట్ట వేసేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో అలిపిరి వద్ద అత్యాధునిక హంగులతో 'ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్' నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది. ఇక్కడున్న శిల్ప కళాశాలను మరో చోటకు తరలించి అందుబాటులో ఉన్న 20 - 25 ఎకరాల విశాల ప్రాంగణంలో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది.

**కొండపై పరిమితులు**

తిరుమలలో భౌగోళికంగా స్థలం తక్కువగా ఉండటం, నీటి ఎద్దడి వంటి కారణాలతో అక్కడ కొత్తగా గదుల నిర్మాణం సాధ్యం కాదు. 7,500 వరకు గదులున్నా ఏమాత్రం చాలడం లేదు. దీంతో కొండపై



వసతి దొరక్క భక్తులు రోడ్లపైన, షెడ్లలోనూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. లాకర్లలో వస్తుసామగ్రి దాచిపెట్టి దర్శనాలకు వెళ్లేవారు వేలల్లో ఉంటున్నారు. మరోవైపు ప్రైవేటు వాహనాల రద్దీ వారాంతాల్లో పదివేల వరకు ఉంటోంది. కాలుష్యం, రద్దీ, పార్కింగ్ వంటి సమస్యల నేపథ్యంలో వీటిని నియంత్రించే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

**వసతి దొరక్క.. జేబులకు చిల్లు**

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు నిత్యం 70 వేల నుంచి లక్షమంది వరకు భక్తులు వస్తుంటారు. తగిన వసతి సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అనధికారిక 'హోమ్‌స్టే'లు, ప్రైవేటు లాడ్జీలు నిలువునా దోచుకుంటున్నాయి.

**సీఎం సూచనల మేరకు**

తిరుమల కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో సీఎం చంద్రబాబు సూచనల మేరకు అలిపిరిలో టౌన్‌షిప్ నిర్మించాలని నిర్ణయించాం. త్వరలో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. బడ్జెట్‌కు సంబంధించి అనుమతులు రాగానే నిర్మాణం మొదలవుతుంది. బీఆర్ నాయుడు, తితిదే ఛైర్మన్

# ఆసక్తి ఉందా.. శిక్షణ మీకోసమే

తిరుపతి : యవత, మహిళల ఉపాధి, వ్యాపారాభివృద్ధికి శ్రీపద్మావతి వర్సిటీ అండగా నిలుస్తోంది. లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఎల్‌బీఐ)తో కలిపి గృహవిజ్ఞాన శాస్త్రం, సెరికల్చర్, మహిళా అధ్యయన విభాగాల సమన్వయంతో శిక్షణ కేంద్రాలను వర్సిటీలోని గోదావరి బ్లాక్‌లో సోమవారం ప్రారంభించారు. ఇక్కడి విద్యార్థినులు, సిబ్బందే కాకుండా ఆసక్తిగల బయటి ప్రాంత మహిళలు ఎవరైనా శిక్షణలో చేరి ఉపాధి బాటలు వేసుకోవచ్చు.

**పుట్టగొడుగుల పెంపకం**

పదోతరగతి, ఇంటర్ పూర్తిచేసిన మహిళలకు శని, ఆదివారాల్లో శిక్షణ ఉంటుంది. కాలపరిమితి మూడునెలలు. త్వరలోనే శిక్షణ ప్రారంభమవుతుంది.

సంప్రదించాల్సిన నం. : 94405 06558

**టైలరింగ్‌లో..** ప్రతిరోజూ సాయంత్రం 4-6 గంటల వరకు శిక్షణ ఇస్తారు. 50 వరకు కుట్టు, జిగ్‌జాగ్ మిషన్లను ఏర్పాటు చేశారు. శిక్షణ కాలం 3 నెలలు. విద్యార్థినులు నెలకు రూ.250, బోధనేతర సిబ్బంది రూ.500, బోధనా సిబ్బంది రూ.750 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇతర ప్రాంత మహిళలు మూడునెలలకు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

సంప్రదించాల్సిన నం. : 90303 84165

**బేకరీ యూనిట్** ఇక్కడి ప్రత్యేక యూనిట్‌లో వారం నుంచి పదిరోజుల్లోపు కేకులు, బ్రెడ్, పఫ్, బిస్కెట్లు వంటి పది రకాల ఉత్పత్తులపై నిపుణులు శిక్షణ ఇస్తారు. రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన యంత్ర పరికరాలన్నింటినీ అందుబాటులో ఉంచారు. శిక్షణ అనంతరం బేకరీ ఏర్పాటుకు సలహాలు, సూచనలు ఇస్తారు. శిక్షణ త్వరలోనే ప్రారంభంకానుంది.

సంప్రదించాల్సిన నం. : 94414 96040

# పేరు కళాకారులది.. పెత్తనం దళారులదే!



కదిరి : కదిరి-హిందూపురం ప్రధాన రహదారిలో పట్టణానికి సమీపాన సర్వేనంబరు 1738లోని మద్దిమానులగుట్ట వద్ద దాదాపు రెండెకరాల భూమిని కేటాయించారు. 15 ఏళ్ల కిందట సుమారు వందమంది కళాకారులకు పట్టాలు మంజూరు చేశారు. మరికొంత మందికి పట్టాలు ఇచ్చేందుకు వీలుగా భూమిని కేటాయించారు. ఈక్రమంలో కళాకారుల కాలనీ పేరిట లేఅవుట్ వేశారు. కదిరికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటం... పట్టాలు ఇచ్చిన ప్రాంతం బండరాళ్లతో నిండి ఉండటంతో లబ్ధిదారులు ఇళు కట్టుకోలేకపోయారు. తరువాత బాహ్యవలయ రహదారి ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం.. ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాల సొంత భవనాలను ప్రారంభించడంతో కొందరు దళారీలు కళాకారుల కాలనీపై కన్నేశారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఖాళీ భూమిలో పట్టాలు ఇప్పించడం, ఇళ్ల నిర్మించుకోలేని లబ్ధిదారులను గుర్తించి... వారి నుంచి కొనుగోలు చేసిన పట్టాలను మార్పిస్తామంటూ ఇతరులకు విక్రయించే ప్రక్రియ జోరందుకుంది. ఫలితంగా సదరు కాలనీలో ఐదుగురు కూడా కళాకారులు లేరు.

**నకిలీ పట్టాలు జోరు**

కళాకారుల కాలనీ ప్రాంతంలో సెంటు స్థలం రూ.12 లక్షల వరకు ధర పలుకుతోంది. ప్రధాన రహదారులతో పాటు సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో కాలనీలో స్థలం పొందేందుకు ఎక్కువ మంది ప్రయత్నిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న దళారులు ఒకే స్థలానికి రెండు, మూడు పట్టాలు సృష్టిస్తున్నారు. తమపేరిట పట్టాలు మార్పుచేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు విక్రయ అగ్రిమెంట్లు సృష్టించుకుని తమ పేరిట పట్టా మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. సర్వేనంబరు 83లోనే ఇదే పరిస్థితి నెలకొంది. రెండు దశాబ్దాల కిందట దివ్యాంగుల కోసం కేటాయించిన స్థలంలో ఇతరుల పట్టాలను పొందారు. మరికొందరు ఒకటి కంటే ఎక్కువ పట్టాలను తమ వద్ద అంటిపెట్టుకుని పరస్పరం కేసులు పెట్టుకుంటున్నారు.

**తగిన చర్యలు తీసుకుంటాం - వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి**

గతంలో సర్వేనంబరు 1738, 83లో కేటాయించిన పట్టాల ఆధారంగా లబ్ధిదారుల వివరాలను తెలుసుకుంటాం. ప్రభుత్వం నుంచి పట్టాలు అందుకున్న వారుకాకుండా ఇతరులు ఉన్నట్లయితే విచారణ జరుపుతాం. నకిలీ పట్టాలు సృష్టించినట్లు తేలినా, తప్పుడు అగ్రిమెంట్లు తయారు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

# గట్టు జారుతోంది.. గుండె అదురుతోంది!



ఎస్.రాయవరం : ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు పంచాయతీ శివారు గ్రామం సోముదేవుపల్లి వద్ద వరహానది గట్టు కోతకు గురై ఆరేళ్లు గడిచింది. ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. ఇక్కడ గట్టు నిర్మాణాన్ని ప్రతిపాదనలతో సరిపెడుతున్నారు తప్ప, ముందడుగు పడటంలేదు. ప్రతిఏటా నీటి ఉద్ధృతికి గట్టు కొద్దికొద్దిగా జారుతూ నదిలో కలిసిపోతోంది. వైకాపా ప్రభుత్వం గట్టు పటిష్ఠతకు శాశ్వత చర్యలు చేపట్టలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు వరద వచ్చినా ప్రతిసారి పరిశీలన చేశారు తప్ప, చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర అవుతున్నా గట్టు నిర్మాణంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

**నిధులు నీళ్లపాలు**

2019 సెప్టెంబరులో వచ్చిన భారీ వరదలకు ఇక్కడి వరహానది గట్టుపై ఉన్న నూకాంబిక ఆలయంతోపాటు ప్రధాన రోడ్డు నదిలోకి కొట్టుకుపోయింది. మరుసటి ఏడాది వచ్చిన భారీ వరదతో నుంచి పాత సోముదేవుపల్లికి నిర్మించిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

2020లో జల వనరుల శాఖ రూ.30 లక్షలతో తాత్కాలిక గట్టు నిర్మించినా నీటి ఉద్ధృతికి నెల రోజులకే కొట్టుకుపోయింది.

ప్రస్తుత పరిస్థితి

ఇప్పటికే గట్టు 80 శాతానికి పైగా కోతకు గురైంది. నదిలో నీటి ఉద్ధృతి పెరిగితే గట్టు పూర్తిగా కొట్టుకుపోయి, గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

**ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో..**

సోముదేవుపల్లి గట్టు వద్ద నీటి ఉద్ధృతిని తట్టుకునేందుకు రక్షణ గోడ నిర్మాణానికి ఉన్నతాధికారులు నిర్ణయించారు. గోడ నిర్మాణానికి విపత్తు నిర్వహణ శాఖ ద్వారా నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం నిధులు మంజూరుకు ఆర్థికశాఖ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉంది. నదిని ఆనుకుని రక్షణ గోడ నిర్మాణానికి రూ.9.9 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. అమీనాభాను, ఏఈ, జలవనరుల శాఖ

# అరకు కాఫీకి ఫిదా..!



పెదవాల్తేరు : అరకు కాఫీకి ప్రత్యేక బ్రాండ్ ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ దేశానికి వెళ్లినా ఈ కాఫీని ప్రస్తావిస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా దీని రుచికి ఫిదా అవుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే వివిధ సదస్సుల్లోనూ ఈ స్టాల్ ఏర్పాటు చేసి విదేశీయులకు అరకు కాఫీ రుచి చూపిస్తున్నారు. ప్రారంభంలో విశాఖలో కంటే ఇతర ప్రాంతాల్లో ఆదరణ పొందింది. ఇప్పుడు జిల్లా వాసులు ఆ రుచిని ఆస్వాదిస్తున్నారు. నగరంలో అవుట్‌లెట్లు కూడా పెరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అవుట్‌లెట్లలో రోజుకు 10వేల మంది ఈ కాఫీ తాగుతున్నారని అంచనా.

**ఈ ప్రత్యేకతతోనే గుర్తింపు:** అరకు కాఫీ పంటను కొండ ప్రాంతాల్లో ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో ఉన్న మట్టి దీనికి అద్భుతమైన రుచిని తీసుకొచ్చింది. మిగతా ప్రాంతాల్లో వీటిని సాగు చేస్తే ఆ రుచి ఉండదు. ఆరోగ్యపరంగా కూడా మంచిదని జీసీసీ (గిరిజన సహకార సంస్థ) అధికారులు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 96 అరకు కాఫీ అవుట్ లెట్లు ఉండగా, విశాఖలో 15 ఉన్నాయి. ఇందులో నాలుగు స్వయంగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. మిగిలిన 11 ఫ్రాంఛైజీలు. సిరిపురం, ఎయిర్‌పోర్టు, జీసీసీ ప్రధాన కార్యాలయం, ఉషోదయకూడలి వద్ద జీసీసీ అవుట్‌లెట్లు ఉన్నాయి.

**విక్రయాలు ఇలా..:** నివాసాల్లో అధికంగా ఫిల్టర్ కాఫీ వాడుతుండగా, అవుట్‌లెట్లు, దుకాణాల్లో ఇన్‌స్టెంట్ కాఫీ వాడుతున్నారు. జీసీసీ ప్రధాన కార్యాలయం అవుట్‌లెట్‌లో ప్రతినెల రూ.10 లక్షల వరకు కాఫీ విక్రయాలు జరుగుతుండగా, ఉషోదయకూడలిలో రూ.3 లక్షలు, సిరిపురంలో రూ.4 లక్షలు, ఎయిర్‌పోర్టు అవుట్‌లెట్‌లో రూ.4 లక్షల విక్రయాలు జరుగుతున్నాయి.

**రెండు రకాలు:** అరకు కాఫీలో అరబికా పార్చుమెంట్, అరబికా చెర్రీ అనే రెండు రకాలను రైతులు పండిస్తున్నారు. వాటిని కిలో రూ.450, రూ.270 చొప్పున జీసీసీ కొనుగోలు చేస్తోంది. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, కేరళకు ఎగుమతి చేస్తున్నారు. కేజీ రూ.7 వందల వరకు ధర పలుకుతోందని జీసీసీ అధికారులు తెలిపారు.

# నేతన్న నేస్తం.. లేదన్నా!

పుత్తూరు : చేనేత పరిశ్రమ నానాటికీ తిరోగమనం దిశగా పయనిస్తోంది. మార్కెటింగ్ సమస్యలతో కుదేలవుతున్న పరిశ్రమను తాజాగా మానవవనరుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవలి వర్షాలతో కార్మికులు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారు. ప్రభుత్వం అందించే సాయం కోసం వారు ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేనేత వృత్తిని నమ్ముకుని 15,475 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎన్నికలకు ముందు నేతన్న నేస్తం కింద రూ.25వేలు ఇస్తామని ప్రకటించినా నేటికీ అమలుకాలేదు. వర్షాల సమయంలో 50 కిలోల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, చక్కెర, లీటరు పామాయిల్, ఆలుగడ్డలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామన్న ప్రకటన మేరకు సీఎం చంద్రబాబు జీవో అమలు చేయాలని చెప్పినా విద్యుత్తుశాఖ



నుంచి స్పందన లేదు.

ప్రస్తుతం 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు మాత్రమే అందుతోంది.

**ప్రభుత్వం ఆదుకోవాలి..**

దివ్యాంగురాలైన కుమార్తెతో కలిసి జీవిస్తున్నా. మగ్గం పనికి వెళ్తేనే పూట గడుస్తోంది. వర్షం కారణంగా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. నేతన్ననేస్తం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

భద్రమ్మ, వెంకటగిరి

ఉమ్మడి జిల్లాలో చేనేత కుటుంబాల వివరాలిలా..

గుర్తింపు పొందినవి:3320

మగ్గం కలిగినవి : 4250

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వారు:15,475

# గ్రావెల్ దందా.. అడ్డుకునేదుందా!

అమలాపురం : గత ప్రభుత్వ హయాంలో మట్టి, ఇసుక వంటి సహజవనరుల దోపిడీకి అలవాటుపడినవారు ఇప్పుడూ రెచ్చిపోతున్నారు. దందా చేస్తూ భారీ స్థాయిలో ఆర్జిస్తున్నారు. మండపేట మండలం ద్వారపూడి శివారులోని వేములపల్లిలో రోజూ రూ.లక్షల విలువైన గ్రావెల్ తరలింపు సాగిపోతోంది. రాత్రి 7 గంటల నుంచి వేకువజాము వరకు తవ్వి తరలిస్తున్నారు. దీనికి ఎటువంటి అనుమతులు లేవు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వేములపల్లిలో సుమారు రెండెకరాల విస్తీర్ణంలో రోజూ 70 నుంచి 80 లారీల్లో గ్రావెల్‌ను రాజానగరం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లోని లేఅవుట్లకు తరలిస్తున్నారు. ఒక్కో లోడు రూ.5



వేలకు విక్రయిస్తున్నారు. తద్వారా రోజూ రూ.4 లక్షల వరకు జేబులో వేసుకుంటున్నారు. గత వారం పది రోజులుగా ఈ వ్యవహారం సాగుతోంది. పగటి వేళల్లో యంత్రాలను చెట్ల వెనుక దాచేస్తూ.. చీకటి పడితే బయటకు తీస్తున్నారు. నీ పదుల సంఖ్యలో గ్రావెల్ లారీలు గ్రామంలో వేగంగా తిరుగుతుండడంతో స్థానికులు ద్వారపూడి వంతెనపై అడ్డుకున్నారు. ఓ చోదకుడు దుర్భాషలాడడంతో వివాదం పెద్దదైంది. మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు వద్ద ప్రస్తావించగా వేములపల్లి పరిధిలో గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పాలారు.. సంరక్షణకు కదిలారు

శాంతిపురం : కుప్పం నియోజకవర్గంతో పాటు పలమనేరు పరిధిలోని వి.కోట మండలంలో 47 కి.మీ పరిధి విస్తరించి ఉన్న పాలారు నదీ జలాలను ఒడిసి పట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. పాలారులో వర్షపు నీటి సంరక్షణకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఐదేళ్ల వైకాపా పాలనలో పాలారు చెక్‌డ్యాంల దుస్థితిని పట్టించుకోలేదు. నదీ జలాల సద్వినియోగానికి రెండు చోట్ల చిన్నపాటి రిజర్వాయర్‌లను నిర్మిస్తామన్న జగన్ హామీ కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన వెంటనే పాలారు జల సంరక్షణకు సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారు. నాలుగు



మండలాల్లో 17 చోట్ల చెక్‌డ్యాంల పునర్నిర్మాణం, మరమ్మతులకు రూ.59.27 కోట్ల అంచనాలతో నిధులు మంజూరు చేస్తూ.. నీటిపారుదలశాఖ ఈ ఏడాది జూన్‌లో ఉత్తర్వులను జారీ చేసింది. కుప్పం మండలంలోని కంగుంది వద్ద శ్యామన్న చెక్‌డ్యాం పునర్నిర్మాణానికి గతంలో రూ.4.45 కోట్లు అంచనా కాగా... సవరించిన అంచనా మేరకు సోమవారం రూ.10.17 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రారంభమైన పనులు.. రామకుప్పం- 2

శాంతిపురం-6 కుప్పం- 5 పలమనేరు, వి.కోట- 4

# పరవళ్లు.. కుప్పం



కుప్పం : హంద్రీనీవా యజ్ఞం ఫలిస్తోంది. కుప్పం కరవును జయిస్తోంది. సీఎం చంద్రబాబు దార్శనికత త్రిరాష్ట్ర కూడలి ముఖచిత్రాన్నే మార్చుతోంది. ఎలాంటి ప్రాజెక్టులు లేనిచోట.. సాధారణ వర్షపాతం నమోదు కాకుంటే తాగు, సాగునీటికీ తిప్పలు తప్పని ప్రాంతం నేడు ఎక్కడ చూసినా నిండుకుండలే కనిపిస్తున్నాయి. సీఎం ప్రత్యేక చొరవతో ఈ ఏడాది హంద్రీ–నీవా పూర్తికావడంతో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో ఈ ఏడాది వరుణుడి కరుణ లేకపోయినా.. నియోజకవర్గంలోని చెరువులు జలకళ సంతరించుకుని అన్నదాతల్లో ఆనందం నింపుతున్నాయి.

**రెండు నియోజకవర్గాల్లో..**హంద్రీ–నీవా ప్రాజెక్టులో భాగంగా కుప్పం, పలమనేరు నియోజకవ ర్గాల్లోని 110 చెరువులను నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు వంద చెరువుల వరకు నింపినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన చెరువులను నింపి వీటి ద్వారా కింద చెరువులకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**కరవు మాయం**

2017లో వర్షాభావం పరిస్థితుల కారణంగా తీవ్ర కరవు నెలకొంది. ఆ సమయంలో గడ్డిపోచ సైతం లభించకపోవడంతో పశుపోషణకు గుడుపల్లె ప్రాంత రైలులో బెంగళూరుకు వెళ్లి అక్కడ కొన్ని ప్రాంతాల్లో పచ్చిగడ్డిని సేకరించి సాయంత్రానికి రైళ్లలో గ్రామాలకు వచ్చేవారు. ప్రస్తుత మార్పుపై పాడిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అంకెల్లో ..**కుప్పం బ్రాంచి కెనాల్‌కు చేసిన ఖర్చు రూ.130.994 కోట్లు110 చెరువులకు 0.61 టీఎంసీలు అవసరం కాగా చెరువుల విస్తరణతో ఇప్పటికే టీఎంసీ పైగా నీళ్లు చేరాయి.

ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం 6,300 ఎకరాలు **చెర్లోపల్లిలో అదనంగా నిల్వ** జనవరి వరకు కృష్ణా జలాలు ప్రవహిస్తా యి. అనంతపురం జిల్లాలోని చెర్లోపల్లె రిజర్వాయర్‌లో అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నీటిని నిల్వ చేస్తున్నాం. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని వంద చెరువులు నింపాం. మిగిలిన పది చెరువులను జనవరి నెలాఖరుకు నింపేలా లక్ష్యం పెట్టుకున్నాం. గోవర్ధన, డీఈఈ

## మెట్ట.. పందెంకోళ్ల 'బుట్ట'..

తుని : పెద్ద పండుగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలకు రంగం సిద్ధమవుతుంది. మెట్ట ప్రాంతం పందెంకోళ్ల పెంపకానికి అడ్డాగా మారింది. ఆర్నెళ్ల ముందుగానే వివిధ ప్రాంతాల నుంచి వివిధ పందెం కోళ్లను తెచ్చిన పెంపకందారులు వాటికి ప్రత్యేక ఆహారం అందిస్తూ ట్రయల్ రన్‌గా వాటికి కత్తి కట్టకుండా తర్ఫీదు ఇస్తుండటం విశేషం. సంక్రాంతి నేపథ్యంలో వీటిని కొనేందుకు పందెంరాయుళు వస్తున్నారు.

**పుంజులకు ప్రత్యేక ఆహారం**

తుని, తొండంగి, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలో కోడిపుంజుల పెంపకం ఆర్నెళ్లుగా ఊపందుకుంది. సంక్రాంతి వరకు వీటికి ప్రత్యేక ఆహారం, శిక్షణ ఇచ్చి పందేలకు సిద్ధం చేస్తున్నారు. పందెంకోడికి రోజూ గుడ్డు, బాదంపప్పుతోపాటు మూడు రోజులకోసారి జంతుమాంసం పెడుతుంటారు. రోజూ రాగులు, గంట్లు, ధాన్యం మేతగా అందిస్తున్నారు. నిత్యం నీటి తొట్టెలో వాటికి స్నానం చేయించి



ఈత కొట్టేలా ఏర్పాట్లు చేశారు. వారానికోసారి ఆయుర్వేద మూలికలు ఉన్న నీటిలో 30 నిమిషాలు ఉంచి వాటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**జాతి రకాన్ని బట్టి ధర**ప్రధానంగా కొక్కిర, పచ్చకాకి, నల్లసవల, మైలా, పింగళి, డేగ, కాకి, సేతువా, పాప తదితర రకాల పుంజులకు ఒక్కొక్క దానికి రూ.10 వేలు నుంచి 50 వేలు వరకు ధర ఉంటుంది. ఈ ఏడాది విదేశీ జాతులకు చెందిన పుంజులను రంగంలోకి దింపేందుకు సిద్ధం చేయడం విశేషం. ఇండో అమెరికన్ జాతి పుంజు మెట్ట ప్రాంతంలో రంగంలోకి దిగనుంది. డేగ ముక్కు, కోడిపెట్టతోక, కలిగిన ఈ పుంజు ప్రత్యర్థిని సునాయాసంగా ఎదుర్కొంటుందని పెంపకందార్లు చెబుతున్నారు.

## గిరిప్రదక్షిణ రోడ్డుకు మహర్దశ ఎప్పటికో..?

అన్నవరం : ఏటా కార్తిక పౌర్ణమి రోజున జరిగే అన్నవరం సత్యదేవుని గిరిప్రదక్షిణ మార్గం అభివృద్ధికి ప్రభుత్వం దృష్టిసారించాల్సి ఉంది. 2019 జనవరిలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ మార్గంలో ఉన్న గ్రావెల్ రోడ్డులో బీటీ రోడ్డు వేయడానికి రూ. 5 కోట్ల ఉపాధి హామీ నిధులు మంజూరవగా అదే ఏడాది ఫిబ్రవరి 4న అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. పనులు ముందుకు సాగలేదు. గిరిప్రదక్షిణ సమయం లో లక్షలాది భక్తులు రాళ్లు గుచ్చుకుని ఇబ్బందులు పడుతున్నారు.

**నిధులు మంజూరైనా..**8.2 కి.మీ. గిరిప్రదక్షిణ మార్గంలో తారు రోడ్డు 3.9 కి.మీ, గ్రావెల్‌రోడ్డు 4.3 కి.మీ, 2018లో గ్రావెల్ రోడ్డును 20



అడుగులకు విస్తరించి అభివృద్ధి చేశారు. బీటీ రోడ్డుగా తీర్చిదిద్దడానికి ఉపాధి హామీ నుంచి రూ.4.50 కోట్లు, జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుంచి రూ.50 లక్షలు అప్పటి కలెక్టర్ మంజూరు చేయగా శంకుస్థాపన జరిగింది. ఆరేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించకపోవడంతో పనులు జరగలేదు. నిధుల మంజూరు, శంకుస్థాపన సమయంలో అన్నవరం ఈవోగా ఉన్న త్రినాథరావు ప్రస్తుత ఈవోగా ఉన్నారు. ప్రభుత్వం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దృష్టిసారిస్తున్న నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## తిప్పలు తినేస్తున్నారు

నంద్యాల : మట్టిమాఫియా అక్రమార్కులు తిప్పలపై కన్నేశారు. రెండు విధాలా ఆదాయం లభిస్తుండటంతో నిత్యం తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధి.. రుద్రవరం మండలంలోని తువ్వపల్లె తిప్ప, టి.లింగందిన్నె తిప్ప, ఆలమూరు తిప్పల్లో పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఎర్రమట్టి లభిస్తుండటంతో అక్రమార్కులు ఈ తిప్పలపై కన్నేశారు. ఇక్కడి నాణ్యమైన మట్టి.. ఇటుక బట్టీలకు ఉపయోగపడుతుంది. మట్టి, రాళ్లతో కూడిన మొరం గుంతలు పూడ్చేందుకు.. లెవలింగ్‌లకు వాడుతారు. ఇలా.. రెండువిధాలా పనికొస్తుండటంతో గత కొన్నేళ్లుగా పెద్దఎత్తున తవ్వకాలు చేస్తున్నారు. అందిన కాడికి దోచుకుంటున్నారు. ఎవరు అధికారంలోకి వస్తే వారిదే తిప్ప అన్నట్లు తవ్వకాలు సాగుతున్నాయి.

**పల్లెల్లో వసూళ్ల పర్వం** తిప్పల్లో మొరం ధరలు రెండు విధాలుగా ఉన్నాయి. స్వయంగా వచ్చి తవ్వుకుని మొరం తీసుకెళితే ట్రాక్టరుకు రూ.200 ఇవ్వాలి. తవ్వేందుకు వీలుకాకుంటే టిప్పరు ధర రూ.5 వేలు చెల్లిస్తే కోరిన ప్రాంతానికి తరలిస్తారు. 'లెక్క' వసూలు చేసేందుకు రుద్రవరం, ఆలమూరు గ్రామాలకు చెందిన కొందరు దళారుల అవతారమెత్తారు. తిప్పల మీద తవ్వకాల కోసం ప్రత్యేకంగా కొందరిని నియమించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరు కాపు కాస్తున్నారు. రోజుకు ఎన్ని వాహనాలు వెళ్తున్నాయి.. ఎంత తవ్వారు అన్న వివరాలు 'పక్కా'గా నమోదు చేస్తున్నారు.

**నిఘా కరవు** రెవెన్యూ, మైనింగ్, పర్యావరణ అనుమతులు లేకుండానే యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో వాహనాల్లో మొరం తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఖజానాకు పైసా కూడా జమకాకున్నా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మరోవైపు తిప్పల మీద నుంచి కిందకు వాహనాలు వేగంగా వస్తుండడంతో రెడ్డిపల్లె, తువ్వపల్లె సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో పంట పొలాలపై దుమ్ము పేరుకుపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమ ఖనిజం



చిల్లకూరు : వైకాపా హయాంలో జరిగిన ఖనిజ దోపిడీపై చర్యలు కరవయ్యాయి. అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మొదట్లో సర్వే చేయించింది. 19 లక్షల టన్నులు తరలిపోయినట్లు లెక్క తేలగా రూ.266 కోట్లు ఖజానాకు నష్టం వాటిల్లినట్లు గుర్తించింది. తాఖీదులిచ్చి సరిపెట్టారేగానీ అక్రమార్కులపై నేటికీ చర్యల్లేవు. ప్రస్తుతం ఖనిజం నాణ్యత కొరవడి ప్రభుత్వ ఆదాయం గణనీయంగా తగ్గింది. ఇతర ప్రాంతాలకు తరలించే ఖనిజం తగ్గిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**ప్రత్యామ్నాయం చూసుకోవడంతో**

ఇక్కడి గనుల్లోంచి వెలికితీసిన సిలికా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గోవా రాష్ట్రాల్లోని గాజు పరిశ్రమలకు రవాణా అయ్యేది. వైకాపా హయాంలో లక్షల టన్నుల ఖనిజం అప్పటి పెద్దల కనుసన్నల్లో సరిహద్దులు దాటి వెళ్లిపోయింది. 2024లో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే తవ్వకాలకు బ్రేక్ పడింది. కూటమి సర్కారు కొలువుదీరి ఎనిమిది నెలలు గడిచేదాకా తవ్వకాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో పరిశ్రమల వారు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. వ్యాపారులు, పరిశ్రమల వారికి గతంలో విక్రయించే ధరలో కొంతమొత్తాన్ని పెంచారు. ఇది కూడా ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపింది.

**40 అడుగుల లోతువరకు**

తీర ప్రాంతంలో ఖనిజ నిల్వలు దాదాపుగా కనుమరుగైపోయాయి. 30– 40 అడుగుల లోతు వరకు తవ్వడంతో గుంతల్లో నీరు చేరింది. మరోవైపు ఇక్కడి పొలాలు సాగుకు పనికిరాకపోవడంతో అన్నదాత కన్నీరు కారుస్తున్నారు.

**తిరోగమనం దిశగా..**

దేశంలోనే అరుదుగా దొరికే సిలికా ఖనిజం చిల్లకూరు, కోట మండలాల్లో లభ్యమవుతోంది.

ఇక్కడ దాదాపు ఆరువేల హెక్టార్లలో ఖనిజం నిక్షిప్తమై ఉంది. రెండు మండలాల నుంచి గతంలో నెలకు మూడు లక్షల టన్నుల మేర ఇతర రాష్ట్రాలకు రవాణా అయ్యేది.పరిశ్రమల డిమాండ్ లేకపోవడంతో 70 వేల టన్నులకు పరిమితమైంది. ఇతర రాష్ట్రాల నుంచి డిమాండు లేకుంది.

గతంలో రాయల్టీ రూపేణా నెలకు రూ.9 కోట్ల వరకు జమయ్యేది. ప్రస్తుతం రూ.3.50 కోట్లకు పరిమితమైంది.

# క్వాంటమ్.. కొంగొత్త విజ్ఞానం



కాకినాడ : క్వాంటమ్ కంప్యూటింగ్..ఆధునిక సాంకేతికతతో పనిచేసే ఈ వ్యవస్థను దేశంలో తొలిసారి మన రాష్ట్రంలో తీసుకురాబోతున్నారు. ఉన్నత విద్యాసంస్థలు క్వాంటమ్ టెక్నాలజీపై మైనర్ కోర్సులను విద్యార్థులకు పరిచయం చేస్తున్నాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆచార్యులకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా క్వాంటమ్–05 పేరిట రోజూ 2 గంటలు ఆన్‌లైన్ శిక్షణ సాగుతోంది.

**కోర్సుల పునఃరూపకల్పన**

కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాంటమ్ మిషన్ ప్రారంభించాక అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ), ప్రముఖ సంస్థలతో కలిసి కోర్సులను రూపొందించింది. సీఎస్ఈ, మిగతా కోర్ బ్రాంచిల అవసరాలకు అనుగుణంగా జేఎన్‌టీయూ ఆచార్యులు, నిపుణుల సూచనలతో పునఃరూపకల్పన (రీడిజైన్) చేశారు. సర్వే ఆఫ్ క్వాంటమ్ టెక్నాలజీస్–అప్లికేషన్, ఫౌండేషన్ ఆఫ్ క్వాంటమ్ టెక్నాలజీస్ పేరిట కోర్సుల సిలబస్‌ను ఈ ఏడాది ప్రవేశపెట్టారు.

**పూర్తిచేస్తే 18 క్రెడిట్లు..**

ఇంజినీరింగ్‌లో థియరీ, ల్యాబ్ సబ్జెక్టులు, ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్ వారీగా విద్యార్థులకు క్రెడిట్లు ఇస్తారు. బీటెక్ పూర్తిచేయడానికి 160 క్రెడిట్లు కావాలి. అదనంగా క్వాంటమ్ మైనర్ కోర్సు పూర్తిచేస్తే 18 క్రెడిట్లు ఇస్తారు. జేఎన్‌టీయూ, అనుబంధ కళాశాలల్లో మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు ఈ కోర్సు అందుబాటులో ఉంది.

**ప్రయోజనాలవీ..**

క్వాంటమ్ కంప్యూటింగ్ ఇంజినీర్, క్వాంటమ్ అల్గారిథమ్ డెవలపర్, క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ స్పెషలిస్ట్ వంటి ఉన్నత ఉద్యోగాలకు అర్హత పొందే అవకాశం. ఐఐటీ, ఐఐఎస్సీ, డీఆర్‌డీవో, ఇస్రో వంటి సంస్థల ప్రాజెక్టుల్లో పనిచేసే వీలు.

సమస్యల పరిష్కార నైపుణ్యం మెరుగు.. ప్రాంగణ ఎంపికల్లో ప్రాధాన్యం, అంకుర సంస్థల ఏర్పాటుకు అవకాశం

ఐటీ సంస్థల భాగస్వామ్యం

ఆన్‌లైన్‌లో దశల వారీగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. క్వాంటమ్ టెక్నాలజీ–05 పై శిక్షణ ఇస్తున్నారు. ఐబీఎం, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీలు భాగస్వామ్యం అవుతున్నాయి. ఐఐటీ ధన్వాద్, ఎన్ఐఎస్ఈఆర్, భువనేశ్వర్, ఏకే చౌదరి స్కూల్ ఆఫ్ కోల్‌కతా నిపుణులు ఆన్‌లైన్ శిక్షణలో దిశానిర్దేశం చేస్తున్నారు.


కృష్ణప్రసాద్, జేఎన్‌టీయూకే పరిశోధన,అభివృద్ధి విభాగం సంచాలకులు

## బెబ్బులికి ఉచ్చుపాశం

ఆత్మకూరు : నల్లమలలో పెద్ద పులుల సంఖ్య పెరుగుతోంది. వీటి సంతతి అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు. మరోవైపు వేటగాళ్లు అదేస్థాయిలో వాటికి ఉచ్చులు బిగించి వేటాడుతున్నారు. నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఎవరూ అడవిలో సంచరించకూడదు. వేటగాళ్లు యథేచ్ఛగా తిరుగుతూ వన్యప్రాణుల ప్రాణాలు తీస్తున్నారు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి రేంజిలో వన్యప్రాణులను వేటాడేందుకు పన్నిన ఉచ్చులు లభించడంతో ఎన్ఎస్‌టీఆర్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వేటగాళ్ల ఆచూకీ కోసం నల్లమలలో జల్లెడ పట్టి గాలిస్తున్నారు. 87 బేస్ క్యాంపుల పరిధిలో 127 మంది బీట్ ఆఫీసర్లు, నలుగురు డీఎఫ్‌వోలు, రేంజర్లు కలిపి మొత్తం 250 మంది వేటగాళ్ల కోసం గాలిస్తున్నారు. ముఖ్యంగా నీటి కుంటలు, గడ్డి మైదానాలు, జంతువులు సంచరించే ప్రాంతాల్లో నిఘా పెట్టారు.

**రక్షణకు పకడ్బందీ చర్యలు : విజయ్‌కుమార్, ఎఫ్‌డీపీటీ**

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని నాగలూటి రేంజిలో తుప్పు పట్టిన ఉచ్చులను గుర్తించాక సిబ్బందిని అప్రమత్తం చేశాం. నలుగురు డీఎఫ్‌వోలతోపాటు సిబ్బంది బృందాలుగా విడిపోయి తనిఖీ చేస్తున్నారు. నల్లమల పరిసర గ్రామాలకు చెందిన వేటగాళ్లు అడవిలో ఉచ్చులు



పన్నుతున్నారు. ఇటీవల పట్టుబడిన ఉచ్చులను పరిశీలించగా స్థానికులు తయారుచేసినట్లు గుర్తించాం. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత.. వేటగాళ్ల సమాచారం తెలిస్తే అటవీ అధికారులకు తెలపాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

**జరిగిన కొన్ని ఘటనలు**

2022లో తెలుగుగంగ కాల్వలో రెండు పులుల కళేబరాలు కొట్టుకొచ్చాయి. అవి సహజంగా మృతి చెందాయా? లేక ఉచ్చుల్లో చిక్కి చనిపోయిన వాటిని తీసుకొచ్చి పడేస్తున్నారా? అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. 2022, ఆగస్టు 8వ తేదీన నంద్యాల జిల్లా వెలుగోడు రేంజి పరిధిలోని బుడుగుల వాగులో పెద్దపులి కళేబరాన్ని గుర్తించారు. మెడకు బిగుసుకున్న ఉచ్చుతో అది కొద్ది నెలలపాటు ప్రాణాలతో పోరాడింది. చివరికి వాగులో నిర్జీవంగా కనిపించింది.

ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్‌లో నాలుగేళ్ల వయస్సున్న పులి చనిపోయి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఇది 2024లో ఉచ్చు నుంచి తప్పించుకున్న పులి అయిండొచ్చని.. అనారోగ్యంతో చనిపోయి ఉండొచ్చని వారు భావిస్తున్నారు. అటవీ శాఖ కెమెరా ట్రాప్‌ల సహజ పరిశీలనలో భాగంగా ఈ ఏడాది జూన్ 16న ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి రేంజిలో మెడకు ఉచ్చుతో తీవ్రంగా గాయపడి తిరుగుతున్న పెద్ద పులిని అధికారులు గుర్తించారు. ఇది టి–132 ఆడపులిగా గుర్తించారు. రెండు నెలలు కష్టపడి దానిని పట్టుకుని తిరుపతిలో చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోయింది.

## రాయింబవళ్లు రవాణా

నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీ వసూలు బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో వారు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాయల్టీ వసూలు చేసే కాంట్రాక్టును సుధాకర ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఇందుకు గానూ ఆ సంస్థ ఉమ్మడి జిల్లాలో వసూళ్లు చేసుకున్నందుకుగానూ ప్రభుత్వానికి ప్రతినెలా రూ.14.77కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. వాస్తవానికి గత వైకాపా ప్రభుత్వంలో వచ్చిన ఆదాయంతో పోల్చుకుంటే భారీఎత్తున ఆదాయం లభిస్తున్నట్లే. వైకాపా ప్రభుత్వంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలకు చెల్లించకుండా ఎవరికి వారు యథేచ్ఛగా నాపరాయిని తరలించుకుపోయారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వ అధికారులు వసూలు చేయాల్సిన రాయల్టీ మొత్తాలను గతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు అనధికారికంగా వసూలు చేసి అడ్డగోలుగా సంపాదించుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఓ ప్రైవేటు ఏజెన్సీకి రాయల్టీ వసూలు బాధ్యతలు అప్పగించడం... ఆ సంస్థ కూడా భారీగా ప్రభుత్వానికి చెల్లించడానికి ముందుకు రావడంతో అంతా పారదర్శకంగానే జరుగుతుందని భావిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీకి వసూలు బాధ్యతలు అప్పగించినా అనధికార వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట పడడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రాయల్టీ పేరుతో దోపిడీ**

ఎలాంటి ఖనిజ ఉత్పత్తులు రవాణా చేసేవారైనా ముందుగా నిర్ణీత పరిమాణానికి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి వారిచ్చిన రసీదు దగ్గరపెట్టుకునే సరకును రవాణా చేయాలి. గనుల చెక్‌పోస్ట్ దగ్గర ఆయా రశీదులను చూపించిన తరువాతే ఆయా వాహనాలను పంపిస్తారు. లేదంటే వారి నుంచి ఫైన్ వసూలు చేస్తారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారులు సరకును రవాణా చేసుకోవడానికి వీలుగా రాయల్టీ రుసుములను చెల్లించడానికి ప్రైవేటు ఏజెన్సీవారిని సంప్రదిస్తే వారు నగదు మాత్రమే స్వీకరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. యూపీఐ చెల్లింపులు, ఆన్‌లైన్ చెల్లింపులను వారు అనుమతించకపోవడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలికాలంలో అత్యధికులు వారి ఫోన్ల నుంచే చెల్లింపులు చేస్తున్నారు. వాటిని అనుమతించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

**ఇన్‌వాయిస్‌లో ఎక్కడ**

వ్యాపారులు రాయల్టీ చెల్లిస్తే వాటి వివరాలు గనులశాఖకు చెందిన అంతర్జాల చిరునామాలో కూడా ఉండాలి. ఇందుకు విరుద్ధంగా కొందరు రాయల్టీ చెల్లించినా అధికారిక అంతర్జాల చిరునామాలో ఉండడంలేదని ఆరోపిస్తున్నారు. ఫలితంగా భవిష్యత్తులో తమకు సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

జీఎస్టీ 18 శాతం వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్నారు. దానికి సంబంధించిన ఇన్‌వాయిస్‌లు ఇవ్వమంటే ఇవ్వడంలేదు. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఆందోళన చేయడానికి కూడా వ్యాపారులు సిద్ధమవుతున్నారు. విషయాన్ని వ్యాపారులు అధికారికంగానే ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.**పన్ను చెల్లించకుండానే పరుగులు**

రాయల్టీ చెల్లించకుండా గనుల నుంచి నాపరాళ్లు, ఇతర ఖనిజ సంపదను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా నాపరాయి తరలిస్తున్న ఐదు లారీలను విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి బేతంచెర్ల దగ్గర స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు పట్టుకున్నప్పుడు రాయల్టీ రశీదులను కొన్ని గంటల తరువాత తీసుకురావడం తాజాగా కలకలంగా మారింది. వారు రశీదులు చూపించేలోపే విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. లారీలను బేతంచెర్ల పోలీసులకు అప్పగించారు.కొన్నిచోట్ల అనధికారిక వ్యక్తులు రహదారులపై నిలబడి నాపరాయి, కంకర, నాపరాయి వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనదారుల నుంచి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు.

## సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న రుక్మిణీ వసంత్!

అదృష్టం అనేది ఎప్పుడు ఎవరి తలుపు ఎలా తడుతుందో చెప్పడం అసాధ్యం. అందుకే ఆ అదృష్టం పట్టినప్పుడే సద్వినియోగం చేసుకోవాలని పెద్దలు కూడా చెబుతూ ఉంటారు. ఈ క్రమంలోనే తన అద్భుతమైన నటనతో ఏకంగా వరుసగా పాన్ ఇండియా చిత్రాలలో అవకాశాలు అందుకుంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది రుక్మిణీ వసంత్. 2024లో 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఇటీవల రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన 'కాంతార' సీక్వెల్ 'కాంతార చాప్టర్ 1' లో హీరోయిన్ గా అవకాశం అందుకొని భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా తన అందంతోనే కాదు నటనతో అందరినీ అబ్బురపరిచిన ఈమె.. కొన్ని కొన్ని సన్నివేశాలలో హీరో రిషబ్ శెట్టి కంటే కూడా అద్భుతంగా నటించి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమా ఇచ్చిన క్రేజ్ తో ఈమె లెవెల్ భారీగా పెరిగిపోయింది అనడంలో సందేహం లేదు. ఇందులో సాంప్రదాయంగా మహారాణి కనకావతీ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. అయితే అలాంటి ఈమె తాజాగా సోషల్ మీడియాలో యాక్టివ్ అయిపోయిందని చెప్పవచ్చు. అందులో భాగంగానే ఇంస్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేయగా అందులో అందరి దృష్టిని ఆకర్షించింది అని చెప్పవచ్చు.



అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా పూజా కన్నన్ డిజైన్ చేసిన పర్పుల్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో మరొకసారి మెస్మరైజ్ చేసింది. దీనికి కాంబినేషన్లో కలంకారీ తో డిజైన్ చేసిన పైటతో తన మేకోవర్ను ఫుల్ ఫిల్ చేసింది. పగడాలు పొదిగిన సింపుల్ జువెలరీ తో తన అందాన్ని మరింత రెట్టింపు చేసిందని చెప్పవచ్చు. మొత్తానికైతే పర్పుల్ కలర్ లెహంగాలో చాలా సాంప్రదాయంగా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రుక్మిణి వసంత్ సినిమాల విషయానికి వస్తే.. రక్షిత్ శెట్టి హీరోగా హేమంత్ ఎం రావు దర్శకత్వంలో వచ్చిన 'సప్త సాగరాలు దాటి' అనే చిత్రంతో లైమ్ లైట్ లోకి వచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఇకపోతే తమిళంలో ఎస్ అనే చిత్రంలో నటించిన ఈమె.. ఆ తర్వాత ఏ. ఆర్.మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా నటించిన మదరాసి సినిమాలో హీరోయిన్గా నటించింది. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ అనుకున్నంత స్థాయిలో సక్సెస్ కాలేదు. ప్రస్తుతం మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న డ్రాగన్ సినిమాలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 1994 డిసెంబర్ 10న కర్ణాటకలోని బెంగళూరులో కన్నడ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్. భారతదేశ అత్యున్నత శాంతి కాల సైనిక అలంకరణ అయిన అశోక చక్ర కర్ణాటక రాష్ట్రం నుండి పొందిన మొదటి వ్యక్తిగా పేరు దక్కించుకున్నారు.

## ది గర్ల్‌ఫ్రెండ్లో ఆ రోల్ అంత స్పెషలా? ఆ ఇద్దరునో చెప్పారట!

రష్మిక మందన్న నటిస్తున్న 'ది గర్ల్‌ఫ్రెండ్' ట్రైలర్ రీసెంట్‌గా రిలీజై మంచి బజ్ క్రియేట్ చేసింది. రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమా, ఒక ఇంటెన్స్, రియలిస్టిక్ లవ్ స్టోరీలా కనిపిస్తోంది. ట్రైలర్ కట్, ఎమోషన్స్ అన్నీ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేశాయి. అయితే, ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక ఇంట్రెస్టింగ్ గాసిప్ చక్కర్లు కొడుతోంది. ఇది సినిమాలోని ఒక కీలక పాత్ర గురించి. ఈ సినిమాలో రష్మిక, హీరో దీక్షిత్ శెట్టితో పాటు అను ఇమ్మాన్యుయేల్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతోంది. అయితే, కథలో వీళ్లతో పాటు మరో కీలకమైన పాత్ర ఉందట. ఆ పాత్ర నిడివి తక్కువే అయినా, ఇంపాక్ట్ మాత్రం చాలా ఎక్కువగా ఉంటుందని సమాచారం. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్



మొదట ఈ రోల్ కోసం చాలా పెద్ద పేర్లనే ట్రై చేశాడని టాక్. రాహుల్ రవీంద్రన్ ఫస్ట్ ఛాయిస్ ఎవరో కాదు.. 'యానిమల్', 'అర్జున్ రెడ్డి' లాంటి బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అని తెలుస్తోంది. ఒక డైరెక్టర్‌ను యాక్టింగ్ కోసం అప్రోచ్ అవ్వడం అనేది చాలా పెద్ద విషయమే. అయితే, సందీప్ రెడ్డి వంగా ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. కారణం ఏంటంటే, ఆ రోల్ కేవలం 'కామియో' (గెస్ట్ రోల్) కాదని, అంతకు మించి ఉందని, అందుకే తనకు సెట్ అవ్వదని సందీప్ ఫీల్ అయ్యాడట. గతంలో సందీప్ మహానటిలో నటించిన విషయం తెలిసిందే. సందీప్ వంగా 'నో' చెప్పడంతో, రాహుల్ రవీంద్రన్ మరో యాక్టర్‌ను ట్రై చేశాడని అంటున్నారు. ఈసారి ఆయన టాలీవుడ్ టాప్ కమెడియన్ వెన్నెల కిషోర్‌ను అప్రోచ్ అయ్యాడట. కానీ, వెన్నెల కిషోర్ కూడా ఈ రోల్ చేయడానికి ఇంట్రెస్ట్ చూపించలేదని సమాచారం. ఒక స్టార్ డైరెక్టర్, ఒక టాప్ కమెడియన్ ఇద్దరూ వద్దనుకున్న ఆ పాత్రలో అంత స్పెషాలిటీ ఏముంది? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో క్యూరియాసిటీని పెంచుతోంది. ఫైనల్‌గా, ఆ రోల్ చేసేందుకు మరెవరూ దొరక్కపోవడంతో.. డైరెక్టర్ రాహుల్ రవీంద్రనే స్వయంగా ఆ పాత్రను చేశాడని అంటున్నారు.

రీసెంట్‌గా రిలీజైన ట్రైలర్‌లో రాహుల్ రవీంద్రన్ కనిపించడంతో నిజమే అయ్యిండొచ్చనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి, అంతమంది రిజెక్ట్ చేసిన ఆ పాత్ర గుట్టు ఏంటో తెలియాలంటే నవంబర్ 7 వరకు ఆగాల్సిందే. గీతా ఆర్ట్స్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాను విద్యా కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మించారు.




## జిమ్ లో తెగ కష్టపడిపోతున్న నభా నటేష్.. స్పెషల్ ఏంటంటే?





సాధారణంగా పురుషులతో పోల్చుకుంటే మహిళలు త్వరగా ఏజ్ ఉన్నవారిగా కనిపిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా వివాహం తర్వాత గర్భం.. ఆ తర్వాత శరీరంలో వచ్చే మార్పులు.. పనిలో ఒత్తిడి ఇలా పలు కారణాల వల్ల అమ్మాయిల శరీరంలో మార్పులు వస్తూ ఉంటాయి. కానీ హీరోయిన్స్ ని చూస్తే మాత్రం 50 ఏళ్లు కాదు కదా 70 ఏళ్లు వచ్చినా సరే ఇంకా యంగ్ గా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. అసలు వీరి ఫిట్నెస్ వెనుక రహస్యం ఏంటి అని అమ్మాయిలు వెతకడం ఆరంభిస్తారు అనడంలో సందేహం లేదు. అయితే హీరోయిన్స్ లేటు వయసులో కూడా అంత అందంగా కనిపించడానికి కారణం వారు తీసుకునే డైట్ మాత్రమే కాదు జిమ్ సెంటర్లలో వారు కష్టపడే తీరు కూడా వారిని బొమ్మలా మారుస్తున్నాయి అనడంలో సందేహం లేదు. అందుకే నిత్యం జిమ్ సెంటర్లలో కనిపిస్తూ శరీరాన్ని ఫిట్ గా ఉంచుకుంటున్నారు. అంతేకాదు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి తగిన యోగా శిక్షణలు కూడా తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇటు మానసికంగా అటు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మన శరీరం ఫిట్ గా ఉంటుందని.. వయసు మీద పడినా.. అసలు తెలియదు అంటూ కామెంట్ లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అలా నిత్యం తన శరీరాన్ని ఫిట్గా ఉంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లో నభా నటేష్ కూడా ఒకరు ఈమె ఎక్కువగా సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈసారి తాజాగా తన వారం మొత్తానికి సంబంధించిన జిమ్ వీడియోని అభిమానుల తో షేర్ చేసుకుంది. అయితే ఈ జిమ్ వీడియోలో స్పెషల్ ఏంటో కూడా క్యాప్షన్ లో జోడించింది ఈ ముద్దుగుమ్మ. అసలు విషయంలోకి వెళ్తే.. సోమవారం నుంచి ఆదివారం వరకు జిమ్లో గడిపిన రోజుకు ఒక ఫోటో తీసుకుంది. వాటన్నింటినీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఆ ఒక్కొక్క ఫోటోలో సెల్ఫీ ఫోటో తోపాటు రంగురంగుల జిమ్ దుస్తులు ధరించి తన వస్త్రాల తో కూడా అందరినీ ఆకట్టుకుంది. మొత్తానికి అయితే జియో లో కష్టపడుతూనే అటు రోజుకొక ఫోటో షేర్ చేస్తూ రోజుకు ఒక రంగు డ్రెస్ ధరించినట్లు చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. గత రెండు మూడు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ బారిన పడిన ఈమె ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అందులో భాగంగానే తాజా నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభూ సినిమాలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ సినిమాలో సంయుక్త మీనన్ కూడా మరో హీరోయిన్గా నటిస్తోంది . భరత్ కృష్ణమాచార్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నిఖిల్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ మూవీ అని చెప్పవచ్చు. ఈ సినిమాతో నభా నటేష్ సక్సెస్ అందుకోవాలని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

## పెళ్లైన తర్వాత తొలి రిలీజ్ అఖిల్ కి కలిసొచ్చేనా?



అక్కినేని వారసుడు అఖిల్ కెరీర్ లో సరైన సక్సస్ ఏది అంటే ఇంత వరకూ చెప్పుకునే చిత్రం ఒకే ఒక్కటి. అదే 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్లర్'. ఈ సినిమా మినహా చేసిన సినిమాలన్నీ వృద్ధా ప్రయత్నాలుగానే కనిపిస్తాయి. కొన్ని చిత్రాలు యావరేజ్ గా ఆడినప్పటికీ అక్కినేని రేంజ్ చిత్రాలు కావవి. 'ఏజెంట్' తో యాక్షన్ స్టార్ అవుతాడు అనుకున్నారు. కానీ ఆ సినిమా పరాజయం అఖిల్ ను అంతకంతకు కిందకు లాగేసింది. ఇలా ఇన్ని పరాజయాలు అఖిల్ వేగాన్ని కూడా తగ్గించాయి. నాటి నుంచి కథలు..దర్శకుల విషయంలో సెలక్టివ్ గా ఉండటం మొదలు పెట్టాడు.

**వాళ్లందరికీ ఇది షాక్:** మునుపటిలా తొందరపడి ఏ సినిమాకు ఒకే చెప్పడం లేదు. అవసరమైతే ఇంట్లో వారి సలహాలు తీసుకుంటున్నాడు. తన నిర్ణయాలపై నే కాకుండా? పెద్దవారిని కూడా సంప్రదించి అందరికీ ఒకే అనుకుంటనే ముందుకెళ్లడం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే అఖిల్ పెళ్లి కూడా జరిగింది. పెద్దలు చూసిన అమ్మాయినే అఖిల్ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అఖిల్ ఇండస్ట్రీకి వచ్చిన వేగం చూసి ప్రేమలో పడి ఆ తరహా వివాహనికే ఆసక్తి చూపిస్తాడనే విశ్లేషణలు ఆరంభంలో వ్యక్తమయ్యాయి. కానీ వారందరికీ షాక్ ఇచ్చి డాడ్ చూసిన సంబంధాన్నే చేసుకున్నాడు.

**రాయలసీమ నేపథ్యమే కొత్తగా:** వివాహమైతే జీవితంలో కొన్ని కొన్ని మార్పులు వస్తాయంటారు. మరి అఖిల్ విషయంలో ఎలాంటి ఛేంజెస్ వస్తాయో చూడాలి. ప్రస్తుతం అఖిల్ 'లెనిన్' అనే సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. 'ఏజెంట్' ఫ్లాప్ తర్వాత కమిట్ అయిన చిత్రమిది. అలాగే పెళ్లైన తర్వాత రిలీజ్ అవుతున్న తొలి చిత్రం కూడా ఇదే. దీంతో 'లెనిన్' సక్సస్ పై అక్కినేని కుటుంబమే కాదు ఆయన అభిమానులు కూడా చాలా ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాతో అఖిల్ పెద్ద విజయం అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. %-%లెనిన్%-% కథ కూడా రొటీన్ కు భిన్నమైన చిత్రమేమి కాదు.

**వివాహం తో కొత్త ప్రయాణం:** రాయలసీమ బ్యాక్ డ్రాప్ స్టోరీ. ఓ కుటుంబ నేపథ్యంలో సాగే కథనే కొత్తగా చెప్పబోతున్నారు. సీమ యువకుడి పాత్రలో అఖిల్ నటించడం అన్నది ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది? అనడంలో ఎలాంటి సందేహం లేదు. %-%లెనిన్%-% కూడా వచ్చే ఏడాది రిలీజ్ అయ్యే సినిమాగానే కనిపిస్తోంది. సెట్స్ కు వెళ్లి కొన్ని నెలలు గడుస్తున్నా? షూటింగ్ నెమ్మదిగా జరుగుతోంది. ఇదే సమయంలో అఖిల్ పెళ్లి కూడా చేసుకోవడంతో మరింత గ్యాప్ ఏర్పడింది. వివాహం..హానీమూన్ అంటూ సెలవులు తీసుకున్నాడు. ప్రస్తుతం మాత్రం సెట్స్ కు హాజరవుతున్నాడు అనుకోండి.

## పెళ్లి విషయంలో ఓపెన్ అయిన ముద్దుగుమ్మ

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం పూర్తి చేసుకుంది. 2015 సంవత్సరంలో మలయాళం మూవీ ప్రేమమ్‌తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసింది. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడు మలయాళ సినిమాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు. కానీ లక్కీగా ఈ అమ్మడికి మొదటగా తమిళ్‌లో కోడి అనే సినిమాలో ఛాన్స్ దక్కింది. ఆ సినిమా తర్వాత తెలుగులో అ ఆ, ప్రేమమ్ సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన



ఏడాదిలోనే మంచి స్టార్డం దక్కించుకుంది. అ ఆ సినిమాలో అనుపమ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో అంతా ఆమెను అభిమానించడం మొదలు పెట్టారు, ఆ తర్వాత ప్రేమమ్ సినిమా ఆమె స్థాయిని మరింతగా పెంచేసింది.

**ప్రేమమ్‌తో టాలీవుడ్‌లో ఎంట్రీ...** తెలుగులో ఈమె 2017లో చేసిన శతమానం భవతి సూపర్ హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసే అవకాశం రాలేదు. ఇప్పటికీ టాలీవుడ్, కోలీవుడ్, మలయాళం ఇలా అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంది. దక్షిణాదిన అన్ని భాషల్లో నటించిన హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నిలిచింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు సైతం ఈమెకు ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల ఈమె పరదా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో మంచి కాన్సెప్ట్‌ను చూపించినా కమర్షియల్‌గా నిరాశ పరిచింది. అయినా కూడా ఈ అమ్మడి క్రేజ్ తగ్గలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఒకటి రెండు షూటింగ్ దశలో ఉంటే కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్లుగా సమాచారం అందుతోంది.

**అనుపమ పరమేశ్వరన్ పెళ్లి విషయంలో...** ఈ ఏడాది ఏకంగా ఆరు సినిమాలతో వచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన పెళ్లి విషయమై ఓపెన్ అయింది. మూడు పదుల వయసుకు చేరువ అవుతున్న నేపథ్యంలో అనుపమ పరమేశ్వరన్ పెళ్లి ఎప్పుడు అంటూ చాలా మంది అడుగుతూ ఉన్నారు. ఆ మధ్య అనుపమ పరమేశ్వరన్ ప్రేమలో ఉందనే వార్తలు తెగ వచ్చాయి. కానీ అవి పుకార్లే అని ఆ తర్వాత క్లారిటీ వచ్చింది. అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక చిట్ చాట్ సందర్భంగా ప్రేమ వివాహం గురించి స్పందించి అందరిని సర్‌ప్రైజ్ చేసింది. ప్రేమలో లేదని అంతా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా ఈ అమ్మడు తాను ప్రేమ వివాహం చేసుకుంటాను అని చెప్పడం ద్వారా కచ్చితంగా ఈమె ప్రేమలో ఉందని కొత్త ప్రచారం మొదలు అయింది. అయితే ఆమె మాత్రం ప్రేమ ఉన్నట్లు మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.

## కొత్త ఏడాది సీతమ్మ కొత్త కబురా?

ఒకేసారి రెండు పడవల ప్రయాణం అంత సులభం కాదు. అందులోనూ నటీమణులకు అసలే సాధ్యం కాదు. ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. బాలీవుడ్ లో ఇలా రెండు పడవల ప్రయాణాన్ని మొదలు పెట్టింది కృతి సనన్. అమ్మడు బాలీవుడ్ లో ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. వరుస ప్రాజెక్ట్ లతో క్షణం తీరిక లేకుండా గడుపు తోంది. ఓ పక్క హీరోయిన్ గా నటిస్తూ మరో వైపు కమర్శియల్ యాడ్స్ తోనూ బిజీగా ఉంది. గత ఏడాది నిర్మాణ రంగం లోకి కూడా అడుగు పెట్టింది. బటర్ ప్లై ఫిల్మ్స్ బ్యానర్ స్థాపించి తొలి చిత్రంగా దో పత్తీ నిర్మించింది. ఈ సినిమాకు డివైడ్ టాక్ వచ్చింది.

**దర్శక, నిర్మాతలతో చర్చలు:** ఈ సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. అయితే ఆ తర్వాత మళ్లీ మరో కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించలేదు. నటిగా బిజీగా ఉంది గానీ నిర్మాతగా మాత్రం బిజీ కాలేదు. ఈ నేపథ్యంలో తొలి సినిమాతోనే నిర్మాణం ఆపేసిందా? అన్న సందేహాలు బాలీవుడ్ లో వ్యకమవుతున్నాయి. నటిగా బిజీగా ఉండటంతో బ్యానర్ ని



పట్టించుకోలేని స్థితిలో ఉందా? అన్న సందేహాల నేపథ్యంలో అందుకు ఛాన్సే లేదంటూ ముందుకొచ్చింది. రెండవ సినిమాగా ఎలాంటి చిత్రం నిర్మించాలి ? అన్న దానిపై సీరియస్ గా దర్శక, రచయితలతో చర్చలు జరుపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది.

**లాంగ్ గ్యాప్ ఎందుకంటే?...** ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఆ ప్రాజెక్ట్ కు సంబంధించి అప్ డేట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త ప్రాజెక్ట్ తో పాటు మరిన్ని కథలు విని లైన్ లో పెడుతున్నట్లు వినిపిస్తోంది. ఏ సినిమా నిర్మాణమైనా వెంట వెంటనే సాధ్యమ య్యేది కాదు. సినిమాపై కోట్ల రూపాయల పెట్టుబడి అంటే ఎన్నో విషయాలు ఆలోచించాల్సి ఉంటుంది. తొలి సినిమా డివైడ్ టాక్ వచ్చిన నేపథ్యంలో కృతిసనన్ మళ్లీ అలాంటి తప్పిదాలు దొర్లకుండా జాగ్రత్త పడుతుంది. ఈ క్రమంలోనే దో పత్తి తర్వాత కొత్త సినిమాకు లాంగ్ గ్యాప్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**వెకేషన్ ఆస్వాదనలో సీతమ్మ:** తాజా అప్ డేట్ నేపథ్యంలో కొత్త ప్రాజెక్ట్ కు సమయం ఆసన్నమైనట్లే. ఇక నటిగా కృతి సనన్ ఫుల్ బిజీగా ఉంది. ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్. రాయ్ తెరకెక్కిస్తోన్న తేరే ఇష్క్ మేలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. హిందీ , తమిళ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగు తున్నాయి. అలాగే కాక్ టెయిల్ 2లోనూ నటిస్తోంది. ప్రస్తుతం కృతిసనన్ విదేశీ వెకేషన్స్ లో ఉంది. అబుదాబీ అందాల్ని ఆస్వాదిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536